
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, షెల్లమువ్వలు,పక్షవాతముతోపాటు అన్ని రకాల రోగములకు పసుమూలికలతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడ్డు,ఊట్కూర్‌మండలం మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :26 | సంచిక :89 సంపాదకులు: కోటకొండ ఎల్ల విజయరాజు | ఆదివారం 09 ఆగస్టు 2026 | పేజీలు :12 | వెల రూ5 /-




## మద్యం ధరల పెంపు...

హైదరాబాద్, ఆగస్టు 8:మద్యం ధరలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. బడ్జెట్, మిడ్-రేంజ్, ప్రీమియం సహా అన్ని రకాల బ్రాండ్ల ధరలను పెంచేందుకు కసరత్తు చేస్తోంది. దీనిపై ఏర్పాటు చేసిన సబ్-కమిటీ, సవరించిన ఎంఆర్‌పీ ధరలతో కూడిన నివేదికను గురువారం ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన తర్వాత ఎక్సైజ్ శాఖ తుది నిర్ణయం తీసుకోనుంది. ఆగస్టు 15 తర్వాత ఎప్పుడైనా కొత్త ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.రాష్ట్రంలో చివరిసారిగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో మద్యం ధరలను సవరించారు. నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి ధరలను సమీక్షించాల్సి ఉన్నప్పటికీ, గత మూడేళ్లుగా పెంపుదల - మిగతా3లో

# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

హైదరాబాద్, ఆగస్టు 8: సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, =ఆ= కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. ఈరోజు (శనివారం) సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పునఃప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు.

**రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి..**

2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. 96 శాతం పూర్తైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు



పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

## భారత స్వాతంత్ర్యం పోరాటంలో BJP-RSS పాత్ర శూన్యం: ఖర్గే



హల్ద్వానీ (ఉత్తరాఖండ్), ఆగస్టు 8: కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే భారతీయ జనతా పార్టీ , రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర శూన్యమని, వారి నుంచి కాంగ్రెస్ పార్టీ దేశభక్తి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. బీజేపీ లేదా ఆర్‌ఎస్‌ఎస్ నాయకులెవరూ దేశ స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లలేదని ఖర్గే విమర్శించారు. ఒకవేళ ఎవరైనా జైలుకు వెళ్లి ఉంటే, వారు గతంలో కాంగ్రెస్‌లో ఉండి ఆ తర్వాత - మిగతా3లో

# హైడ్రాలో 150 ఉద్యోగాలకు వేలల్లో అభ్యర్థులు..

సరూర్‌నగర్ స్టేడియంలో తోపులాట..

సరూర్‌నగర్ స్టేడియానికి వేలాదిగా తరలివచ్చిన నిరుద్యోగులు

నియామక ఈవెంట్స్‌లో తీవ్ర తోపులాట, ఉద్రిక్త వాతావరణం

గుంపును చెదరగొట్టి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు

సోషల్ మీడియాలో వైరల్ అయిన తోపులాట వీడియో



హైదరాబాద్‌లో కొద్దిపాటి ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఏ స్థాయిలో ఎదురుచూస్తున్నారో చెప్పేందుకు సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన ఘటనే నిదర్శనం. 'హైడ్రా' ప్రకటించిన 150 పోస్టుల కోసం - మిగతా3లో

## కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు: కేటీఆర్

ముఖ్యమంత్రి రేవంత్‌కు వ్యవసాయంపై అవగాహన శూన్యమన్న కేటీఆర్

నీటి హక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధమన్న కేటీఆర్

24 గంటల కరెంటు ఇస్తున్నట్లు నిరూపించాలని సవాల్

ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్‌ఎస్ తీవ్ర పోరాటం చేస్తుందని వెల్లడి



మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించినన్ని యాగాలు దేశంలో మరెవరూ చేసి ఉండరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, దైవబలం సిద్ధించాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, యాగాలు నిర్వహిస్తూనే ప్రభుత్వాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు.కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. బీఆర్‌ఎస్ అగ్రనేత హరీశ్ రావు దేవాలయాలకు వెళ్లడాన్ని ఎగతాళి చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయం, రైతాంగ సమస్యలపై కనీస అవగాహన లేదని ఆయన ఆరోపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి, ఆ జిల్లాకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు.రాష్ట్ర నీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే ఇక్కడి ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. గోదావరి బోర్డు సమావేశంలో ప్రభుత్వ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్ర శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ 24 గంటల విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. 'హైడ్రా' పేరుతో పేదలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. నీటి హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమ తరహాలోనే మరో భారీ పోరాటానికి సిద్ధమవుతామని కేటీఆర్ హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌కు భారీ స్పందన



హైదరాబాద్, ఆగస్టు 8 : ఇందిరమ్మ ఇళ్ల టవర్స్‌కు లబ్ధిదారుల నుంచి భారీ స్పందన వచ్చింది. 7,340 ఇళ్లకు 35,125 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులకు ఆగస్టు 10వ తేదీ వరకు మాత్రమే సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ గడువు విధించింది. ఆగస్టు 20వ తేదీ తర్వాత లాటరీ ద్వారా ఇళ్లను కేటాయించనుంది. మార్కెట్‌లో రూ.30 నుంచి రూ.58 లక్షల విలువైన ఫ్లాట్లను కేవలం రూ.6 లక్షలకే కాంగ్రెస్ సర్కార్ అందజేయనుంది. లబ్ధిదారులు ఇళ్ల రూకపోతే రూ.10 వేల డిపాజిట్‌ను పూర్తిగా తెలంగాణ ప్రభుత్వం తిరిగి చెల్లించనుంది. కుల, ఆదాయ సర్టిఫికెట్లు లేకుండానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఈ ఏడాదిలోగా టవర్స్ నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయనుంది. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో 7,340 ఫ్లాట్ల నిర్మాణం చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణమే లక్ష్యంగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

## 80 శాతం తగ్గిన గులాబీ విరాళాలు

హైదరాబాద్, ఆగస్టు 8:తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. ఏడీఆర్ రిపోర్ట్ ప్రకారం.. ఆ పార్టీ ఫండ్స్ ఏకంగా 82 శాతం పడిపోయాయి. గతంలో రూ. 85 కోట్లు పొందిన బీఆర్‌ఎస్‌కు రూ.15 కోట్లకు పడిపోయింది. మరోవైపు.. ఎంఐఎం పార్టీ కూడా విరాళాలను సున్నాగా ప్రకటించింది. అంతేకాకుండా.. ఈ 2 పార్టీలు తమ విరాళాల నివేదికలను ఎన్నికల కమిషన్‌కు గడువు దాటిన తర్వాతే సమర్పించాయని నివేదిక స్పష్టం చేసింది.తెలంగాణ ఏర్పడిన తర్వాత దాదాపు 10 ఏళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్)కి అధికారాన్ని కోల్పోయిన తర్వాత తీవ్ర ఆర్థిక ఎదురుదెబ్బ తగిలింది. విరాళాల సమీకరణలో బీఆర్‌ఎస్ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. పొలిటికల్ ఫండింగ్ డిస్‌క్లోజర్స్‌పై 'అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న బీఆర్‌ఎస్ విరాళాలు గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 82 శాతం క్షీణించాయి.2023-24 ఆర్థిక సంవత్సరంలో 8 మంది దాతల



ద్వారా రూ. 85 కోట్ల విరాళాలు పొందిన బీఆర్‌ఎస్ పార్టీ.. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం 4 దాతల ద్వారా రూ. 15 కోట్లు మాత్రమే రాబట్టగలిగింది. దేశవ్యాప్తంగా విశ్లేషించిన ప్రాంతీయ పార్టీలన్నింటిలోనూ అత్యధికంగా నికర రూపంలో రూ. 70 కోట్ల మేర విరాళాలు కోల్పోయిన పార్టీగా బీఆర్‌ఎస్ నిలిచింది. గతంలో - మిగతా3లో

# ప్లాన్ బిలో రేవంత్..



కర్ణాటక ఎఫెక్ట్...

హైదరాబాద్, ఆగస్టు 8:పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు, ఆ తదుపరి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కాంగ్రెస్ హైకమాండ్‌కు మాత్రమే కాకుండా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఒక కీలకమైన పాఠాన్ని నేర్పుతోంది. ముఖ్యమంత్రిగా డి.కె. శివకుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేపట్టిన కేబినెట్ విస్తరణలో కొత్తవారికి, యంగ్ లీడర్లకు అవకాశం కల్పిస్తూ 19 మందిని మంత్రివర్గంలోకి తీసుకున్నప్పటికీ, బెర్త్‌లు దక్కని సీనియర్ ఎమ్మెల్యేలు రాజీనామా బాట పట్టడం కర్ణాటక కాంగ్రెస్‌లో తీవ్ర అలజడి సృష్టించింది. సీనియర్లు, మాజీ మంత్రులు బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కడమే కాక, ఎమ్మెల్యే పదవులకు పీడ్కోలు పలికే వరకు పరిస్థితి దాటిపోవడంతో.. వారిని చల్లార్చేందుకు నామినేటెడ్ పోస్టులు, కార్పొరేషన్ ఛైర్మన్ గిరీలతో సర్దుబాటు చేసేందుకు అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేయాల్సి వస్తుంది. కర్ణాటక పరిణామాలను అత్యంత సమీపంగా పరిశీలించిన తర్వాత, తెలంగాణలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణ , రేవంత్ రెడ్డి +వణ్య ఆశయాలకు అనుగుణంగా చేయాలనుకుంటున్న మార్పులపై అధిష్ఠానం ఆలోచనా విధానం పూర్తిగా మారింది. తెలంగాణలో ప్రస్తుతం కేబినెట్‌లో ఖాళీగా ఉన్న బెర్త్‌ల భర్తీతో పాటు, కొందరు మంత్రుల శాఖల మార్పు లేదా కుదింపుపై ప్రచారం జరుగుతున్న తరుణంలో.. కర్ణాటక తరహా అసమ్మతి సెగలు హైదరాబాద్‌లో రగులుకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యలు అవసరమని రేవంత్ రెడ్డి గ్రహించారని అనుకోవచ్చు. తెలంగాణ కాంగ్రెస్‌లోనూ సీనియర్లు, సీనియర్ రీజినల్ లీడర్లు కేబినెట్ బెర్త్‌ల కోసం తీవ్రస్థాయిలో - మిగతా3లో

## సంపాదకీయం

# ఎక్కడ చూసినా జెన్‌జీ, జెన్ ఆల్ఫా గురించి మాటలే

ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ఎక్కడ చూసినా జెన్‌జీ, జెన్ ఆల్ఫా గురించి మాటలే. 25 ఏళ్ల లోపు వయసున్న తరం దేశ భవిష్యత్తును నిర్ణయించేవారు అనే అవగాహన పెరిగింది. దీంతో ఆర్ఎస్ఎస్(రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) కూడా జెన్‌జీ కోసం పాకులాడుతుందన్న వార్తలు వస్తున్నాయి. అందుకే యువత వైపు దృష్టి పెట్టిందని చర్చలు జరుగుతున్నాయి. ముంబైలోని నీతా ముకేష్ అంబానీ కల్చరల్ సెంటర్‌లో జరుగుతున్న ఒక యువ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ పాల్గొనడం ఈ చర్చను మరింత పెంచింది. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది ఐఐఎంయూఎన్ (ఇండియాస్ ఇంటర్నేషనల్ మూవ్‌మెంట్ టు యునైట్ నేషన్స్). రిషభ్ షా స్థాపించిన ఈ సంస్థ 15 ఏళ్లుగా యువతలో నాయకత్వం, భారతీయ దృక్పథం, ప్రపంచ సమస్యలపై చర్చలు ప్రోత్సహిస్తోంది. ప్రతీ సంవత్సరం యూత్ కార్యక్రమాలు నిర్వహించే ఈ సంస్థ ఈసారి 100కు పైగా ప్రధాన పట్టణాల నుంచి 15 నుంచి 19 ఏళ్ల వయసున్న వేలాది మంది విద్యార్థులను ఎంపిక చేసింది. నాలుగు రోజుల కార్యక్రమంలో వసతి సౌకర్యాలతో శిక్షణ, చర్చలు జరుగుతాయి. చివరి రోజు మోహన్ భగవత్ జెన్‌జీపై ప్రసంగించి, సంభాషణ జరపడం ప్రత్యేకం. భారత్ భవిష్యత్‌గా పిలిచే యువత నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా నిరుద్యోగం, విద్యారంగంలో విపరీతమైన ఖర్చులు, ప్రభుత్వ సంస్థలపై నమ్మకం తగ్గడం వంటి అంశాలు యువతను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో యువత సమస్యలను జాతీయ స్థాయిలో చర్చకు తీసుకురావడానికి కాక్రోచ్ జనతా పార్టీ ఒక భారీ కార్యాచరణ చేపట్టింది. క్యాబోల్తీ పబ్లిక్‌పేరుతో దేశవ్యాప్త ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీజేపీ తన భవిష్యత్ ప్రణాళికలను, జాతీయ కార్యవర్గాన్ని వెల్లడించింది. కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, ప్రత్యక్షంగా క్షేత్ర స్థాయిలో యువతతో మమేకమవ్వడమే ఈ ప్రచార ముఖ్య ఉద్దేశమని సంస్థ స్పష్టం చేసింది. దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్లలోపు వారే ఉన్నప్పటికీ, రాజకీయ పార్టీలు, పార్లమెంటు వారి సమస్యలను పట్టించుకోవడం లేదని అభిజీత్ దీప్కే ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఈ ప్రచారం నాలుగు అంశాంపై దృష్టి పెట్టింది. దేశంలో విద్యావంతులైన యువతకు ఉద్యోగాలు లభించకపోవడం అతి పెద్ద సమస్యగా మారింది. పాఠశాలలు, కళాశాలలు, కోచింగ్ సెంటర్‌లలో ఫీజులు ఆకాశాన్ని తాకుతున్నాయి. విద్య అనేది ప్రాథమిక హక్కు అయినప్పటికీ, అది నేడు ఒక వ్యాపారంగా మారి విద్యార్థులపై అప్పుల భారాన్ని మోపుతోందని సీజేపీ ఆరోపించింది. న్యాయవ్యవస్థలో సామాన్యులకు జరుగుతున్న జాప్యం, మీడియా సంస్థలు ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ ప్రజల గొంతుకను వినిపించకపోవడం వంటి అంశాలపై ప్రజల్లో నమ్మకం తగ్గుతోందని దీప్కే పేర్కొన్నారు. పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన, ఈ20 ఇంధన విధానం, దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల గురించి యువతకు అవగాహన కల్పించడం.వచ్చే నెల నుంచి క్యా బోల్తీ పబ్లిక్ ప్రచారం దేశవ్యాప్తంగా ప్రారంభంకానుంది. సీజేపీ బృందం దేశంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి యువతతో నేరుగా సంభాషిస్తుంది. వారి ఫిర్యాదులు, అంచనాలు, వారు ఎలాంటి రాజకీయాన్ని కోరుకుంటున్నారు అనే విషయాలను తెలుసుకోవడానికి ఈ పర్యటనలు దోహదపడతాయి. ఈ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి ఒక భారీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా ప్రారంభించారు. ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ ద్వారా ఎవరైనా ఉచితంగా సీజేపీలో సభ్యులుగా చేరవచ్చు. అయితే సభ్యత్వం పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మవద్దని, ఇది పూర్తిగా ఉచితమని సీజేపీ స్పష్టం చేసింది. ఈ ఉద్యమాన్ని సమర్థవంతంగా నడిపించడానికి13 మంది సభ్యులతో కూడిన తొలి జాతీయ కార్యవర్గాన్ని సీజేపీ ప్రకటించింది. జాతీయ కన్వీనర్‌గా అభిజీత్ దీప్కే, కో- కన్వీనర్లుగా అశుతోష్ రాంకా, సౌరవ్ దాస్ ను నియమించారు. ఈ బృందం గతంలో జంతర్ మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల నిరసనల్లో కీలక పాత్ర పోషించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంలో ఈ నిరసనలే మలుపుగా మారాయని దీప్కే గుర్తు చేశారు. భవిష్యత్‌లో కూడా ప్రజల గొంతుకను వినిపిస్తూ పాలకులను నిలదీస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సీజేపీ తనను తాను ఒక రాజకీయ పార్టీగా పిలుచుకున్నప్పటికీ, అది ఎన్నికల బరిలోకి దిగే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. ఇది కేవలం ఒక పబ్లిక్ ప్రెజర్ గ్రూప్‌గా మాత్రమే కొనసాగనుంది. దేశానికి మరో రాజకీయ పార్టీ కంటే నిరంతరం ప్రజల తరఫున పోరాడే ఒక ప్రజా ఉద్యమం అవసరమని అభిజీత్ దీప్కే అభిప్రాయపడ్డారు. " మనం ఎవరికి వ్యతిరేకంగా పోరాడుతున్నామో, కాలక్రమేణా మనం కూడా అలాగే మారిపోకుండా ఉండటమే మన ముందు ఉన్న అతి పెద్ద సవాల్" అని దీప్కే తన సహచరులకు హితబోధ చేశారు. మరో వైపు జెన్-జీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచంలోనే అతిపెద్ద యువజన సదస్సులో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధ్యక్షుడు మోహన్ భగవత్ పాల్గొన్నారు. 'భారతీయ విధానంలో ప్రపంచాన్ని ఏకం చేయడంలో యువత పాత్ర' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. జెన్-జీ మనవాళ్లేనని, వారు నిరసనలు చేస్తుంటే స్పందించి పరిష్కరించాలని అన్నారు. ఆందోళనలు చేసినంత మాత్రాన వారు దేశద్రోహులు కాదని, మన భవితని భగవత్ ఉద్ఘాటించారు."ఒకవేళ జెన్- జీ ఆందోళన చేస్తే వారు ఖచ్చితంగా దేశ ద్రోహులు కాదు.. వాళ్లు మన వాళ్లే.. దేశానికి భవిత" అని ఆర్ఎస్ఎస్ చీఫ్ పేర్కొన్నారు. అయితే, యువత ఆందోళనలు చేయొద్దని తాను చెప్పడం లేదని, ప్రజాస్వామ్యంలో నిరసనలు వ్యక్తం చేయడానికి నిర్దిష్టమైన మార్గాలు ఉంటాయని ఆయన తెలిపారు. "ప్రస్తుత తరంతో పోల్చితే జెన్- జీ, జెన్- అల్ఫా అత్యంత నిజాయితీ ఉన్నవారిని భావిస్తున్నాను.. దేశభక్తి, సేవాభావాలకు సంబంధించిన పిలుపులకు వారు ఎంతో హృదయపూర్వకంగా స్పందిస్తారు" అని చెప్పారు. "నన్ను గుడ్డిగా నమ్మమంటే.. నేను జెన్ జీను నమ్ముతాను" అని వారికి తన మద్దతును ప్రకటిస్తూ భగవత్ అన్నారు.

# తమిళ బడ్జెట్ లో విజయ్ హామీలకు నిధులు

**చెన్నై, ఆగస్టు 8:**ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదు. అతుకుల బొంత. ఎప్పుడైనా కూలిపోవచ్చు. మధ్యంతర ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి. కార్యకర్తలు ధైర్యంగా ఉండండి. నమ్మకాన్ని కోల్పోవద్దు..ఇవి ఇటీవల డీఎంకే అధినేత స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు. అంతేకాదు విజయ్ గవర్నమెంట్ మీద.. గవర్నెన్స్ మీద ఆయన విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి కనీసం మూడు నెలలు కూడా పూర్తికాకముందే.. కొత్త ప్రభుత్వానికి ఆరు నెలలపాటు హనీమూన్ పీరియడ్ అనేది ఉంటుందని తెలిసి కూడా.. స్టాలిన్ విమర్శలు చేయడం మొదలుపెట్టారు. విజయ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించడం ప్రారంభించారు.ఎన్నికల సమయంలో నూతన వధువులకు 8 గ్రాముల బంగారం... పట్టు చీరలు.. ప్రభుత్వ వైద్యశాలలో జన్మించిన పిల్లలకు బంగారు ఉంగరాలు.. కాలేజీ విద్యార్థులకు లాప్టాప్ లు.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్.. వంటి హామీలను విజయ్ ప్రకటించారు. ఈ హామీలు అమలు చేయాలని.. నూతన వధువులకు బంగారం.. పట్టు చీరలు ఇచ్చే అవకాశం లేదని.. ప్రభుత్వం వీటిని నిలబెట్టుకోలేదని.. అనేక సందర్భాలలో స్టాలిన్ విమర్శించడం ప్రారంభించారు. ఈ విమర్శలకు టీవీకే



నేతలు పెద్దగా స్పందించలేదు. విజయ్ కూడా రియాక్ట్ కాలేదు.టైం చూసి దెబ్బ కొట్టడం విజయ్ కి అలవాటు. సినిమాల్లో అయితే విలన్ ను ఎలా కొడతాడో.. రియల్ లైఫ్ లో కూడా తన ప్రత్యర్థిని కూడా అలాగే విజయ్ దెబ్బ కొట్టాడు. తమిళనాడు బడ్జెట్లో విజయ్ తన తిరుగులేని వ్యూహాత్మకత విధానాన్ని ప్రదర్శించాడు.. ప్రతిపక్షాలు అంచనా వేయలేని విధంగా తమిళ ప్రజల మీద వరాల జల్లు కురిపించాడు. నూతన వధువులకు 8 గ్రాముల బంగారం.. పట్టుచీర అందించడానికి 912 కోట్లు కేటాయించింది విజయ్ ప్రభుత్వం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టే పిల్లలకు బంగారు ఉంగరం ఇచ్చేందుకు 560 కోట్ల కేటాయించింది. కాలేజీలలో చదువుకునే విద్యార్థులకు ల్యాప్టాప్ల అందించడానికి 2000 కోట్లు కేటాయించింది. తొలిసారి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు రాయితీ 25వేల నుంచి 35వేలకు పెంచింది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పేదలకు అందిస్తామని ప్రకటించింది. దీనికి సంబంధించి కూడా నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించింది.ఈ హామీల మీద విజయ్ ప్రభుత్వాన్ని పదేపదే డిఎంకె ప్రశ్నిస్తోంది. వీటిని అమలు చేయాలని కోరుతూ ఉంది. దీనిపై విజయ్ ఇంతవరకు మాట్లాడలేదు. చివరికి బడ్జెట్లో తన కేటాయింపుల ద్వారా డీఎంకే చేస్తున్న ఆరోపణలకు సాలిడ్ సమాధానం ఇచ్చారు. అంతేకాదు తాను మాట ఇస్తే మడమతిప్పే అవకాశం లేదని స్పష్టం చేస్తున్నారు. బడ్జెట్ కేటాయింపుల నేపథ్యంలో టీవీకే నేతలు సోషల్ మీడియాలో ఎదురు దాడి మొదలు పెట్టారు. డీఎంకే నేతలను లక్ష్యంగా చేసుకొని.. ఇప్పుడేమంటారని ప్రశ్నిస్తున్నారు.

# భారత్, ఫ్రాన్స్ రఫెల్ డీల్...

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:**భారత ఎయిర్‌ఫోర్స్ యుద్ధ విమానాల కొరతను తీర్చడానికి ఫ్రాన్స్ సమర్పించిన రూ. 3.25 లక్షల కోట్ల రఫేల్ ప్రతిపాదన కేవలం కొనుగోలు ఒప్పందం మాత్రమే కాదు. ఇది మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్ దిశగా ముఖ్యమైన అడుగు. 114 జెట్లలో 94 దేశంలోనే తయారు చేస్తామని ఫ్రాన్స్ తెలిపింది. దీంతో టెక్నాలజీ బదిలీ, స్థానిక ఉత్పత్తి, పరిశ్రమలకు భారీ అవకాశాలు కలుగుతాయి.ఫ్రాన్స్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 114 రఫేల్ జెట్లలో 94 భారత్‌లోనే ఉత్పత్తి అవుతాయి. కొన్ని విమానాలు ఫ్లై--అవే కండిషన్‌లో వస్తాయి, మిగతావి దేశీయ భాగస్వామ్యంతో తయారవుతాయి. ఇది గత రఫేల్ ఒప్పందాలకు భిన్నంగా, మొట్టమొదటిసారి రఫేల్‌ను ఫ్రాన్స్ వెలుపల పెద్ద ఎత్తున తయారు చేయబోతోంది. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్లు, అవయోనిక్స్‌లో స్థానిక కంటెంట్ 60 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల భారత్ స్వయంప్రతిపత్తి పెరుగుతుంది, భవిష్యత్తులో సొంత యుద్ధ విమానాల అభివృద్ధికి అనుభవం లభిస్తుంది.ఈ ఒప్పందం ఆమోదమైతే భారతీయ కంపెనీలకు దాదాపు రూ. 1.6 లక్షల కోట్ల వ్యాపారం వస్తుందని అంచనా. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, లార్సెన్ -- టూబ్రో వంటి సంస్థలు ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్ అసెంబ్లీ, అవయోనిక్స్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌లో పాల్గొంటాయి. ఫ్రెంచ్ కంపెనీలు డసాల్ట్, సఫ్రాన్, థేల్స్, ఎంబీడీఏ భారత భాగస్వాములతో కలిసి పనిచేస్తాయి. ఇది ఏరోస్పేస్ సప్లై చైన్‌ను బలోపేతం చేసి, ఉపాధి సృష్టి, నైపుణ్య అభివృద్ధికి దోహదం చేస్తుంది. స్థానిక ఆయుధాలు ఇంటిగ్రేట్ చేసుకునే అవకాశం కూడా ఉంది.రఫేల్ విడిభాగాల తయారీ కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటవుతుంది. ఇప్పటికే టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో ఫ్యూజ్‌లేజ్(ఫ్యూస్‌లేజ్) తయారీ ఒప్పందాలు ఉన్నాయి. ఇది హైదరాబాద్‌ను ఏరోస్పేస్ హబ్‌గా మరింత బలపరుస్తుంది. ఇంజన్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్(ఎంఆర్‌వో) సౌకర్యాలు కూడా ఇక్కడే రావచ్చు. దీనివల్ల తెలంగాణలో ఉపాధి, పెట్టుబడులు పెరుగుతాయి.భారత వాయుసేన స్క్వాడ్రన్ల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో ఈ జెట్లు ముఖ్యం. ప్రస్తుతం ఉన్న 36 రఫేల్‌లకు జోడించి మొత్తం సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. 4.5 జనరేషన్ మల్టీ--రోల్ సామర్థ్యం, ఆధునిక ఆయుధ వ్యవస్థలు శత్రు దేశాలపై నిరోధక శక్తిని పెంచుతాయి. టెక్నాలజీ బదిలీతో భవిష్యత్తు స్వదేశీ విమానాల అభివృద్ధికి




కూడా సహాయపడుతుంది.ప్రతిపాదనను రక్షణ శాఖ, వాయుసేన పరిశీలిస్తున్నాయి. ధర, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ స్థాయి, ఇండిజినస్ కంటెంట్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌పై చర్చలు జరుగుతాయి. ఒప్పందం ఆమోదమైతేనే పూర్తి ప్రయోజనాలు వస్తాయి. ఈ ప్రతిపాదన భారత్ రక్షణ సామర్థ్యం పెంచడంతోపాటు ఆర్థిక, పారిశ్రామిక లబ్ధిని కలిగిస్తుంది. భారత--ఫ్రాన్స్ రక్షణ సహకారంలో కొత్త అధ్యాయం మొదలవుతుంది.

# కాక్రోచ్ కు నిధులెలా వస్తున్నాయ్...

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:**కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) గురించి రోజువారీగా కొత్త వివరాలు బయటకు వస్తున్నాయి. పార్టీ నాయకత్వం, దాని వ్యూహాలు, వెనుక ఉన్న శక్తులు, అసలు ప్రణాళిక ఏమిటి అన్న అంశాలపై అనేక సందేహాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉద్యమాలు నడిపే వారు సమాజానికి జవాబుదారులుగా ఉండాలని ఆశించే సందర్భంలో, వారి స్వంత నేపథ్యాలపై స్పష్టత లేకపోవడం చర్చకు దారితీస్తోంది.సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే గురించి అనేక ప్రశ్నలు వస్తున్నాయి. ఆయన తండ్రి మహారాష్ట్ర ప్రభుత్వ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ, నెలకు సుమారు 50 వేల నుంచి 60 వేల రూపాయల వేతనం పొందుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ శంభాజీనగర్‌లో ఉన్న ఆయన భవనం రెండు కోట్ల రూపాయలకు పైగా విలువైనదిగా అంచనా. ఆ ఇంట్లోని సదుపాయాలు, అక్కడ జరిగిన సమావేశాల్లో మద్యం సరఫరా విధానం, పెద్ద ఎత్తున కార్యకర్తల రాకపోకలు వంటి వివరాలు చూస్తే, ఆదాయానికి తగిన జీవనస్థాయి లేదన్న సందేహం ఏర్పడుతోంది.అభిజిత్ అమెరికాలో చదువు, కోర్సు, సహచరులు, విశ్వవిద్యాలయం గురించి స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం లేదు. ప్రశ్నలు వచ్చినప్పుడు "సమయం వచ్చినప్పుడు చెబుతాను" అని దాటవేస్తున్నారు. జార్ఖండ్ ఉద్యమానికి మద్దతు ఇవ్వలేనని జ్వరం కారణంగా చెప్పిన మరుసటి రోజే మహారాష్ట్రలో




సమావేశం నిర్వహించి కోక్ తాగిన వివరాలు కూడా అసమతుల్యతను చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిధుల మూలం ఏమిటి, కుటుంబ ఆదాయంతో ఇంతటి జీవనశైలి ఎలా సాధ్యమవుతుంది అన్న ప్రశ్నలు సహజంగా తలెత్తుతున్నాయి.ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నాయకురాలు నేహా బోరా 26 రోజుల పాటు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఆమె వయసు 29, గత 15 ఏళ్లుగా ఇంటికి దూరంగా ఉన్నట్లు తెలిపారు. అంటే కౌమార దశ నుంచే వామపక్ష ఉద్యమాల్లో చురుకుగా ఉన్నట్లు అర్థం. అయితే చదువు, ఫీజులు, నిర్వహణ ఖర్చులు ఎవరు భరిస్తున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్న విషయాల్లో స్పష్టత లేదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆమె చేసిన నృత్యం, 20 నిమిషాలపాటు అనర్గళంగా మాట్లాడిన విధానం చూస్తే, దీర్ఘకాల నిరాహార దీక్ష చేసిన వ్యక్తి శారీరక స్థితికి సరిపోని ఉత్సాహం కనిపించింది. ఇలాంటి వైరుధ్యాలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి.సౌరభ్ దాస్ ఢిల్లీలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో నివసిస్తున్నారు. నెలకు పది లక్షల రూపాయల అద్దె ఉన్న ఇంట్లో ఉంటున్నారు. దీనిని ఆయన తిరస్కరించడం లేదు. ఇల్లు ఆయన పేరిట లేకపోయినా, ముగ్గురు ఉద్యోగులు, కారు సౌకర్యాలతో విలాసవంతంగా జీవిస్తున్నారు. ఉద్యమ కార్యకర్తగా ఇంతటి జీవనస్థాయి ఎలా సాధ్యమవుతుంది అన్నది మరో ముఖ్య ప్రశ్న.సీజేపీ రిజిస్టర్డ్ బాడీ కాదు. ఆర్ఎస్ఎస్‌ను రిజిస్టర్ చేయాలని కోరే వారు సీజేపీ విషయంలో అదే ప్రమాణాన్ని వర్తింపజేయకపోవడం గమనార్హం. ఉద్యమాలకు, సమావేశాలకు, ప్రయాణాలకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, నాయకులు ఎలా మనుగడ సాగిస్తున్నారు అన్న విషయాల్లో పారదర్శకత లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది.ప్రజలను ప్రశ్నించే వారు తమ వ్యక్తిగత, ఆర్థిక విషయాల్లో కూడా స్పష్టంగా ఉండాలి. సైలెన్స్ లేదా దాటవేత ధోరణి అనుమానాలను మరింత పెంచుతుంది. సమాజం ఆశించేది సమాధానాలు, స్పష్టత, జవాబుదారీతనం. ఇవి లేకపోతే ఏ ఉద్యమమైనా విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

# 40 ఆధార్ నంబర్లకు ఏకంగా 80 మంది ఉద్యోగులు

**హైదరాబాద్, ఆగస్టు 8:**తెలంగాణ ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో విస్తుపోయే అక్రమం వెలుగులోకి వచ్చింది. ఒకే ఆధార్ నంబర్‌తో వేర్వేరు పేర్లతో ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించడమే కాకుండా, నెలకు లక్షల్లో రెండు జీతాలు దర్జాగా గుంజుతున్న ఘరానా మోసం బట్టబయలైంది. రాష్ట్ర ఆర్థిక శాఖ చేపట్టిన సాంకేతిక తనిఖీల్లో ఈ దిగ్భ్రాంతికరమైన విషయం నిగ్గుతేలింది. ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను మరింత పారదర్శకంగా మార్చేందుకు ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో ఉద్యోగుల ఆధార్, సర్వీస్ వివరాల ధృవీకరణ చేపట్టాల్సిందిగా సర్కార్ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రాస్ చెకింగ్ ప్రక్రియలోనే అసలు అవకతవకలు బయటపడ్డాయి.ఆర్థిక శాఖ ప్రాథమిక పరిశీలన ప్రకారం.. కేవలం 40 ఆధార్ నంబర్లకు ఏకంగా 80 మంది ఉద్యోగుల వివరాలు అనుసంధానమై ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంటే ప్రతి ఒక్క ఆధార్ నంబర్‌పై ఇద్దరేసి ఉద్యోగులు వేర్వేరు పేర్లతో ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతి నెలా జీతాలు పొందుతున్నారు. ఇందులో విస్తుపోయే అంశమేమిటంటే.. ఇలా ఒకే ఆధార్‌పై రెండేసి జీతాలు తీసుకుంటున్న వారిలో ఎక్కువ మంది రెగ్యులర్ ఉద్యోగులే ఉన్నారు. ఒక్కో ఉద్యోగి హోదాను బట్టి నెలకు 1 లక్ష నుంచి ఏకంగా 4 లక్షల వరకు ప్రభుత్వ ధనాన్ని చట్టవిరుద్ధంగా డ్రా చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ, విద్యా శాఖ, పంచాయతీ రాజ్, ప్రజారోగ్య శాఖల్లో ఇలాంటి డూప్లికేట్ కేసులు ఎక్కువగా నమోదైనట్లు ఆర్థిక శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.ఐఎఫ్ఎంఐఎస్ సిస్టమ్‌లో పనిచేస్తున్న రెగ్యులర్, గ్రాంట్-ఇన్-ఎయిడ్ , తాత్కాలిక సిబ్బంది డేటాను ఆధార్‌తో అనుసంధానించి క్రాస్‌చెక్ చేయడంతో ఈ బండారం బయటపడింది. వేర్వేరు శాఖల్లో, వేర్వేరు పేర్లతో ఉద్యోగాలు చేస్తూ ఒకే ఆధార్‌ను ఉపయోగించడం వెనుక పెద్ద ఎత్తున సాంకేతిక అక్రమాలు లేదా ఐడెంటిటీ ఫ్రాడ్ ?? ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. దీనిని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం.. డూప్లికేట్ ఆధార్ మ్యాపింగ్‌లపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.ఒకటి కంటే ఎక్కువ ప్రభుత్వ సంస్థలు లేదా శాఖల నుంచి అక్రమంగా జీతాలు పొందినట్లు రుజువైతే సదరు ఉద్యోగులపై తక్షణమే శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు, ఇప్పటివరకు అక్రమంగా డ్రా చేసిన ప్రభుత్వ సొమ్మును పైసా సైతం వదలకుండా రికవరీ చేయాలని స్పష్టం చేసింది. తీవ్రమైన అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని ఆదేశించింది. అంతటితో ఆగకుండా.. ఈ అవకతవకలకు సహకరించిన, లేదా డ్రాయింగ్ అండ్ డిస్‌బర్సింగ్ స్థాయిలో నిర్లక్ష్యం వహించిన అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించి వారిపై కూడా చర్యలు తీసుకోనున్నారు.ఈ వ్యవహారంపై అన్ని శాఖలు తక్షణమే దృష్టి సారించి, సమగ్ర విచారణ, రికవరీ మరియు క్రిమినల్ చర్యల వివరాలతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ను సరిగ్గా 7 రోజుల్లోగా తమకు సమర్పించాలని ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ స్కామ్‌తో సంబంధం ఉన్న ఉద్యోగుల్లో, సహకరించిన అధికారుల్లో తీవ్ర భయాందోళనలు మొదలయ్యాయి.

# రేవంత లెక్కలోకి బనకచర్ల ప్రాజెక్ట్ రిజెక్ట్..

**హైదరాబాద్, ఆగస్టు 8:**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన పోలవరం--బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ శాఖకు చెందిన నిపుణుల అప్రైజల్ కమిటీ వెనక్కి పంపడంతో తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది. ఈ పరిణామాన్ని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తమ నేత రేవంత్ రెడ్డి సాధించిన దౌత్యపరమైన విజయంగా ప్రచారం చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ప్రాథమిక దశలోనే విఫలమైందంటూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. అయితే, ఈ రాజకీయ క్రెడిట్ వార్, ప్రతివిమర్శలకు ఆవల సాంకేతిక, చట్టపరమైన కోణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే, ఇది ఒకరికి లభించిన విజయమో లేదా మరొకరికి ఎదురైన ఓటమో కాదని.. నదీ జలాల చట్టాలకు అనుగుణంగా జరిగిన ఒక సహజ సిద్ధమైన పరిణామమని స్పష్టమవుతోంది.పర్యావరణ అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే, ఏ భారీ నదీ అనుసంధాన ప్రాజెక్టుకైనా ఒక స్పష్టమైన చట్టబద్ధమైన కార్యాచరణ ఉంటుంది. కేంద్ర జల సంఘం ద్వారా శాస్త్రీయంగా నీటి లభ్యత ధృవీకరణ పొందకుండానే పర్యావరణ అనుమతుల కోసం వెళ్లడం సాంకేతికంగా సరికాదు. చట్టబద్ధమైన ప్రాథమిక అనుమతులు లేకుండా ముందుకెళితే, భవిష్యత్తులో గ్రీన్ ట్రిబ్యునల్ లేదా సుప్రీంకోర్టు పరిధిలో పిటిషన్లు దాఖలై ప్రాజెక్టుపై శాశ్వత స్టే వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి కేంద్రం ఈ ప్రతిపాదనలను తిరస్కరించి వెనక్కి పంపడం అనేది ప్రాజెక్టుకు ముమ్మందు చట్టపరమైన చిక్కులు ఎదురుకాకుండా నిరోధించే ఒక ముందస్తు చర్యగా పరిగణించవచ్చు.గోదావరి



జల వివాదాల ట్రిబ్యునల్ నిబంధనలు , అంతర్రాష్ట్ర ఒప్పందాల ప్రకారం ఎగువ , దిగువన ఉన్న ప్రతి ఒక్క రాష్ట్ర ప్రయోజనాలను రక్షించాల్సిన రాజ్యాంగ బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ఏపీ రూపొందించిన ప్రస్తుత ప్రాజెక్టు డిజైన్ ద్వారా తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు కూడా ముంపు ముప్పు, నీటి కేటాయింపులపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. గోదావరి బేసిన్ నుంచి సముద్రంలోకి వెళ్లే మిగులు, వరద నీటి పరిమాణాన్ని శాస్త్రీయంగా లెక్కించి, వాటాలపై స్పష్టత ఇచ్చే వరకు సీడబ్ల్యూసీ లేదా ఈఏసీ అనుమతులు మంజూరు చేయడం అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టాలకు విరుద్ధమవుతుంది.రాజకీయంగా ఇది కూటమి ప్రభుత్వానికి బ్రేక్ పడటంలా అనిపించినప్పటికీ, సుదీర్ఘ కాలంలో ఈ ప్రాజెక్టుకు లభించే లీగల్ సెక్యూరిటీగా దీన్ని చూడవచ్చు. క్షేత్రస్థాయి ముంపు వివరాలు , నీటి కేటాయింపులపై పక్కా నివేదికలు లేకుండా ముందుకెళ్లడం వల్ల చట్టపరమైన పునాది బలహీనపడేది. పొరుగు రాష్ట్రాలతో సమగ్ర సంప్రదింపులు జరిపి, అంతర్రాష్ట్ర వివాదాలను పరిష్కరించుకున్న తర్వాతే సీడబ్ల్యూసీ నీటి లభ్యత ధృవీకరణ పత్రంతో మళ్లీ పర్యావరణ అనుమతులకు రావాలని కేంద్రం సూచించడం ద్వారా ప్రాజెక్టుకు ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ లభించింది.రాయలసీమ దాహార్తిని తీర్చేలా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద నీటిని తరలించి, దాదాపు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించడం ఏపీకి అత్యంత ప్రాధాన్యమైన అంశం. ఇటువంటి మెగా ప్రాజెక్టు రూపుదిద్దుకోవాలంటే తొందరపాటు నిర్ణయాలు, పొలిటికల్ అజెండాల కంటే చట్టబద్ధమైన అడుగులే శ్రీరామరక్ష. సాంకేతిక లోపాలను సరిదిద్ది, అంతర్రాష్ట్ర సంప్రదింపులు పూర్తి చేసి చట్టబద్ధంగా ముందుకెళ్తేనే ఈ ప్రాజెక్టుకు శాశ్వత మనుగడ సాధ్యమవుతుంది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని పొలిటికల్ విక్టరీగా చూపుతున్నప్పటికీ, ఏపీ ప్రభుత్వం ఎదుర్కొన్నది సాంకేతిక ప్రతిబంధకాన్ని మాత్రమే గానీ ప్రాజెక్టు, రద్దును కాదు. కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా సీడబ్ల్యూసీ నివేదికను సిద్ధం చేసుకుని, పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలను నివృత్తి చేస్తూ ముందుకు సాగితేనే పోలవరం--బనకచర్ల అనుసంధానం సుసాధ్యమవుతుంది. రాజకీయ విమర్శలను పక్కనపెట్టి, నిబంధనల ప్రకారం లీగల్ బ్యాకప్‌తో ఏపీ ప్రభుత్వం ముందడుగు వేయడమే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భవిష్యత్తుకు అత్యంత సురక్షితమైన మార్గం.

# బొనాల పండుగ మద్యం అమ్మకాలపై నిఘా

**హైద్రాబాద్, ఆగస్టు 8:**బోనాల పండుగ సందర్భంగా మందుబాబులకు పోలీసులు బ్యాడ్ న్యూస్ చెప్పారు. పండుగ వేడుకలు ప్రశాంతంగా జరగాలనే ఉద్దేశంతో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా నగరంలో మద్యం అమ్మకాలపై ఆంక్షలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు 9న జరగనున్న బోనాల ఉత్సవాల నేపథ్యంలో హైదరాబాద్, సైబరాబాద్, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో నిర్దేశిత సమయాల్లో వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లను మూసివేయనున్నారు.హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నగరంలో జోన్ల వారీగా ఆంక్షలు అమలులో ఉంటాయి. ముఖ్యంగా చార్మినార్ జోన్‌లో ఆగస్టు 9 ఉదయం 10 గంటల నుంచి ఆగస్టు 11 ఉదయం 10 గంటల వరకు (48 గంటలు) మద్యం దుకాణాలు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్‌లు పూర్తిగా మూసివేయనున్నారు. రాజేంద్రనగర్, గోల్కొండ జోన్లలో ఆగస్టు 9 ఉదయం 10 గంటల నుంచి మరుసటి




రోజు (ఆగస్టు 10) ఉదయం 10 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. అయితే, స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బుల్లోని బార్లకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కూకట్‌పల్లి, అల్లాపూర్, రాయదుర్గం, జీడిమెట్ల, మేడ్చల్, చందానగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం అమ్మకాలు నిలిపివేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు. ఇక, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆగస్టు 9 ఉదయం 10 గంటల నుంచి ఆగస్టు 10 ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూసివేయనున్నారు.బోనాల పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మూడు కమిషనరేట్ల పోలీసులు స్పష్టం చేశారు. పండుగ వేళ వేల సంఖ్యలో భక్తులు, ప్రజలు రోడ్లపైకి వస్తారని, వారి భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ఆంక్షలు విధించామని తెలిపారు. ప్రజలు నిబంధనలు పాటించి, పోలీసులకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# మెట్రో. ఆర్టీసీ బస్సు కామన్ పాస్

**హైదరాబాద్, ఆగస్టు 8:**హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్తను ఒకే తాటిపైకి తెచ్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ, హైదరాబాద్ మెట్రో రైల్ కీలక ముందడుగు వేశాయి. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి, వారి ప్రయాణాన్ని మరింత సులభతరం చేసేందుకు కామన్ పాస్ విధానాన్ని అమలులోకి తీసుకురావాలని నిర్ణయించాయి. ఈ నిర్ణయం హైదరాబాద్ నగర రవాణా రంగంలో ఒక విప్లవాత్మక మార్పుగా నిలవనుంది. ఇప్పటి వరకు ఆర్టీసీ బస్సులకు, మెట్రో రైళ్లకు వేర్వేరుగా టికెట్లు లేదా పాస్‌లు తీసుకోవాల్సిన వచ్చేది. కానీ రాబోయే రోజుల్లో ఒకే పాస్‌తో మెట్రో రైళ్లు, నగరంలోని వివిధ రకాల ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించవచ్చు. అంతేకాకుండా, మెట్రో స్టేషన్ల నుంచి గమ్య స్థానాలకు చేరుకోవడానికి ఆర్టీసీ ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించనున్నారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాల మేరకు రవాణా శాఖ అధికారులు ఈ కార్యాచరణను వేగవంతం చేశారు. ఇటీవల బస్ భవన్‌లో ఆర్టీసీ, హెచ్‌ఎంఆర్‌ఎల్, ఎల్ అండ టీ మెట్రో అధికారులు సమావేశమై దీనిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ కామన్ పాస్ విధానం వెనుక ప్రధానంగా మూడు లక్ష్యాలు ఉన్నాయి. ప్రయాణికులు ఆర్టీసీ బస్ దిగి మెట్రో ఎక్కేటప్పుడు లేదా మెట్రో నుంచి బస్‌కు మారేటప్పుడు పదే పదే టికెట్లు తీసుకోవాల్సి అవసరం ఉండదు. వేర్వరుగా పాస్‌లు తీసుకోవడం కంటే ఒకే పాస్ ఉండం వల్ల ప్రయాణికులకు ఛార్జీల భారం తగ్గుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో ప్రతి రోజూ 22 లక్షల మంది బస్సుల్లో4.7 లక్షల మంది మెట్రోలో ప్రయాణిస్తున్నారు. ఉమ్మడి పాస్‌లు వస్తే సంఖ్య మరింత పెరగవచ్చు. ప్రస్తుతానికి దీనిపై ప్రాథమిక నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి పాస్‌ల ఛార్జీల నిర్ధారణ, పాస్‌ల రూపకల్పనపై మెట్రో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ వారంలోనే ఎఖమీూా ప్రతిపాదించిన ఉమ్మడి మొబైల్ యాప్ గురించి, ఛార్జీల గురించి మరోసారి సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో ధరలపై స్పష్టత వచ్చిన వెంటనే ఈ పాస్‌లను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.ప్రస్తుతం ఆర్టీసీలో ఉన్న డైలీ, మంత్లీ పాస్‌లనే మెట్రోకు కూడా వర్తింపజేసేలా అధికారులు ప్లాన్ చేస్తున్నారు. అదనంగా ఇప్పటి వరకు లేని వీక్లీ పాస్ సౌకర్యాన్ని కూడా కొత్తగా ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం ఆర్డీనరీ బస్‌లకు నెలకు 1600, మెట్రో ఎక్స్‌ప్రెస్‌కు నెలకు 1800, మెట్రో డీలక్స్‌కు 2200, డైలీ పాస్ 150



రూపాయలుగా వసూలు చేస్తున్నారు. కామన్ పాస్ విధానం వస్తే, మెట్రోరైళ్లతోపాటు ఈ మూడు రకాల బస్‌లలోనూ ఒకే పాస్‌తో ప్రయాణించవచ్చు. అయితే మెట్రో రైళ్లకు మాత్రమే పరిమితమయ్యేలా డైలీ, వీక్లీ, మంత్లీ పాస్‌లను కూడా ప్రత్యేకంగా తీసుకురానున్నారు.

# పాతబస్తీలో మెగా డాటర్

**హైదరాబాద్, ఆగస్టు 8:** హైదరాబాద్ బోనాల జాతర ఉత్సవాల్లో మెగా డాటర్, హీరోయిన్, ప్రముఖ నిర్మాత నిహారిక కొణిదెల సందడి చేశారు. పాతబస్తీ మీర్ ఆలం మండిలోని శ్రీమహాకాళేశ్వరున్ని దర్శించి అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు. మహాకాళేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి బంగారు బోనం సమర్పించారు నిహారిక. అంతకు ముందు ఆమెకు ఆలయ ఛైర్మన్, అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి బంగారు బోనం నైవేద్యంగా సమర్పించిన తర్వాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు నిహారిక. ఆమెకు అమ్మవారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించారు అధికారులు. అర్చకులు వేద మంత్రోచ్చరణలతో ఆశీర్వదించారు. ఆలయ చరిత్రను ఆమెకు వివరించారు. బోనాల సందర్భంగా ఆలయం ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. సంప్రదాయ దుస్తుల్లో మహిళలు తలపై బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లడం చిన్నప్పటి నుంచి తనను ఎంతో ఆకర్షిస్తుందని చెప్పారు నిహారిక. 'ప్రధాన బోనాల రోజున షూటింగ్స్ షెడ్యూల్స్ వల్ల రావడం వీలుపడలేదు. అందుకే ఈ రోజు అమ్మవారిని దర్శించుకుని బంగారు బోనం సమర్పించాను. కొద్ది రోజుల క్రితం బోనం సమర్పించాలని అనుకున్నా. అమ్మవారి ఆశీస్సులతో ఈ రోజు అది నెరవేరింది.' అని అన్నారు. ఈ ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. నిహారికతో సెల్ఫీలు దిగేందుకు ఫ్యాన్స్ పోటీ పడ్డారు. వారికి అభివాదం చేస్తూ నవ్వుతూ పలకరించారు. మెగా డాటర్‌గా పలు సినిమాల్లో హీరోయిన్‌గా చేసిన నిహారిక కొణిదెల... ఆ తర్వాత పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్ స్థాపించి మూవీస్ నిర్మిస్తున్నారు. ఫస్ట్ మూవీ కమిటీ కుర్రోళ్లుతోనే బిగ్ సక్సెస్ అందుకున్నారు. ఈ మూవీ రెండు విభాగాల్లో నేషనల్ అవార్డ్స్ వచ్చాయి. ఇక రెండో మూవీ రాకాస సైతం బాక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ రాబట్టింది. తాజాగా, తన అన్న వరుణ్ తేజ్ హీరోగా బరి మూవీని నిర్మిస్తున్నారు. నిర్మాతగా వరుస హిట్లతో దూసుకెళు_న్నారు నిహారిక. ఎప్పుడూ షూటింగులతో బిజీగా ఉండే ఆమె... సంప్రదాయ దుస్తుల్లో అమ్మవారికి బంగారు బోనం సమర్పించడం అందరినీ ఆకర్షించింది.

# మద్యం ధరల పెంపు...

- మొదటి పేజీ తరువాయి

లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని మద్యం తయారీ సంస్థలు (డిస్టిలరీలు) ప్రభుత్వానికి విన్నవించాయి. ముడిసరుకుల ధరలు, రవాణా ఛార్జీలు, సిబ్బంది జీతాలు, పన్నుల భారం గణనీయంగా పెరిగిందని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 'ధరల నిర్ణయ కమిటీ'ని ఏర్పాటు చేసి, డిస్టిలరీల ప్రతినిధులతో చర్చలు జరిపింది. పెరిగిన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని కమిటీ ఈ నివేదికను రూపొందించింది.ప్రస్తుత పరిస్థితుల్లో 10 నుంచి 15 శాతం వరకు ధరలు పెంచాలని డిస్టిలరీలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ధరల పెంపు విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. మద్యం ధరలను భారీగా పెంచితే, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల నుంచి మద్యం అక్రమ రవాణా పెరిగే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల రాష్ట్ర ఆదాయానికి గండి పడుతుంది. అందుకే, పొరుగు రాష్ట్రాల్లోని ధరలతో పోల్చి చూసిన తర్వాతే పెంపుదల శాతాన్ని ఖరారు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. సబ్-కమిటీ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరలోనే ప్రభుత్వం తుది నిర్ణయాన్ని ప్రకటించనుంది.

# హైడ్రాలో 150 ఉద్యోగాలకు వేలల్లో అభ్యర్థులు..

- మొదటి పేజీ తరువాయి

వేలాది మంది యువత తరలిరావడంతో తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.వివరాల్లోకి వెళితే.. హైడ్రా విభాగంలో 100 డీఆర్‌ఎఫ్ అసిస్టెంట్లు, 50 హెవీ వెహికల్ డ్రైవర్ల పోస్టుల భర్తీకి అధికారులు ప్రకటన విడుదల చేశారు. దీని కోసం ఆగస్టు 8, 9 తేదీల్లో సరూర్‌నగర్ స్టేడియంలో ఉదయం 5 గంటల నుంచి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 800 మీటర్ల పరుగు, 100 మీటర్ల స్ప్రింట్, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి ఈవెంట్లలో అర్హత సాధించాలని సూచించారు.అయితే, ప్రకటించిన పోస్టుల కంటే కొన్ని వందల రెట్లు ఎక్కువగా నిరుద్యోగులు ఇవాళ తెల్లవారుజామునకే స్టేడియం వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లే క్రమంలో ఒకరినొకరు తోసుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఈ క్రమంలో జరిగిన తోపులాటతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగ ప్రవేశం చేసి, గుంపును చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.ఈ తోపులాటకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం 150 ఉద్యోగాలకే ఈ స్థాయిలో పోటీ ఉందంటే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

# భారత స్వాతంత్ర్యం పోరాటంలో BJP-RSS పాత్ర శూన్యం: ఖర్గే

- మొదటి పేజీ తరువాయి

మారినవారే తప్ప అసలైన బీజేపీ/ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ఉన్నవారు కారని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడమే కాకుండా, ప్రజాస్వామ్యాన్ని రక్షించిందని, కాంగ్రెస్ నాయకులే నిజమైన దేశభక్తులని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులకు కాంగ్రెస్ పార్టీ భయపడదని ధ్వజమెత్తారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని కొనియాడారు. బీజేపీ నాయకుల్లా కాకుండా, రాహుల్ గాంధీ స్వయంగా ప్రజల్లోకి వెళ్తూ యువకులు, రైతులు, విద్యార్థులు, పేదల సమస్యలను అర్థం చేసుకుంటున్నారని తెలిపారు.ఆగస్టు 8న మహాత్మా గాంధీ ప్రారంభించిన 'క్విట్ ఇండియా'(1942) ఉద్యమాన్ని ఖర్గే ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. 'డూ ఆర్ డై' నినాదంతో దేశ ప్రజలంతా ఏకమై బ్రిటిష్ పాలనను పారద్రోలారని అన్నారు. దేవభూమిగా పేరొందిన ఉత్తరాఖండ్ సైనికుల త్యాగాలను ఆయన ప్రశంసించారు. కుమావూన్, గర్వాల్ రెజిమెంట్ల ప్రాముఖ్యాన్ని, తొలి పరమ్ వీర్ చక్ర గ్రహీతను స్మరించుకుంటూ, ఉత్తరాఖండ్ ప్రజలు దేశ రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. హల్ద్వానీలోని రామ్‌లీలా మైదానంలో ఇవాళ జరిగిన ఈ బహిరంగ సభ ద్వారా కాంగ్రెస్ పార్టీ రాబోయే ఎన్నికల బరిలో తమ స్వాతంత్ర్య పోరాట చరిత్రను, రాజ్యాంగ పరిరక్షణను ప్రధాన అస్త్రాలుగా మలచుకుని ముందుకు సాగుతోంది.

# ప్లాన్ బిలో రేవంత్..

- మొదటి పేజీ తరువాయి

పోటీపడుతున్నారు. రెడ్డి, బిసి, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ సామాజిక వర్గాల నుంచి అనేకమంది ఆశావహులు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ ముమ్మరం చేశారు. రేవంత్ రెడ్డి తన నిర్ణయాల్లో యువ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నప్పటికీ, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న సీనియర్లను పూర్తిగా పక్కనబెడితే కర్ణాటకలో మాదిరిగానే ఎమ్మెల్యేల తిరుగుబాటు లేదా సహాయ నిరాకరణ పెరిగే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వినిపిస?ోతంది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి అండ్ టీమ్ సామాజిక సమతుల్యత ం కాంపెన్సేషన్ ప్యాకేజీ వ్యూహాన్ని తెరపైకి తెస్తున్నారు. కేవలం కేబినెట్ బెర్తులు ఇవ్వడమే కాకుండా, పదవులు రాని ముఖ్య నేతలకు ముందే స్పష్టత ఇచ్చి, వారికి పవర్ ఫుల్ నామినేటెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, జిల్లా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు, లేదా ప్రభుత్వ సలహాదారు పాత్రలను ఆఫర్ చేయడం ద్వారా ముందస్తుగానే అసంతృప్తికి చెక్ పెట్టాలని భావిస్తున్నారు. సర్దుబాటు ప్రక్రియ కేబినెట్ విస్తరణకు ముందే పూర్తయితే, ప్రమాణ స్వీకారం రోజున డ్రామాలు జరగకుండా నివారించవచ్చనేది కాంగ్రెస్ ప్లాన్. అంతేకాకుండా, సామాజిక సమీకరణల పరంగా ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యాన్ని దెబ్బతీయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఉదాహరణకు ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల మధ్య కాంబినేషన్ దెబ్బతింటే అది ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం చూపుతుంది.కర్ణాటకలో డి.కె. శివకుమార్ ఓపిక పడితే అవకాశాలు వస్తాయి అని సర్దిచెప్పాల్సి వచ్చిన పరిస్థితిని తెలంగాణలో రాకుండా చూడాలంటే.. విస్తరణ రోజునే ఎవరికి ఏ పదవి లభిస్తుందో స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించడం ఒక్కటే సరైన మార్గమని ఏఐసీసీ భావిస్తోంది. కర్ణాటక కేబినెట్ విస్తరణ గందరగోళం తెలంగాణ కాంగ్రెస్ పాలనకు ఒక ముందస్తు హెచ్చరిక లా పనిచేసింది. కేవలం కొత్తవారికి అవకాశాలు ఇవ్వడం మాత్రమే కాకుండా, పార్టీ పాతకాపులను గౌరవిస్తూ, రాజీనామాల వేడి తగ్గించే సమగ్ర ప్యాకేజీతోనే రేవంత్ రెడ్డి తన కేబినెట్ విస్తరణను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

# 80 శాతం తగ్గిన గులాబీ విరాళాలు

- మొదటి పేజీ తరువాయి

రద్దైన ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ. 495 కోట్లు రాబట్టి తెలుగు రాష్ట్రాల పార్టీల్లోనే అత్యధిక నిధులు పొందిన పార్టీగా రికార్డు సృష్టించిన బీఆర్‌ఎస్‌కు.. అధికారం పోయిన తర్వాత విరాళాల ప్రవాహం మందగించడం గమనార్హం.తెలంగాణకు చెందిన మరొక ప్రముఖ ప్రాంతీయ పార్టీ ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఎంఐఎం పార్టీ 2024-25 సంవత్సరానికి గాను రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న విరాళాలను సున్నాగా ప్రకటించింది. కాగా.. 2023-24లో ఈ పార్టీ 16 విరాళాల ద్వారా రూ. 9 లక్షలు వచ్చినట్లు వెల్లడించింది. నేషనల్ లెవల్‌లో గత ఏడాది నిధులు ప్రకటించి.. ఈ ఏడాది రూ.20 వేలకు పైబడిన విరాళాలు సున్నాగా చూపిన 3 పార్టీల్లో ఎంఐఎం ఒకటిగా నిలిచింది.ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువును పాటించడంలోనూ తెలంగాణ పార్టీలు విఫలం అయ్యాయి. 2023-24లో సరైన సమయానికే విరాళాల వివరాలను ఈసీకి సమర్పించిన బీఆర్‌ఎస్, ఎంఐఎం.. 2024-25కి సంబంధించి మాత్రం గడువు దాటిన తర్వాతే నివేదికలు ఇచ్చాయి. బీఆర్‌ఎస్ నిర్ణీత గడువు కంటే 9 రోజులు ఆలస్యంగా రిపోర్ట్ చేయగా.. ఎంఐఎం 28 రోజుల ఆలస్యంగా తన నివేదికను సమర్పించినట్లు ఏడీఆర్ నివేదిక స్పష్టం చేసింది.

# యూఏఈ బతుకమ్మ సంబరాలకు కేటీఆర్‌కు ఆహ్వానం

**అక్టోబర్ 11న దుబాయ్ అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్‌లో వేడుకలు**

**ముఖ్య అతిథిగా హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

**గల్ఫ్ కార్మికుల సమస్యలపై ఈటీసీఏ ప్రతినిధులతో కేటీఆర్ చర్చ**



**హైదరాబాద్:** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ను ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈటీసీఏ--యూఏఈ) ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం నంది నగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను కేటీఆర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాలుగా యూఏఈలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రతినిధులు కేటీఆర్‌కు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ప్రతి ఏటా బతుకమ్మతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈసారి అక్టోబర్ 11, 2026న దుబాయ్‌లోని అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కేటీఆర్‌ను కోరారు.

**గల్ఫ్ కార్మికుల పరిస్థితులపై ఆరా**

ఈ సందర్భంగా ఈటీసీఏ ప్రతినిధులతో సమావేశమైన కేటీఆర్ గల్ఫ్‌లోని తెలంగాణ కార్మికుల పరిస్థితులు, ఉపాధి అవకాశాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై ఆరా తీశారు. తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికుల ప్రస్తుత పరిస్థితులు, వారి సంక్షేమానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.తెలంగాణకు దూరంగా గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్నప్పటికీ తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈటీసీఏ ప్రతినిధులను కేటీఆర్ అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడంలో ప్రవాస తెలంగాణ సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.ఈటీసీఏ కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా గల్ఫ్ కార్మికుల కష్టనష్టాల్లోనూ అండగా నిలుస్తూ, ఇబ్బందుల్లో ఉన్న తెలంగాణ బిడ్డలకు సహాయ సహకారాలు అందిస్తున్న తీరు గొప్పదని కేటీఆర్ అన్నారు. గల్ఫ్‌లో తెలంగాణ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ వంతు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ ప్రహారీ కూల్చివేత: దారి మూసేశారంటూ రైతుల రచ్చ

**మెదక్ జిల్లా జప్తిశివునూర్‌లో షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ ప్రహరీని కూల్చేసిన రైతులు**

**శతాబ్దాల నాటి దారిని మూసేసి కాంపౌండ్ కట్టారంటూ ఆగ్రహం**

**తమకు దారి చూపే వరకు తగ్గేదే లేదని హెచ్చరిక**



పంట పొలాలకు వెళ్లే దారిని మాయం చేశారంటూ ఆగ్రహించిన గ్రామస్తులు... రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ కాంపౌండ్ వాల్‌ను నేలమట్టం చేశారు. మెదక్ జిల్లా నార్సింగి మండలం జప్తిశివునూర్‌లో ఈ ఉదయం ఒక్కసారిగా విరుచుకుపడ్డ రైతులు, శతాబ్దాల నాటి ప్రధాన బాటను మూసివేసి కాంపౌండ్ కట్టడంపై తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. గతంలో ఈ సమస్యపై షబ్బీర్ అలీకి మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని... పొలాలకు రాకపోకలు బంద్ కావడంతోనే తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని స్థానికులు మండిపడ్డారు. విషయం తెలుసుకుని రంగంలోకి దిగిన పోలీసులు గ్రామస్తులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. పోలీసులతో వాగ్వాదానికి దిగిన స్థానికులు తమకు దారి చూపే వరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో జప్తిశివునూర్‌లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఊరిలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

# హైదరాబాద్ జలమండలి మొబైల్ అప్లికేషన్‌లో సాంకేతిక సమస్య




**హైదరాబాద్, ఆగస్టు 8 :** హైదరాబాద్ జలమండలి సిటిజన్ సర్వీసెస్ మొబైల్ అప్లికేషన్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. ఈ మొబైల్ అప్లికేషన్ ద్వారా ట్యాంకర్ బుకింగ్ చేసుకునే సేవలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడిందని జలమండలి అధికారులు తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి జలమండలి సాంకేతిక బృందం చర్యలు చేపట్టిందని వివరించారు. IVRS ద్వారా ట్యాంకర్ బుకింగ్ సేవలు యథావిధిగా కొనసాగిస్తున్నట్లు జలమండలి అధికారులు తెలిపారు. జలమండలి అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా ట్యాంకర్ బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ మొబైల్ అప్లికేషన్ సేవలు పునరుద్ధరించే వరకు ×ుఎూ, వెబ్‌సైట్ సేవలను వినియోగించుకోవాలని వినియోగదారులకు సూచించారు. సాంకేతిక సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి మొబైల్ అప్లికేషన్ సేవలను పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతామని చెప్పుకొచ్చారు. తాత్కాలిక అంతరాయంపై వినియోగదారులు సహకరించాలని జలమండలి అధికారులు విజ్ఞప్తి చేశారు.

# సరూర్ నగర్ స్టేడియం వద్ద తోపులాట

**హైదరాబాద్:** హైడ్రాలో హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలకు నిరుద్యోగులు పోటెత్తారు. దాంతో శనివారం ఉదయం సరూర్ నగర్ స్టేడియం దగ్గర తోపులాట జరిగింది. హైడ్రాలో 100 డీఆర్ఎఫ్, 50 హెవీ వెహికల్ డ్రైవర్ల పోస్టులకు ఎంపికలు సరూర్నగర్ స్టేడియంలో ఆగస్టు 8, 9 తేదీల్లో ఉదయం 5 గంటలకు ఈవెంట్స్ ఉంటాయని హైడ్రా ప్రకటిచింది. 170 సెకన్లలో 800 మీటర్ల రన్నింగ్, 15 సెకన్లలో 100 మీటర్లు, లాంగ్ జంప్ 4 మీటర్లు, 6 మీటర్ల షాట్పుట్ (7.2 ఖ+) ఈవెంట్లలో క్వాలిఫై అవ్వాలని ప్రకటించింది. దీంతో సరూర్నగర్ స్టేడియంలో జరిగే ఈవెంట్స్లో పాల్గొనేందుకు భారీగా నిరుద్యోగులు పోటెత్తారు.

# గచ్చిబౌలి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**ఇద్దరు అక్కడికక్కడే మృతి**

**రంగారెడ్డి:** గచ్చిబౌలి ఔటర్ రింగ్ రోడ్ సర్వీసు లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. తవేరా కారు నియోపోలీస్ బ్రిడ్జ్ పిల్లర్ను ఢీకొట్టింది. ఇద్దరు టైల్స్ కార్మికులు దుర్మరణం పాలయ్యారు. మృతులు రాజస్థాన్కు చెందిన కన్హైయాలాల్ (25), దేరామ్ (24)గా గుర్తించారు. అతివేగమే ప్రమాదానికి కారణం. కారు కంట్రోల్ తప్పి పిల్లర్ను ఢీకొట్టినట్లు గుర్తించారు. ఇంద్రారెడ్డి నగర్ నుంచి నానక్రామ్గూడ వెళుతుండగా శుక్రవారం అర్ధరాత్రి గంటలకు ఘటన జరిగింది.

# దోమల నివారణకు ప్రత్యేక మాన్సూన్ డ్రైవ్

**ప్రతి శుక్రవారం 'ఫ్రైడే--డ్రైడే' పాటించాలి**

**ఆగస్టు 11 నుంచి 21 వరకు స్పెషల్ మాన్సూన్ డ్రైవ్లో భాగంగా IEC కార్యక్రమం!:మంత్రి పొన్నం**

**హైదరాబాద్:** నగరంలో దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టేందుకు జీహెచ్ఎంసీ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఆగస్టు 11 నుంచి 21వ తేదీ వరకు చేపట్టనున్న స్పెషల్ మాన్సూన్ డ్రైవ్లో భాగంగా దోమల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మినిస్టర్ క్వార్టర్స్లో ×జుజ కార్యక్రమాన్ని మంత్రి ఫ?న్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా దోమల నివారణకు ఎంటమాలజీ విభాగం ఉపయోగిస్తున్న వివిధ పరికరాలను పరిశీలించి, వాటి పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు.మంత్రి మాట్లాడుతూ దోమల నివారణకు విస్తృత చర్యలు దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే--డ్రైడే' కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. దోమల లార్వాలు వృద్ధి చెందే ప్రాంతాలను గుర్తించి యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాం. జీహెచ్ఎంసీ పరిధిలో



విస్తృతంగా ఫాగింగ్ చేపడుతున్నాం. దోమల నివారణపై కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలల్లో విద్యార్థులకు దోమల నివారణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు.వర్షాల కారణంగా నిల్వ ఉన్న నీటిని తొలగించేలా ప్రజలకు సూచనలు చేస్తున్నాం. ప్రజలు స్వీయ బాధ్యతతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. హైదరాబాద్ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా జీహెచ్ఎంసీ ద్వారా ఇంటింటికీ వెళ్లి పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రజలందరూ స్వీయ బాధ్యతతో తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి శుక్రవారం 'ఫ్రైడే--డ్రైడే' కార్యక్రమంలో భాగంగా ఇళ్లలో, పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల లార్వాలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెంగ్యూ, చికున్గున్యా వంటి వ్యాధులు రాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోంది. ప్రజలు కూడా ప్రభుత్వానికి సహకరించి తమ ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ప్రభుత్వం ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజలు తమ ఇళ్లను, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే హైదరాబాద్ను ఆరోగ్యకరమైన నగరంగా తీర్చిదిద్దగలం. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ఉత్తమం. జీహెచ్ఎంసీ చేస్తున్న విజ్ఞప్తిని ప్రతి ఒక్కరూ పాటించి దోమల నివారణలో భాగస్వాములు కావాలని కోరుతున్నానని అన్నారు.

# ఒంటరిగా బరిలోకి జనసేన

**హైదరాబాద్, ఆగస్టు 8:** తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. : తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. దీంతో సొంతంగానే పోటీకి సిద్ధమవుతోంది జనసేన తెలంగాణలో. త్వరలో జరిగే గ్రేటర్ ఎన్నికలతో పాటు ప్రభావం చూపించగలిగిన జిల్లాల్లో ప్రాదేశిక ఎన్నికల్లో సైతం పోటీ చేయాలని చూస్తోంది జనసేన. అయితే ఉన్నట్టుండి బిజెపి జనసేన విషయంలో ఆ ఆలోచన చేయడానికి కారణం ఏంటనే ప్రశ్న వినిపిస్తోంది. భారత రాష్ట్ర సమితి తో బిజెపి పొత్తు ఉంటుందన్న పరిణామ క్రమంలోనే జనసేన ను దూరం పెట్టినట్లు తెలుస్తోంది. అయితే జనసేన మాత్రం ఒంటరి పోరాటానికి అన్ని ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు సమాచారం.వాస్తవానికి ఏపీ మాదిరిగా




తెలంగాణలో రాజకీయాలు ఉండవు. బిజెపి ఆది నుంచి స్వంతంగా ఎదిగేందుకు ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. కానీ ఆశించిన స్థాయిలో ఆ ప్రయత్నాలు ఏవి ఫలించడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం గట్టి ప్రభావం చూపింది. అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఎనిమిది పార్లమెంట్ స్థానాలను తెచ్చుకుంది. అయితే బిజెపి అంతలా ప్రభావం చూపడానికి కారణం భారత రాష్ట్ర సమితి బలహీనం కావడమే. అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి బలపడలేదు. ఆ బలాన్ని భర్తీ చేయాలంటే భారత రాష్ట్ర సమితితో పొత్తు బిజెపికి అవసరం. అదే సమయంలో పూర్వవైభవం దిశగా అడుగులు వేయాలంటే ఓట్లతో పాటు సీట్లు పెంచుకోవడం భారత రాష్ట్ర సమితికి అవసరం. అందుకే ఆ రెండు పార్టీలు ఇప్పుడు పరస్పరం ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. జనసేన ను బిజెపి దూరం పెట్టడానికి అదే ప్రధాన కారణం అని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి.తెలంగాణలో మొన్న ఆ మధ్యన జరిగిన పరిణామాలు తెలియనివి కావు. పవన్ కళ్యాణ్ ను తెలంగాణ నుంచి కొంతమంది వ్యతిరేకించడం ప్రారంభించారు. దీంతో తెలంగాణలో కార్యకలాపాలు మొదలు పెట్టింది జనసేన. హైదరాబాదులో రాష్ట్ర కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. అయితే బిజెపితో పొత్తు ఉంటుందన్న తరుణంలోనే ఇలా చేస్తున్నారని అంతా భావించారు. కానీ భారతీయ జనతా పార్టీ ఆలోచన మరోలా ఉంది. అందుకే జనసేనతో పొత్తు విషయంలో క్లారిటీ ఇచ్చింది. కానీ ఏపీ అనుభవాల నేపథ్యంలో ఒంటరిగా ముందు పోటీ చేసి.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటే ఇతర పార్టీలు పొత్తుకు ముందుకు వస్తాయని.. అందుకే ఒంటరిగా ముందుకు వెళ్దామని జనసేన వర్గాలు ఒక నిర్ణయానికి వచ్చాయి. సెటిలర్స్ అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు అభిమానులు ఉన్నచోట పార్టీని మరింత బలోపేతం చేయాలని జనసేన భావిస్తోంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది.

# దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ రూ.2.25 కోట్ల ఆర్థిక సాయం

**కేసీఆర్ నిర్ణయం**

**ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి అండగా నిలిచేందుకు కేసీఆర్ కీలక నిర్ణయం**

**పిల్లల చదువు, ఆయన తల్లి బాగోగుల కోసం ఆర్థిక సాయం**

ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పరంగా సుదర్శన్ రెడ్డి కుటుంబానికి మొత్తంగా రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆయన ఇద్దరు పిల్లలకు చెరో రూ. కోటి చొప్పున ఆర్థిక సాయం అందించనుండగా, వృద్ధాప్యంలో ఉన్న ఆయన తల్లి అమృతమ్మ బాగోగుల కోసం రూ. 25 లక్షలను బ్యాంకులో జమ చేయనున్నారు. పిల్లల చదువు, భవిష్యత్తు, కుటుంబ సంక్షేమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేసీఆర్ స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నాయకులతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. సుదర్శన్ రెడ్డి దశదిన కర్మల



కార్యక్రమాలు పూర్తయిన తర్వాత జిల్లా ముఖ్య నేతలు సమావేశమై కుటుంబ సంక్షేమానికి సంబంధించిన చర్యలను అమలు అమలు చేస్తారని కేసీఆర్ తెలిపారు

# బంజారాహిల్స్లో భారీ అగ్నిప్రమాదం



**హైదరాబాద్:** బంజారాహిల్స్ రోడ్ నంబర్ 11 లోని ఓ భవనం సెల్లార్లో దారు వల వైన్ మార్ట్ స్టాక్ స్టోరేజ్ భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సెల్లార్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది 3 ఫైర్ ఇంజిన్లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. చాలా సేపటివరకు మంటలు పూర్తిగా అదుపులోకి రాలేదు. సెల్లార్ నుంచి భారీగా పొగలు వెలువడ్డాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలు, ఆస్తి నష్టం, ప్రాణనష్టంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# 100 ఎకరాల్లో బస్ డిపో

**హైదరాబాద్, ఆగస్టు 8:** హైదరాబాద్‌లో ట్రాఫిక్ పెరుగుతోంది.. ఎక్కడికక్కడే ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు ఏర్పాటు చేసినా సరే ట్రాఫిక్ మాత్రం తగ్గడం లేదు. మెట్రో రైలుతో పాటుగా ఆర్టీసీ ప్రజా రవాణా అందుబాటులో ఉన్నా సరే ట్రాఫిక్ కష్టాలు మాత్రం కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ నగరంలో వాహనాలకు తోడు తెలంగాణలోని ఇతర జిల్లాలతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు హైదరాబాద్‌కు వస్తున్నాయి. ముఖ్యంగా ఏపీతో పాటుగా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి ఆర్టీసీ బస్సులు నగరానికి రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల కోసంఎంజీబీఎస్, జేబీఎస్ బస్ స్టేషన్‌లు ఉన్నాయి.. అయినా సరే ఒత్తిడి ఏమాత్రం తగ్గడం లేదు. అందుకే తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరో బస్టాండ్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.. టీజీఎస్‌ఆర్టీసీ 100 ఎకరాల్లో అత్యాధునిక బస్ టెర్మినల్‌ను ప్లాన్ చేసింది. తాజాగా ఈ డిపోకు సంబంధించి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ జగద్గిరిగుట్ట దగ్గర బస్ డిపో నిర్మాణం కోసం కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం దగ్గర 100 ఎకరాలు కేటాయించినట్లు నితిన్ గడ్కరీ తెలిపారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు గడ్కరీ సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ పరిధిలోని జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు కలిపి రోజూ 404 ట్రిప్పుల వరకు తిరుగుతాయన్నారు. టీజీఎస్‌ఆర్టీసీ బస్ డిపో, టెర్మినల్ నిర్మాణం కోసం 99 ఏళ్లకు లీజుకు తీసుకోవడానికి హెచ్‌ఎంటీకి చెందిన స్థలాన్ని గుర్తించిందన్నారు.కానీ హెచ్‌ఎంటీ అధికారులు.. అంత సుదీర్ఘకాలం స్థలాన్ని లీజుకు ఇవ్వలేమని, 5 ఏళ్లకోసారి చొప్పున గరిష్ఠంగా 20 ఏళ్లకు మాత్రమే ఇస్తామని చెప్పారన్నారు. దీని కోసం ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని చెప్పగా.. ఆ ప్రతిపాదనకు టీజీఎస్‌ఆర్టీసీ అంగీకరించలేదన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం టీజీఎస్‌ఆర్టీసీకి గాజులరామారం దగ్గర హెచ్‌ఎంటీ భూములకు సమీపంలో 100 ఎకరాలు కేటాయించినట్లు కేంద్రమంత్రి గడ్కరీ తెలిపారు. గాజుల రామారంలో ఏర్పాటు చేయబోయే డిపోలో ఇంటర్ స్టేట్ బస్సు సర్వీసుల కోసం ప్రత్యేకంగా బస్ టెర్మినల్ ప్లాన్ చేశారు. సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్, ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌కు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సు కారణంగా ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలు, తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి వచ్చే బస్సులు ఈ డిపోకు వెళ్లనున్నాయి. అప్పుడు ఎలాంటి సమస్య ఉండదని భావిస్తున్నారు

# మాజీ మంత్రి విమర్శించే నైతికత ఎమ్మెల్యేకు లేదు...

**ఆంధ్ర ప్రయోజనాలకే ముఖ్యమంత్రి ఆరాటం**

**వనపర్తి ఆగస్టు 8( స్కై న్యూస్)** బిఆర్ఎస్ కృషి గత ప్రభుత్వ చిత్తశుద్ధి వల్లే మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు సాగునీరు అందించడం జరుగుతుందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిని విమర్శించే నైతికత ఎమ్మెల్యేకు లేదని పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ మండిపడ్డారు శనివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే మెగా రెడ్డి అవగాహన రాయిత్యంతో వ్యాఖ్యలు చేస్తూ ప్రజలలో చులకన అవుతున్నారని మాజీ మంత్రి ప్రాజెక్టులపై దృష్టి సారించడం వల్లే ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కావడంతో పాటు రైతులకు సాగునీరు అందుతుందని వివరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో పాటు మాజీ



మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నిరంతరం రైతుల సంక్షేమం కోసం పనిచేయడంతో పాటు సాగు జలాలను సద్వినియోగం చేసుకొని రిజర్వాయర్లను నింపడం వల్ల వలసల జిల్లా నుండి వలసలు తగ్గాయని గుర్తు చేశారు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడం కోసం ఈ ప్రాంత రైతులను మోసం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. వరద నీటిని సద్వినియోగం చేసుకొని రిజర్వాయర్లను నింపి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి నాయకత్వంలో రిజర్వాయర్లను ముట్టడి చేస్తామని హెచ్చరించిన తర్వాతే ప్రభుత్వం కే ఎల్ ఐ లో మూడు పంపులను ప్రారంభించారని గుర్తు చేశారు గుడిపల్లి రిజర్వాయర్లో నీటిని ఎక్కిపోవడం మానుకొని కాలువలకు నీళ్లు వదలాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని నిరూపించుకునేందుకు కేఎల్ఐ పరిధిలోని 500 చెరువులు కుంటలు నింపాలని డిమాండ్ చేశారు ఈ సమావేశంలో నాయకులు మాణిక్యం పరంజ్యోతి తిరుమల మహేశ్వర్ రెడ్డి హుస్సేన్ సయ్యద్ జమీల్ పాండు తదితరులు పాల్గొన్నారు

## శిథిలావస్థలో ఉన్న ఇల్లు కూలి పక్కింటిపై పడి..

# తృటిలో తప్పిన ప్రమాదం

**కూలిన శిథిలాలను తక్షణమే తొలగించాలని మున్సిపల్ అధికారులకు మార్కెట్ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ సూచన.**

**మున్సిపల్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు**

**రంగారెడ్డి జిల్లా ఆగస్టు 8 (స్కై న్యూస్)** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు కసబ్‌వాడలో గురువారం కురిసిన వర్షాల నేపథ్యంలో శిథిలావస్థలో ఉన్న ఓ ఇల్లు కూలి పక్కనే ఉన్న ఇంటిపై పడింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. ఖస్సాబ్ వాడకు చెందిన మహమ్మద్ జాంగీర్ (ఇంటి నం. 11-96) కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. ఆయన ఇంటి పక్కనే కొంతకాలంగా వినియోగంలో లేకుండా శిథిలావస్థకు చేరిన ఓ ఇల్లు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో గురువారం ఆ ఇల్లు ఒక్కసారిగా కూలిపోయి జాంగీర్ ఇంటిపై పడింది. ప్రమాదం జరిగిన సమయంలో జాంగీర్ సతీమణి కొద్ది క్షణాల ముందు ఆ ప్రాంతం నుంచి ఇంట్లోకి వెళ్లడంతో ప్రమాదం తప్పిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే ఘటనలో నష్టం వాటిల్లినట్లు వారు పేర్కొన్నారు. కూలిన ఇంటి శిథిలాలు అలాగే ఉండటంతో మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ఇంట్లో కి పోవడం ఇబ్బంది గా ఉన్నట్లు తెలిపారు. ఆందోళన వ్యక్తం చేసిన బాధిత కుటుంబం, శిథిలాలను తక్షణమే తొలగించడంతో పాటు ప్రమాదకర స్థితిలో ఉన్న భవనాలపై మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీఖాన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాంగ్రెస్ పార్టీ 19వ వార్డు నాయకుడు సర్పుద్దిన్ తదితరులతో కలిసి కూలీన ఇంటినీ పరిశీలించిన ఆయన, ప్రజలకు ఇబ్బంది కలగకుండా కూలిన ఇంటి శిథిలాలను త్వరితగతిన తొలగించేలా మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో శిథిలావస్థలో ఉన్న భవనాల విషయంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు మున్సిపల్



అధికారులను కోరుతున్నారు.

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధిపై

# ప్రత్యేక సమీక్షా సమావేశం

**పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిఆగస్టు 08(స్కై న్యూస్):** డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శనివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో చేపట్టిన, చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ గారు పాల్గొన్నారు.ఈ సమావేశంలో మంత్రివర్గ సభ్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారితో పాటు ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, చింతకుంట విజయరమణ రావు గార్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఇప్పటికే కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, చేపట్టాల్సిన నూతన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, డ్రైనేజీ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.రామగుండం



నియోజకవర్గానికి సంబంధించిన అభివృద్ధి అవసరాలు, పెండింగ్‌లో ఉన్న పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన ప్రాధాన్యతా పనులపై ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారు సమావేశంలో వివరించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని కోరారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి



పనులను వేగవంతం చేసి, ఉమ్మడి కరీంనగర్ జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఈ సందర్భంగా మంత్రులు పేర్కొన్నారు.ఈ సమావేశంలో రామగుండం ఎమ్మెల్యే వెంటా రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి గారు, ఉమ్మడి కరీంనగర్ జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

## త్యాగాలను పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలి....

**నాగర్ కర్నూల్ ఆగస్టు 8( స్కై న్యూస్)** అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో పోరాటాలు చేసి జీవితాన్ని త్యాగం చేసిన పండగల సాయన్న ను స్ఫూర్తిగా తీసుకొని యువత పోరాటాలకు సిద్ధం కావాలని పూలే అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిలకర బాలస్వామి కోరారు శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ఘనంగా జయంతిని నిర్వహించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగల సాయన్న జయంతిని రాష్ట్రవ్యాప్తంగా బహుజనుల పండుగ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ధన బలాన్ని అధికార ఎదిరించి సామాజిక న్యాయం కోసం హక్కుల సాధన కోసం పోరాడి అందరికీ స్ఫూర్తిగా నిలిచారని అన్నారు ఈ కార్యక్రమంలో ఆధార్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యం తోపాటు శేఖర్ పర్వతాలు సుదర్శన్ మదన్ యాదగిరి రవితేజ తదితరులు పాల్గొన్నారు



## సప్తాహ భజన ప్రారంభించిన ఎమ్మెల్యే

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 8 (స్కై న్యూస్):**సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండి రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తూ ఆదిశీలా క్షేత్రం మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం సప్తాహ భజన కార్యక్రమాన్ని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. సందర్భంగా ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణమాన్య పట్వారి ప్రహ్లాద రావు, ఈవో సత్య చంద్రారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికి దేవాలయంలో అర్చనలు నిర్వహించి అఖండ జ్యోతిని వెలిగించి సప్తాహ భజన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వరుణ దేవుని కరుణ ప్రతి ఒక్కరికి ఉండాలని శ్రీ తిమ్మప్ప స్వామి ఆశీస్సులతో సుభిక్షంగా వర్షాలు కురవాలని ప్రార్థించారు. అనంతరం అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదానం ప్రారంభించారు. ఈ సందర్భంగా చింతలముని దేవాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ధీరేంద్ర దాస్, మధుసూదనాచారి, రమేష్, సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్, పట్వారీ అరవింద రావు, బాబు రావు, జమ్ములమ్మ



దేవాలయ చైర్మన్ పురందరు, అన్నదాత నల్లారెడ్డి, చంద్రశేఖర రావు, గడ్డం కృష్ణారెడ్డి, సితారామ్ రెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, సత్య రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బండ్ల రాజశేఖర్ రెడ్డి,విక్రమ్ సింహా రెడ్డి, ఏ క్లాస్ పురం నాగేశ్వర్ రెడ్డి, గట్టు విజయ్ కుమార్, జంబురామన్ గౌడు, చంద్రశేఖర్ రెడ్డి, నరేందర్, మధు, పెద్దపల్లి అజయ్, వెంకటన్న, నారాయణ, సవారన్న, రాముడు,పద్మారెడ్డి, హార్మోనిస్ట్ రాఘవేంద్ర చారి, ప్రసాద్ ,భజన మండలి సభ్యులు ,వాల్మీకి పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ నూతన చైర్మన్లు, పాలకవర్గ సభ్యులకు అభినందనలు తెలిపిన మాజీ జెడ్పీటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 8 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) నూతన చైర్మన్లు, పాలకవర్గ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరికీ మాజీ జెడ్పీటీసీ తంద్ర విశాల శ్రావణ్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. రైతులకు ప్రభుత్వం అందించే రుణాలు, విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ సేవలు సకాలంలో అందేలా పీఏసీఎస్‌లు సమర్థవంతంగా పనిచేయాలని ఆమె సూచించారు. రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని నూతన చైర్మన్లు, పాలకవర్గ సభ్యులను కోరారు. పీఏసీఎస్‌లు రైతుల ఆర్థిక అభివృద్ధికి బలమైన వేదికలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి రైతుకు అందేలా నూతన పాలకవర్గాలు కృషి చేయాలని శ్రావణ్ రెడ్డి పేర్కొన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసి రైతుల ఆర్థిక ప్రగతికి సహకార వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆకాంక్షించారు.



## ఇంటిగ్రేడ్ మార్కెట్ షాపులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ భర్త తుమ్మల జయలక్ష్మి నరసింహులు యాదవ్

**ఇంటిగ్రేటెడ్ మార్కెట్ షాపులు త్వరలోనే ప్రారంభం**

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 8 (స్కై న్యూస్):**గద్వాల పురపాలక సంఘం పరిధిలోని టౌన్ పోలీస్ స్టేషన్ పక్కన నూతనంగా నిర్మాణం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ షాపులను పరిశీలించారు కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కౌన్సిలర్లు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మల నరసింహులు యాదవ్ మాట్లాడుతూ..ఇంటిగ్రేటెడ్ షాపులు త్వరలోనే ప్రారంభమవుతాయని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మల నరసింహులు యాదవ్ తో పాటు 3వ, వార్డు కౌన్సిలర్ నాగులు యాదవ్, జనార్దన్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.



## ఆశ్రఫ్ అలీ వైద్యానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ద్వారా మంజూరైన రూ.2 లక్షల ఎల్ఓసీ అందజేత

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 8 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా లోని జిల్లెడ్ చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్ల గ్రామానికి చెందిన ఆశ్రఫ్ అలీ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి స్పందించి వైద్య ఖర్చుల కోసం రూ.2 లక్షల ఎల్ఓసీ మంజూరు చేయించారు. ఎమ్మెల్సీ పంపిన ఎల్ఓసీ పత్రాన్ని స్థానిక నాయకులు బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అత్యవసర సమయంలో ఆర్థిక సహాయం అందించి ఆదుకున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి ఆశ్రఫ్ అలీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనక సోని శేఖర్, మాజీ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోనేరి నర్సింగ్ రావు, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మీదిగడ్డ బాబురావు, మాజీ సర్పంచ్ సయ్యద్ గౌస్, ఉప సర్పంచ్ బాలరాజ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



## సొంత నిధులతో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చేయూత

**వీర్లపల్లి, అంతిరెడ్డిగూడలో పోశమ్మ గుడులకు సీసీ రోడ్ల పనులు ప్రారంభం**

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 8 (స్కై న్యూస్):** ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని వీర్లపల్లి, అంతిరెడ్డిగూడ గ్రామ శివారులోని పోశమ్మ గుడులకు ఎట్టకేలకు అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులు రూ.5 లక్షలు వెచ్చించి సీసీ రోడ్లు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. గ్రామస్థుల సమస్యలను గుర్తించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా స్వంత నిధులతో పనులు చేపట్టడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీర్లపల్లి సర్పంచ్ చిందం పాండు విజ్ఞప్తి మేరకు ఈ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. సీసీ రోడ్లతో పాటు ఇతర అభివృద్ధి పనులను సర్పంచ్ చిందం పాండు దగ్గరుండి పర్యవేక్షిస్తూ ముందుకు తీసుకెళ్తున్నారు. తమ సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి, గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్ చిందం పాండుకు వీర్లపల్లి, అంతిరెడ్డిగూడ గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిందం పాండు, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## హర్ ఘర్ తిరంగా యాత్రను విజయవంతం చేయాలి

**బీజేపీ హర్ ఘర్ తిరంగా యాత్ర అసెంబ్లీ కన్వీనర్ కటికె నందకిషోర్**

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 8 (స్కై న్యూస్):** 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేవెళ్లలో నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా యాత్రను విజయవంతం చేయాలని అసెంబ్లీ కన్వీనర్ కటికె నందకిషోర్ పిలుపునిచ్చారు. శనివారం చేబిళ్ళలో మున్సిపల్ కన్వీనర్ డా. మల్లారి వైభవ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సన్నాహక సమావేశంలో యాత్ర కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనంత్ రెడ్డి, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వార్తాతరంగాలు ఆదివారం 09 ఆగస్టు 2026

# ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలి...

**హర్ ఘర్ తిరంగా కార్యక్రమ విజయవంతానికి కృషి చేయాలి**

**బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మా యాదవ్**



**నాగర్ కర్నూల్ ఆగస్టు 8 (స్కై న్యూస్)** దేశభక్తి ప్రతి ఇంటి నుంచి ప్రారంభం అయ్యేందుకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని సోషల్ మీడియా ఖాతాలో డిపి ఏర్పాటు చేసుకోవాలని బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు హర్ ఘర్ తిరంగా కార్యక్రమ మండల ఇంచార్జ్ పద్మ యాదవ్ సూచించారు శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మండల సమావేశానికి పట్టణ అధ్యక్షులు చెవ్వా ప్రమోద్ కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టితో కృషి చేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతోనే కార్యక్రమం విజయవంతం అవుతుందని ఇందుకు సామాజిక సంస్థలు స్వచ్ఛంద సంస్థలు విద్యావేత్తలు మత పెద్దలు తోపాటు అన్ని వర్గాలను కలుపుకొని వెళ్లేందుకు ప్రత్యేకంగా సమావేశం నిర్వహించినట్లు వివరించారు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజలలో అవగాహన కల్పించాలని సూచించారు. సందర్భంగా జాతీయ పతాకాలను పంపిణీ చేయడం జరుగుతుందని ఈనెల 10న ప్రతి ఇంటికి హార్ ఘర్ తిరంగా సందేశాన్ని విస్తృతంగా తీసుకువెళ్లాలని కోరారు అనంతరం బాలుర మరియు బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు భారత దేశ స్వాతంత్ర పోరాట చరిత్రను మహనీయుల త్యాగాలను కార్యక్రమ ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి కుటుంబం కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని అందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వారాధి శ్రీనివాసులు సూరిబాబు సుధాకర్ తోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు

# ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు సిద్ధం కావాలి

**సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్ధుల జంగయ్య**



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 8 (స్కై న్యూస్):** ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు బుద్ధుల జంగయ్య పిలుపునిచ్చారు. కొందుర్గులో జరిగిన కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల సీపీఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని, యువతకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. సీపీఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 14 వరకు ప్రచార కార్యక్రమాలు, పాదయాత్రలు నిర్వహిస్తున్నామని, సెప్టెంబర్ 1న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం, అవసరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

## వార్డు సభ్యురాలు పోతుగంటి రాణి చొరవతో వంపుగూడ రోడ్డుకు మరమ్మతులు



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 8 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా కర్తాల్ మండలం వంపుగూడ గ్రామంలో క్రషర్ టిప్పర్ల అధిక రాకపోకల కారణంగా గుంతలమయంగా మారిన రోడ్డుకు ఒకటో వార్డు సభ్యురాలు పోతుగంటి రాణి చొరవతో మరమ్మతు పనులు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కడ్తాల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ ఆధ్వర్యంలో రోడ్డు గుంతలను పూడ్చి మరమ్మతు పనులు నిర్వహించారు. రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి తక్షణమే మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్డు తరచూ దెబ్బతింటుందని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో గాజుల రాంరెడ్డి, కాయితీ నర్సింహారెడ్డి, గుర్కా మల్లేష్, గండికోట రామచంద్రయ్య, గొర్ల రాములు తదితర గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## పదవులు నిండుగా.. సేద్యానికి పండుగ

**నిజమైన నాయకులకే అవకాశం.. పనిచేసే ప్రతి నాయకుడికి రాజకీయ భవిష్యత్తు.**

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 8 (స్కై న్యూస్):** నూతనంగా ఎంపికైన పీఏసీఎస్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లతో రైతులకు సేవలు మరింత విస్తృతం కానున్నాయని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం తన క్యాంపు కార్యాలయంలో ఆరుగురు చైర్మన్లు, ఆరుగురు వైస్ చైర్మన్లు, 74 మంది డైరెక్టర్లను ఘనంగా సన్మానించారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ, విత్తనాలు, ఎరువులు, సబ్సిడీ పరికరాలు, రుణాలు తదితర అంశాల్లో సహకారం అందించాలని సూచించారు. బాధ్యతలు చేపట్టిన ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేసి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ చేపడుతున్న చర్యలతో వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం నూతన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి...

**ఆయిల్ పామ్ సాగుతో కూడా మంచి ఆదాయం**

**ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాలు కురిసే అవకాశం తక్కువ**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 8 స్కై న్యూస్):** ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న జలాశయాల నుంచి ప్రస్తుతం పెద్ద ఎత్తున వరద వస్తున్నప్పటికీ ఆ నీటిని జిల్లాలో ఉన్న రిజర్వాయర్లు, చెరువులు నింపుకొని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. జూరాల ప్రధాన కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేసినప్పటికీ వరద తగ్గుముఖం పడితే కాలువలకు నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా పడతాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ఖరీఫ్ సీజన్ మొత్తం కాలువల ద్వారా నీటి విడుదల చేసే విషయంపై స్పష్టత లేదన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా ఆయకట్టు రైతులకు వరి సాగు చేయవద్దని ఇప్పటికే తెలియజేయడం జరిగిందన్నారు. ఈనెల 7న హైదరాబాదు నుంచి పలువురు మంత్రులు, అధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్లో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. వచ్చే వేసవి ముగిసే వరకు ప్రజల తాగు నీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ వరద నీటితో ఎత్తిపోతల పథకాల ద్వారా జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నింపుతున్నట్లు తెలిపారు. కందులు, మిర్చి, మొక్కజొన్న, పెసర్లు మినుములు, కూరగాయలు, తదితర ఆరుతడి పంటలతో కూడా రైతులకు మంచి ఆదాయం చేకూరుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్బరత పప్పు దినుసుల పథకం కింద సబ్సిడీకి కందులు, మినుముల విత్తనాలు అందజేస్తున్నందున జిల్లా రైతులు తమ సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి పంటకు నాలుగు నెలల పాటు మడులలో నిత్యం రెండు ఇంచుల నీళు నిలువ చేయాల్సి వస్తుందని, కాబట్టి తక్కువ నీటితో పండించుకునే ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం శ్రేయస్కరమని తెలిపారు. పంటల వైవిధ్యంతోనే నేల సారవంతత కూడా పెరుగుతుందని, పంట మార్పిడి విధానాలు రైతులకు మేలు చేస్తాయని ఇప్పటికే వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు తెలియజేశారన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పందిరి కూరగాయల సాగుకు పందిరి నిర్మించుకునేందుకు ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు ఐదు యూనిట్ల చొప్పున, యూనిట్ కు రూ. 50 వేల చొప్పున ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం అందజేస్తున్నందున అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ఆయిల్ పామ్ పంటల సాగును కూడా ప్రోత్సహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఆయిల్ పామ్ మొక్కల మధ్యన అంతర పంటలుగా మూడేళ్లపాటు పప్పు దినుసులు, కూరగాయలు వంటి స్వల్ప కాలిక పంటలతోనూ లబ్ధి పొందవచ్చున్నారు. పామ్ గెలలు నాలుగో సంవత్సరం నుంచి వస్తాయని, అప్పుడు సమీపంలోని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మంచి ఆదాయాన్ని పొందవచ్చున్నారు. ఆయిల్ పామ్ తోటల సాగుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీకి మొక్కలను అందజేయడంతో పాటు బిందు సేద్య పరికరాలను కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఈ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులు వరి వంటి సాంప్రదాయ పంటలకు బదులుగా ఎక్కువ ఆదాయాన్ని పొందే అవకాశం ఉన్న పామ్ తోటలతో ఆర్థిక పురోగతి సాధించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

# మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో విద్యా వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ






**మహబూబ్ నగర్, ఆగస్టు 8(స్కైన్యూస్ )** నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారు. విద్యను సామాజిక మార్పుకు మూలస్తంభంగా భావించిన ఆయన, తన సొంత నిధులతో విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా అనేక వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. గత విద్యా సంవత్సరం 35 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన విద్యా వాలంటీర్ల వ్యవస్థ విశేష ఫలితాలను అందించింది. విద్యార్థుల హాజరు పెరగడం, అభ్యాస నైపుణ్యాలు మెరుగుపడడం, బలహీన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెరగడం వంటి సానుకూల మార్పులు కనిపించాయి. ఈ విజయాన్ని దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని విస్తరించి నియోజకవర్గంలోని వంద ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, విద్యావంతులైన మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరించి, పారదర్శకంగా ప్రత్యేక ఎంట్రెన్స్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన వారికి ఇంటర్వ్యూ నిర్వహించి, 100 మంది విద్యా వాలంటీర్లను ఎంపిక చేసి, వారికి సమగ్ర శిక్షణ అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఆగస్టు 8, 9, 10 తేదీలలో మూడు రోజుల పాటు మహబూబ్ నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతోంది. నిష్ణాతులైన అధ్యాపకుల బృందం ఆధ్వర్యంలో బోధన పద్ధతులు, విద్యార్థుల మానసిక స్థితి అవగాహన, సబ్జెక్ట్‌పై పట్టు పెంపు, డిజిటల్ లెర్నింగ్ విధానాలు వంటి అంశాలపై విస్తృతంగా శిక్షణ అందిస్తున్నారు. మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సమర్థవంతంగా కొనసాగుతోంది. వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో మొదటి రోజు శిక్షణ తరగతులు సజావుగా జరిగాయి. వాలంటీర్లు ఎంతో ఉత్సాహంగా పాల్గొని, తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన నైపుణ్యాలను అభ్యసిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడటమే కాకుండా, పేద మరియు గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందే అవకాశాలు పెరుగుతాయని స్థానికులు మరియు విద్యావేత్తలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి, మహబూబ్ నగర్ ఫస్ట్ చేపడుతున్న ఈ వినూత్న కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలవనుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మొదటి రోజు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయ బృందం రజిత, హిమాబిందు, సురేష్, ముస్తాక్, మ్యాథ్స్ శ్రీనయ్య లిసోషల్ శ్రీకాంత్ సోషల్, సుష్మిత సైన్స్ , వెంకటయ్య , శ్రీనివాస్ (సైకాలజిస్ట్), ఫస్సియొద్దిన్(మ్యాథ్స్ ) తదితరులు ఉన్నారు.

# జీఎం కార్యలయం లో సిపిఆర్ అవగాహనా కార్యక్రమం



**సింగరేణి ఆగస్టు 8 (స్కై న్యూస్ ):** కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ జనరల్ మేనేజర్ సి హెచ్. వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం జీఎం కార్యాలయంలో ఉద్యోగులకు సీపీఆర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం జనరల్ మేనేజర్ సి హెచ్. వెంకటరమణ మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వ్యక్తికి సకాలంలో సీపీఆర్ అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై ప్రాథమిక అవగాహన, శిక్షణ కలిగి ఉండటం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా పని ప్రదేశాల్లో అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఆలస్యం చేయకుండా తక్షణమే స్పందించే విధంగా ఉద్యోగులకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతకు సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు ప్రాథమిక సహాయం అందించే విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జీఎం సూచించారు. ఈ కార్యక్రమం లో భాగంగా గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్టు కు గురైన వ్యక్తిని గుర్తించడం, స్పందన శ్వాసను పరిశీలించడం, అత్యవసర వైద్య సహాయం కోసం సమాచారం అందించడం, ఛాతీపై కంప్రెషన్స్ చేయడం, అవసరమైన సందర్భాల్లో ఏఈడ్ పరికరాన్ని వినియోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఉద్యోగులతో ప్రాక్టికల్‌గా సీపీఆర్ చేయించి, సరైన విధానాన్ని ఎంఆర్ఎస్ వారు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో తొలి కొన్ని నిమిషాలు ఎంతో కీలకమని, వైద్య సిబ్బంది చేరుకునేలోపు సరైన పద్ధతిలో సీపీఆర్ అందించడం ద్వారా బాధితుడి ప్రాణాలను నిలబెట్టే అవకాశం ఉంటుందని శిక్షకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీఎం తో పాటు ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వర్లు ,ఏరియా ఇంజనీర్ వి. రామకృష్ణ, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, ఇంచార్జ్ అనంతరామయ్య , ఏరియా ఎస్టేట్స్ ఆఫీసర్ బి. తౌర్య, డివైపిఎం హరీష్ , సీనియర్ పీఓ మురళి , ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, ఐఎన్టియూసి ఫిట్ సెక్రటరీ సిహెచ్. సాగర్, ఏఐటి యూసి ఫిట్ సెక్రటరీ కే.సౌజన్య, ఇతర విభాగ ఆధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు. ఇతర అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# చదివిన బడిని మరువని పూర్వ విద్యార్థులు!

**రూ.30 వేలతో ఉన్నత పాఠశాలకు ప్రధాన గేట్ ఏర్పాటు..**




**జగిత్యాల జిల్లా,రాయికల్, ఆగష్టు 08,(స్కై న్యూస్):-** తాము చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకోవాలనే మంచి సంకల్పంతో జగిత్యాల జిల్లా రాయికల్ మండలం భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998-99, 2012-13 పదో తరగతి బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు పాఠశాలకు చేయూత అందించారు. తమ వంతు సహాయంగా రూ.30 వేల వ్యయంతో పాఠశాల ప్రధాన గేట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్న పూర్వ విద్యార్థులు, తమ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగడానికి పునాది వేసిన పాఠశాలను మరువకుండా దాని అభివృద్ధిలో భాగస్వాములు కావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని వారు పిలుపునిచ్చారు. పాఠశాలకు ప్రధాన గేట్ ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు రమణి, ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, సంజీవ్, వేణు, సురేష్, రాజగోపాల్, వంశీతో పాటు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

## ఓటర్ల జాబితా సవరణ (సర్) కు సహకరించిన

# కాంగ్రెస్ శ్రేణులకు ధన్యవాదాలు

**డీ.సీ.ఎం.ఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల**

**పాల్వంచ ఆగస్ట్ 8( స్కై న్యూస్):**బీ.ఎల్.ఎ. సూపర్ వైజర్ల సమావేశంలో పాల్గొన్న సర్ పి.సి.సి. కో–ఆర్డినేటర్ లింగోజి, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఆళ్ల మురళీ లతో పాటు పాల్గొన్న కొత్వాల ఓటర్ల జాబితా సవరణ (సర్) కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, సహకరించిన కాంగ్రెస్ శ్రేణులకు డీ.సీ.ఎం.ఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు. కొత్తగూడెం లోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బి.ఎల్.ఎ సూపర్ వైజర్లతో సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్ పి.సి.సి. కో–ఆర్డినేటర్ మాసనపల్లి లింగోజి, కొత్తగూడెం నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఆళ్ల మురళీ లతో కలిసి కొత్వాలలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ సర్ కార్యక్రమంలో బూత్ లెవల్ ఆఫీసర్లతో పాటు కాంగ్రెస్ పార్టీ నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లు ఇంటింటికీ తిరిగి ఓట్ల నమోదు అయ్యేలా కృషి చేశారని



అన్నారు. ఓటర్ల నమోదు లో బీ.ఎల్.ఓ లు, కాంగ్రెస్ పార్టీ బీ.ఎల్.ఏ లు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తూ ఓటర్లను చైతన్యపరిచారన్నారు. సర్ కార్యక్రమానికి సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలకు, అధినాయకత్వానికి కొత్వాల కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో లింగోజి, ఆళ్లమురళీ, కొత్వాల తో పాటు



కాంగ్రెస్ నాయకులు వై.శ్రీనివాసరెడ్డి, నూకల రంగారావు, గంగరెడ్డి భువన సురేందర్ రెడ్డి, వాసు మల్ల సుందర్ రావు, గుర్రం వెంకటరత్నం, ఉండేటి శాంతివర్ధన్, గుండు రవి, వాలపల్లి రాంబాబు, సందు ప్రభాకర్, భట్టు మురళి, బత్తుల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి పరిరక్షణలో మల్లన్న కృషి మరువలేనిది

**కుటుంబ సభ్యులను పరామర్శించిన జీవన్‌రెడ్డి**



**జగిత్యాల జిల్లా,రాయికల్, ఆగష్టు 08,(స్కై న్యూస్ ):** అటవీ ప్రాంత పరిరక్షణకు అంకితమై, హరితహారం స్ఫూర్తితో పచ్చదనం పెంపునకు కృషి చేసిన తెలంగాణ ఉద్యమకారుడు బత్తుల మల్లన్న మృతి బాధాకరమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం వస్థపూర్ గ్రామంలో మల్లన్న మృతితో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి ప్రారంభించిన హరితహారం కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని మల్లన్న అటవీ ప్రాంతాన్ని కాపాడేందుకు నిరంతరం శ్రమించారని తెలిపారు. చెట్ల నరికివేతను అడ్డుకోవడంతో పాటు కొత్త మొక్కలు నాటడం, వాటి సంరక్షణకు చర్యలు చేపట్టడం, అటవీ సంపదను కాపాడేందుకు స్థానికులను భాగస్వాములను చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టారని పేర్కొన్నారు.ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు మల్లన్న చేసిన సేవలు అభినందనీయమని, పర్యావరణ పరిరక్షణలో ఆయన చూపిన నిబద్ధత ఆదర్శనీయమని అన్నారు. అటవీ ప్రాంతాన్ని తన కుటుంబంలా భావించి సేవలందించిన మల్లన్నను కోల్పోవడం గ్రామానికి, పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ కటుకం రవి, నాయకులు గోపి, రాజిరెడ్డి, బర్కం మల్లేష్,మైపాల్, శ్రీధర్‌రెడ్డి, హరీష్‌రావు, సుధీర్, రవి, బొమ్మేన తిరుపతి, రొండి గంగారాం, దుంపేట బుచ్చన్న, ఎస్‌కే ముజాహిద్, కొత్తూరి రాకేష్, ఎండీ అంజాద్, మహేష్, రవి, నందు నాయక్, బుజ్జిఅక్క తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి అందించిన అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 8 (స్కై న్యూస్):** అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలం శాంతినగర్ గ్రామానికి చెందిన అడ్డాకుల రాజా కుమార్ ఆపరేషన్ కొరకు ? 3,00,000/– రూపాయల ఎల్ఓసి కాఫీని కుటుంబ సభ్యులకు అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అందజేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు



## కోటకొండలోపండుగ సాయన్న

# విగ్రహా ప్రతిష్ఠా పన కోసం భూమి పూజ

**అందరి వాడు పండుగ సాయన్న...వక్తలు**

**నారాయణపేట ఆగస్టు 8: (స్కైన్యూస్)** నారాయణ పేట జిల్లా మండలం కోటకొండ గ్రామంలో మత్స్యకార సంఘం గ్రామ అధ్యక్షులు ఎదురింటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెద్ద చెరువు దగ్గర బహుజన నాయకు డు పండుగ సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాటు కోసం శనివారం భూమి పూజనిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతి ధులు మాట్లాడుతూ పండుగ సాయన్న భారత స్వతంత్రోద్యమ (1900) కాలంలో నిజాం రాజ్యంలో జరిగిన తిరుగుబాట్లు, ఉద్యమాలు ఒక సమాంత ర చరిత్ర. పండుగ సాయన్న ఈ సమాంతర చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించ దగినవాదన్నారు. పండుగ సాయన్న 1860 నుండి 1900 వరకు జీవించి. 35– 38 ఏళ్ల వయసులో చంప బడినాడనీ, దానధర్మాలు చేసిన ప్రజా నాయకుడిగా, తెలంగాణ రాబిన్‌హుడ్ గా ప్రజలను దోసుకుంటున్న దొరల, దేశముక్ ల, అధి కారుల, సంపన్నుల ఆస్తు లను తీసుకొని, ఇవ్వకపోతే దోచుకుని పేదలకు పంచి పంచి పెట్టీ ప్రజల మనిషిగా



ఎదిగాడన్నారు. పండుగ సాయన్న ఆనాటి నిరంకుశ నిజాం అధికారాలను, అధికారులను ప్రశ్నించి, వారిని ఎదిరించి, తన సొంత పాలనా వ్యవస్థను స్థాపించుకొని, ఒక సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించడానికి ప్రయత్నం చేశాడన్నారు.

కానీ ఆధిప త్య శక్తులైన దేశముక్ లు, కరణంపటేళ్లు, భూస్వాము లు పథకం వేసి ఆనాటి నిజాం ప్రభుత్వం చేత సాయన్నను చంపించా రన్నారు. పండుగ సాయన్న కథను నేటికీ వింటుం టుంటామని ఆయన అంద రికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. అటువంటి గొప్ప వ్యక్తి విగ్రహాలు ప్రతి ఊరిలో ఉండాలన్నారు.కార్యక్రమంలో మత్స్యకార సంఘం అధ్యక్షులు ఎదురెంటీ శ్రీనివాసులు, గ్రామ సర్పంచ్ వెంకట్రామ్ గౌడ్,ఉప సర్పంచ్ చెన్నప్ప యాదవ్,బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వేపురి రాములు, బీజేపీ మాజీ ఎంపీటీసీ కెంచే శ్రీనివాసు లు, మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్, అఖిల భారత ఐక్య రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బి యాదగిరి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభంజన్ రావు, ఎడ్ల రాజు, వార్డ్ మెంబర్స్ కావలి నరసింహులు, పేరపల్ల రఫీ, భగవాన్ శంకర్, పండుగ ఆయన్నా అభిమానులు చుక్క గోవిందు, కావాలి వెంకటేష్,చర్లపల్లి ఆంజనేయులు ఎడ్ల కుర్మయ్య పెద్ద ఎత్తున యువకులు ప్రజలు పాల్గొన్నారు .

## డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేకపోయినా ఆందోళన వద్దు

**నోటీసు అందిన వారే పత్రాలు సమర్పించాలి -- రంగారెడ్డి జిల్లా ఎన్నికల యంత్రాంగం**

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 8 (స్కై న్యూస్):** ఎస్ఐఆర్ --2026లో భాగంగా డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు కనిపించని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రంగారెడ్డి జిల్లా ఎన్నికల యంత్రాంగం స్పష్టం చేసింది. సంబంధిత ఏ ఈఆర్ఓ నుంచి నోటీసు అందుకున్న ఓటర్లు మాత్రమే నోటీసులో సూచించిన



పత్రాలను స్వయంగా ధృవీకరించి సమర్పించాలని అధికారులు సూచించారు.నోటీసు జారీ చేయడం ఓటరు పేరు తుది జాబితా నుంచి తొలగించినట్లు కాదని తెలిపారు. జనన



ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్, విద్యా ధృవీకరణ పత్రం, నివాస ధృవీకరణ పత్రం తదితర అర్హత నిర్ధారణ పత్రాలను నిబంధనల ప్రకారం సమర్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా పారదర్శకంగా ఎస్ఐఆర్ --2026 ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## వరుస దొంగతనాలకు పాల్పడిన నిందితుడు అరెస్ట్

**పెద్దపల్లి ఆగస్టు 8 (స్కై న్యూస్) :** తాళం వేసి ఉన్న ఇళ్లను పగటిపూట రెక్కీ చేసి రాత్రి సమయంలో తాళాలు పగులగొట్టి బంగారు ఆభరణాలతో పాటు నగదును దొంగిలిస్తూ వరుస చోరీలకు పాల్పడుతున్న జగిత్యాల జిల్లాకు చెందిన వనం రామును మంథని సీఐ ఆధ్వర్యంలోని ప్రత్యేక




బృందం, రామగిరి పోలీసులు అరెస్ట్ చేసినట్లు మంథని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ వెల్లడించారు. రామగిరి ఎస్సై టి.శ్రీనివాస్ తన సిబ్బందితో శనివారం గస్తీ నిర్వహిస్తున్న సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లను పరిశీలిస్తూ నడుచుకుంటూ తిరుగుతున్న నిందితుడిని గుర్తించారన్నారు. పోలీసులను చూసి నిందితుడు పారిపోయేందుకు ప్రయత్నించగా అతని ప్రవర్తనపై అనుమానం రావడంతో తనిఖీ చేయగా అతని వద్ద ఒక బటన్ కత్తి లభించగా నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా,తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు చేసేందుకు వచ్చినట్లు అంగీకరించడంతో పాటు గతంలో తన సహచరులతో కలిసి పాల్పడిన పలు దొంగతనాల వివరాలను వెల్లడించినట్లు తెలిపారు. నిందితుడి నుంచి మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని, దొంగతనాలకు సంబంధించిన ఆస్తి రికవరీతో పాటు ఇతర నిందితుల పాత్రపై కూడా దర్యాప్తు కొనసాగుతోందని ఏసీపీ తెలిపారు. నిందితున్ని చాకచక్యంగా పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన మంథని సీఐ బి. స్వామి, రామగిరి ఎస్సై టి.శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ భార్గవ్, పోలీస్ కానిస్టేబుళ్లు డి.రమేష్, వి.అభిషేక్, బి.రాజ్‌కుమార్ లను ఏసీపీ మడత రమేష్ అభినందించారు.

# నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు..

**ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య**

**నారాయణపేట ఆగస్టు 8( స్కైన్యూస్)** నారాయణపేటజిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించి నెంబర్ ప్లేట్ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వాహనదారులను గుర్తించి జరిమానాలు విధించారు.అలాగే వెంటనే నెంబర్ పెట్లు వేసుకోవాలని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి వాహనానికి నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల వాహనాన్ని గుర్తించడం కష్టమవడంతో పాటు, నేరాలు జరిగిన సందర్భాల్లో దర్యాప్తుకు కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు.వాహనదారులు తమ వాహనాలకు ప్రామాణికమైన నెంబర్ ప్లేట్లను తప్పనిసరిగా అమర్చుకోవాలని సూచించారు. నెంబర్ ప్లేట్‌ను వక్రీకరించడం, అక్షరాలు లేదా అంకెలను స్పష్టంగా



కనిపించకుండా చేయడం, నెంబర్ ప్లేట్ స్థానంలో ఇతర రకాల ప్లేట్లు ఉపయోగించడం వంటి నిబంధనల ఉల్లంఘనలను సహించబోమని స్పష్టం చేశారు.ట్రాఫిక్ నిబంధనలు ప్రజల భద్రత కోసమే రూపొందించబడ్డాయని, ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించి నిబంధనలను పాటించాలని సూచించారు. వాహనం నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు చెల్లుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు.అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు మరియు ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్చరించారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలిగించే అవకాశం ఉందని ఎస్ఐ కృష్ణ చైతన్య పేర్కొన్నారు.ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని, సురక్షితమైన ప్రయాణానికి బాధ్యతాయుతమైన వాహనదారులుగా వ్యవహరించాలని ఆయన కోరారు.

# ఉల్లాస్ లెర్నింగ్ సెంటర్లను బలోపేతం చేయాలి

**15 ఏళ్లు నిండిన వారికి ఖాలో 10వ తరగతి, ఇంటర్‌లో నమోదు కల్పించాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి IAS**

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 7 (స్కై న్యూస్):** ఉల్లాస్ లెర్నింగ్ సెంటర్లను బలోపేతం చేసి నిరక్షరాస్య మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి ఐఏఎస్ సూచించారు. జిల్లాలోని 27 మండల రిసోర్స్ సెంటర్లలో ఉల్లాస్ లెర్నింగ్ సెంటర్ల బలోపేతం, టి ఓ ఎస్ ఎస్ 10వ తరగతి, ఇంటర్ నమోదుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. నిరక్షరాస్య మహిళలకు ఉల్లాస్ పుస్తకాలు, బోధనా సామగ్రి పంపిణీ




పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ప్రతి గ్రామంలోని నిరక్షరాస్య మహిళలు ఉల్లాస్ తరగతులకు హాజరయ్యేలా పంచాయతీ సెక్రటరీలు, అంగన్‌వాడీ టీచర్లు కృషి చేయాలని సూచించారు. అక్షరాస్యులైన ఎస్ హెచ్ జి మహిళలు తమ సంఘంలోని నిరక్షరాస్య మహిళలకు చదవడం, రాయడం నేర్పే బాధ్యత తీసుకోవాలని కోరారు. పనులకు వెళ్లే మహిళల కోసం సాయంత్రం 7 నుంచి 7.30 గంటల వరకు ఉల్లాస్ తరగతులు నిర్వహించాలని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రతిరోజూ 3.30 నుంచి 4 గంటల వరకు ఉల్లాస్ తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే 15 ఏళ్లు నిండిన అర్హులైన వారిని టి ఓ ఎస్ ఎస్ 10వ తరగతి, ఇంటర్‌లో నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమాలను ఉప సంచాలకులు, వయోజన విద్య కె. అనిత పర్యవేక్షించారు.

## పారదర్శకమైన, తప్పులులేని ఓటరు జాబితానే ఎస్ఐఆర్ లక్ష్యం

**అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకూడదు**

**జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 8 (స్కై న్యూస్):** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ ఐ ఆర్--2026) ద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన, తప్పులులేని ఓటరు జాబితాను రూపొందించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణ రెడ్డి తెలిపారు. రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో గుర్తింపు పొందిన



రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎస్ ఐ ఆర్ --2026 ప్రక్రియపై కలెక్టర్ సమీక్షించారు. ఎన్యుమరేషన్ ఫారాల కరెక్షన్, డిజిటలైజేషన్ ప్రక్రియలను ఆగస్టు 10లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు పేరు తొలగిపోకూడదని, అదే సమయంలో అర్హత లేని వారి పేర్లు జాబితాలో ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా, అక్టోబర్ 19న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు తెలిపారు. ఓటర్ల సంఖ్య, భౌగోళిక పరిస్థితులు, సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపడుతున్నట్లు చెప్పారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, విలీనం, స్థల మార్పు, పేరు మార్పు అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గేటెడ్ కమ్యూనిటీలకు సమీపంలో, నిబంధనలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటును కూడా పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. (ఎస్ ఐ ఆర్) ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీలు, బి ఎల్ ఓ లు, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఘనంగా బోనాల సంబరాలు

**చుంచుపల్లి ఆగస్ట్ 8( స్కై న్యూస్):** ధన్‌బాద్ గ్రామపంచాయతీ పరిధిలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో బోనాల సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్ రెడ్డి బ్రదర్ జయ బాలన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎల్కేజీ యూకేజీ విద్యార్థినీ విద్యార్థులు వివిధ సాంప్రదాయ






వేషధారణలతో ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు బోనాలను ఎత్తుకొని సాంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి బ్రదర్ జయ బాలన్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో బోనాలకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. తెలంగాణ ప్రజలు బోనాల పండుగను ఎందుకు నిర్వహిస్తారు, దాని విశిష్టత ఏమిటి అనే అంశాలను విద్యార్థులకు వివరించారు. మన సంస్కృతి, సంప్రదాయాలను చిన్ననాటి నుంచే విద్యార్థులకు పరిచయం చేయడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రదర్ విల్ ఫెడ్ ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పీఏసీఎస్ ఎన్నికలకు దూరంగా ప్రభుత్వం.. ఓటమి భయమే కారణం

**రైతుల ఓట్లతోనే పాలకవర్గాన్ని ఎన్నుకోవాలి**

**పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కుర్వ యాదయ్య**

**రంగారెడ్డి జిల్లా , ఆగస్టు 8 (స్కై న్యూస్):** పీఏసీఎస్ ఎన్నికలు నిర్వహించకుండా నామినేషన్ ద్వారా చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లను నియమించడం సరికాదని మేకగూడ పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కుర్వ యాదయ్య అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై నమ్మకం లేకే ఎన్నికలకు దూరంగా ఉంటోందని ఆరోపించారు. పీఏసీఎస్‌లో 2,500 మందికి పైగా రైతులకు ఓటు హక్కు ఉందని, పార్టీ గుర్తులు లేకుండా రైతులే తమ పాలకవర్గాన్ని ఎన్నుకునే వ్యవస్థను కొనసాగించాలని కోరారు.



ఎన్నికలు నిర్వహించకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులకు నామినేటెడ్ పదవులు కట్టబెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రభుత్వం వెంటనే నామినేటెడ్ నియామకాలను ఉపసంహరించుకుని, రైతుల ఓట్లతో పీఏసీఎస్ పాలకవర్గాన్ని ఎన్నుకునేలా ఎన్నికలు నిర్వహించాలని కుర్వ యాదయ్య డిమాండ్ చేశారు.

## కొత్తపేట పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నం శ్రీధర్‌రెడ్డి

**నియామక పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**కేశంపేట ఆగస్టు 8 (స్కై న్యూస్):** కేశంపేట మండలం కొత్తపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)కు ప్రభుత్వం నూతన కమిటీని నియమించింది. ఈ మేరకు పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నం శ్రీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా రంగు శంకరయ్య నియమితులయ్యారు. శనివారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వారికి నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నూతన కమిటీ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ పీఏసీఎస్ సేవలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుమగల రమేష్, మాజీ జెడ్పీటీసీ విశాల శ్రావణ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, మనోహర్ గౌడ్,మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండె రాణి, అనసూయమ్మ, ఆమేర్, గ్యార సురేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే జై మధుసూదన్ రెడ్డి

**దేవరకద్ర ఆగస్టు 8 (స్కై న్యూస్);** హైదరాబాద్ మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ని కలసి దేవరకద్ర నియోజకవర్గానికి సంబంధించి, ఇందిరమ్మ ఇండ్ల ఎల్ 3 సమస్యలను పరిష్కరించాలని, అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయడానికి సంబంధించిన ఫైనల్ రిపోర్ట్ ఇప్పటికే ప్రభుత్వానికి



అందజేయడం జరిగిందని, త్వరితగతిన కార్యాలయాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రినీ కోరిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ విజ్ఞప్తి పై, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

## బాలానగర్‌లో నేషనల్ హైవే ఫ్లైఓవర్ నిర్మాణం పరిశీలించిన అడిషనల్ కలెక్టర్...

**మహబూబ్ నగర్, ఆగస్టు 8(స్కైన్యూస్ )** బాలానగర్‌లో జరుగుతున్న నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఫ్లైఓవర్ నిర్మాణం, సర్వీస్ రోడ్ల నిర్మాణం పనులను, అంబేద్కర్ విగ్రహానికి సంబంధించిన పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పనుల పురోగతిని సమీక్షించి, నిర్మాణ కార్యకలాపాల ప్రస్తుత స్థితిని అంచనా వేశారు. నిర్ణీత నాణ్యతా ప్రమాణాలకు ఎక్కడా రాజీ పడకుండా, కొత్త ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేసేలా పనులను వేగవంతం చేయాలని ఆయన సంబంధిత అధికారులు, నిర్మాణ సంస్థలను ఆదేశించారు. అలాగే, పనుల నిర్వహణ సమయంలో సంబంధిత శాఖల మధ్య సరైన సమన్వయం ఉండేలా చూడాలని, ఆమోదించబడిన నిర్దేశిత ప్రమాణాలను పాటించాలని మరియు భద్రతా చర్యలను కచ్చితంగా అమలు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. నాణ్యత, భద్రత మరియు సరైన ట్రాఫిక్



నిర్వహణ ఏర్పాట్లతో నిర్ణీత గడువులోగా పనులు పూర్తి కావాలని ఆయన చెప్పారు. జడ్చర్ల లో జడ్చర్ల మున్సిపాలిటీలో కొనసాగుతున్న వర్షపు నీటి కాల్వ పనులు, జాతీయ రహదారి పనులు, కల్వర్టు పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, నాణ్యతను సమీక్షించి, సంబంధిత మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులను పనులను వేగవంతం చేసి, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అన్ని సంబంధిత శాఖల మధ్య సరైన సమన్వయం ఉండేలా చూడాలని, ముఖ్యంగా పనులు జరుగుతున్న సమయంలో సాధారణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేదా సమస్యలు కలగకుండా ఉండేందుకు తక్షణమే అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. నాణ్యత భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు

## స్వీయ రక్షణతో పాటు శారీరక, మానసిక దృఢత్వానికి కరాటే శిక్షణ ఎంతో ఉపయోగకరం

**జిల్లా ఎస్పీ డి.జానకి**

**మహబూబ్ నగర్, ఆగస్టు, 8(స్కైన్యూస్ )** పోలీసు సిబ్బందికి 45 రోజుల కరాటే శిక్షణా కార్యక్రమాన్ని శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని మైదానంలో జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో వివిధ రకాల పరిస్థితులు, సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. స్వీయ రక్షణ నైపుణ్యాలను కలిగి ఉండటం పోలీసు సిబ్బందికి ఎంతో అవసరమని, ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకోవడంతో పాటు అవసరమైన సందర్భాల్లో ఇతరులను రక్షించేందుకు కూడా ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కరాటే శిక్షణ కేవలం స్వీయ రక్షణకే పరిమితం కాదని, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, త్వరిత నిర్ణయం తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని ఎస్పీ తెలిపారు. పోలీసు సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, శిక్షణలో చురుకుగా పాల్గొని కరాటేలోని మెళకువలను పూర్తిస్థాయిలో నేర్చుకోవాలని ఎస్పీ సూచించారు. క్రమశిక్షణతో శిక్షణ పొందడం ద్వారా శారీరక సామర్థ్యంతో పాటు ఆత్మవిశ్వాసం పెరిగి, విధి నిర్వహణలో మరింత సమర్థవంతంగా పనిచేయగలుగుతారని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది తమ కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే ప్రజల భద్రత కోసం విధుల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి శారీరక, మానసిక సామర్థ్యాలను మరింత పెంపొందించేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు



దోహదపడతాయని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీస్పీ రమణా రెడ్డి, ఆర్ ఐ లు కృష్ణయ్య, నగేష్, ఆర్ ఎస్ ఐ లు లు రమేష్, సత్యం, వన్‌టౌన్ సబ్‌ఇన్‌స్పెక్టర్ వసంతతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మేకగూడ సింగిల్ విండో చైర్మన్‌గా అంబటి ప్రభాకర్...

**రంగారెడ్డి జిల్లా, ఆగస్టు 8 ( స్కై న్యూస్):** సామాన్య వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన అంబటి ప్రభాకర్ రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం మేకగూడ సింగిల్ విండో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. కార్యకర్త స్థాయి నుంచి ప్రజా నాయకుడిగా ఎదిగి ఈ పదవిని అధిరోహించిన ఆయన ప్రస్థానం స్ఫూర్తిదాయకమని పార్టీ శ్రేణులు, గ్రామస్థులు పేర్కొన్నారు. రైతు కుటుంబంలో పెరిగిన ప్రభాకర్ 90వ దశకంలో సంప్రదాయ పంటలకు భిన్నంగా కొత్త వంగడాలను సాగు చేస్తూ స్థానిక రైతులకు ఆదర్శంగా నిలిచారు. అనంతరం సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజలకు చేరువయ్యారు. గ్రామంలో విస్తృతంగా మొక్కలు నాటించడం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రజల ఆకాంక్ష మేరకు ఎస్‌బీ పల్లి సర్పంచ్‌గా ఎన్నికైన ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరి



గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. పార్టీ కష్టకాలంలోనూ కార్యకర్తలకు అండగా నిలిచి, గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేశారని నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు ముఖ్య అనుచరుడిగా, క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పనిచేసిన ప్రభాకర్‌కు ఆయన నిబద్ధతకు గుర్తింపుగా సింగిల్ విండో చైర్మన్ పదవి దక్కిందని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. “నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు రుణపడి ఉంటాను. అలాగే మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి, పార్టీ కార్యకర్తల సహకారాన్ని ఎప్పటికీ మరువను. రైతుల సంక్షేమం, ప్రజా సేవకు ప్రాధాన్యం ఇస్తాను” అని నూతన చైర్మన్ అంబటి ప్రభాకర్ తెలిపారు.

## పోలీసుల నిర్లక్ష్యం వల్లే న్యాయవాది హత్య..

**ఒత్తిళ్లకు లొంగకుండా నిందితులను అరెస్టు చేయాలి...**

**సీనియర్ బార్ కౌన్సిల్ సభ్యులు రఘునాథ్...**

**కొల్లాపూర్ ఆగస్టు 8 (స్కై న్యూస్)** పోలీసుల నిర్లక్ష్యం వల్లే న్యాయవాది మరియు ఆర్ఎంపీ డాక్టర్ భోగిని మల్లయ్య హత్యకు గురయ్యారని సీనియర్ బార్ కౌన్సిల్ సభ్యులు రఘునాథ్ మండిపడ్డారు శనివారం బార్ అసోసియేషన్ సభ్యులు కురుమయ్య నిరంజన్ నాగర్ కర్నూల్ బార్ అసోసియేషన్ సభ్యులు బోనాసి రాశీచందర్ తో కలిసి ఆయన మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో



వాస్తవ సంఘటన వివరాలను తెలుసుకున్నారు సందర్భంగా మృతుడి భార్య మణెమ్మ మాట్లాడుతూ హత్యకు ముందే తన భర్తకు ప్రాణహాని ఉందని పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదులు చేసిన ఇలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. గతంలో తన భర్త పై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనకు సంబంధించిన ఫిర్యాదుకు ఎఫ్ఐఆర్ నమోదైన నిందితులపై చర్యలు తీసుకోవడంలో పోలీసులు గత ప్రభుత్వ రాజకీయ నేతల ఒత్తిళ్ళకు లొంగి విఫలం కావడం వల్లే సంఘటన చోటుచేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. హత్యకు కొద్ది రోజుల ముందు పలువురు న్యాయవాదులతో కలిసి పోలీస్ స్టేషన్కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన ఎలాంటి రక్షణ కల్పించలేదని అన్నారు. 2007లో రిజిస్టర్ సేల్ డేట్ ద్వారా కొనుగోలు చేసిన భూమిపై కన్నేసిన దుండగులు భూమి ధర పెరగడం వల్ల అక్రమంగా కాజేయాలని ఉద్దేశంతో హత్యకు పాల్పడినట్లు ఆరోపించారు గత ప్రభుత్వం ప్రస్తుత ప్రభుత్వం దుండగులకు సహకరించడం వల్లే తన భర్త హత్యకు గురయ్యారని వివరించారు. ప్రస్తుత రాజకీయ నాయకులు అండదండలతోనే నిందితులు ధైర్యంగా తిరుగుతున్నారని అన్నారు సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పోలీసు శాఖతో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వనరులు ఉన్నప్పటికీ నిందితులను గుర్తించి అరెస్టు చేయకపోవడం వెనక కుట్ర దాగి ఉందని అన్నారు వెంటనే ఒత్తిళ్ళను ఎదుర్కొని నిందితులను అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు

## సహకార శాఖ, కేంద్ర కార్యాలం, గృహకలప ప్రాంగణంలో అంగ రంగా వైభావంగా బోనాలు



**హైదరాబాద్, ఆగస్టు 8(స్కైన్యూస్ )** ఆషాడా మాసం బోనాల సందర్భంగా తెలంగాణ సహకార శాఖ, కేంద్ర కార్యాలం, గృహకలప ప్రాంగణంలో అమ్మ వారికీ ఉద్యోగులు శుక్రవారం అంగ రంగా వైభావంగా బోనాలు సమర్పించడం జరిగినది. ఇందులో భాగంగా శాఖ కమీషనర్ రాహుల్ రాజ్ ఐ ఏ ఎస్ వారి సతీమణి నీరజ పాల్గొని అమ్మ వారికీ బోనం సమర్పించడం జరిగినది. సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ శాఖలో పనిచేస్తున్న ఉద్యగులు మరియు తెలంగాణ ప్రజలదరు సంతోషంగా, సుఖ శాంతులతో ఉండాలని అమ్మ వారికీ కోరుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సహకార శాఖ గాజీట్టెడ్ అధికారుల సంఘము అధ్యక్షులు శ్రీ. జగన్ మోహన్ వారి ప్రధాన కార్యదర్శి శ్రీ. భీమ్ రాజ్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం టి ఎన్ జి ఒ హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీ రామ్, సహకార శాఖ సంఘము అధ్యక్షులు అంజలి అధ్వర్యంలో జరిగినది వినోద్, విశాల్, రాము, సాయి కిరణ్, భరత్ ల సహకారం తో విజవంతం జరిగింది

వార్తాతరంగాలు

ఆదివారం 09 ఆగస్టు 2026

# ఏజెన్సీ చట్టాలకు 'చౌదరి' తూట్లు..

**బినామీల ముసుగులో భూ దందా..!**

**1/70 చట్టానికే సవాలుగా లక్ష్మీదేవిపల్లిలో రియల్ ఎస్టేట్ మాఫియా..**

**ఎస్టీ వర్సెస్ ఎస్టీ డ్రామా.. వెనుక నడుపుతున్న విద్యాసంస్థల అధినేత ఎవరు..?**

**శేషగిరినగర్ లో విచ్చలవిడిగా వెంచర్. అధికారుల మౌనం వెనుక మర్మమేంటి.?**

**లక్ష్మీదేవిపల్లి, ఆగస్టు 08 ( స్కై న్యూస్)** గిరిజన ప్రాంతాల్లో వారి హక్కులను, భూములను రక్షించేందుకు రాజ్యాంగం కల్పించిన 1/70 భూ బదలాయింపు నియంత్రణ చట్టం (ఎల్.టీ.ఆర్) లక్ష్మీదేవిపల్లి మండలంలో అభాసుపాలవుతోంది. చట్టాలు సామాన్యుడికే చుట్టాలుగా మారగా ధనబలం, రాజకీయ బలమున్న పెద్దలకు మాత్రం కాసులు కురిపించే కామధేనువుగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ ప్రముఖ విద్యాసంస్థల అధినేతగా చలామణి అవుతున్న సదరు చౌదరి అండదండలతో ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కుతూ కోట్లాది రూపాయల భూ దందా యథేచ్ఛగా సాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



**ఎస్టీ వర్సెస్ ఎస్టీ.. సరికొత్త బినామీ వ్యూహం**

1/70 చట్టం ప్రకారం గిరిజనేతరులు గిరిజన భూములను కొనడం, అమ్మడం నేరం.ఈ చట్టాన్ని దాటవేయడానికి సదరు భూ బకాసురులు సరికొత్త స్కెచ్ వేశారనే ఆరోపణలు ఉన్నాయి. అమాయక గిరిజనులను (ఎస్టీలను) బినామీలుగా ముందుపెట్టి ఎస్టీ వర్సెస్ ఎస్టీ పేరిట అంతర్గత లావాదేవీలు ముగించేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగితాలపై గిరిజనుల పేర్లు కనిపిస్తున్నా తెరవెనుక అసలు కథ నడిపిస్తూ కోట్ల రూపాయల లాభాలను గిరిజనేతర వ్యాపారులు తమ జేబుల్లో నింపుకుంటున్నారని వారు పేర్కొంటున్నారు.

**వ్యవసాయ క్షేత్రాలు.. రాత్రికి రాత్రే లేఅవుట్లు జరిపిన ఘనత..!**

మండల పరిధిలోని శేషగిరినగర్, సాటివారిగూడెం, హమాలీ కాలనీ ప్రాంతాల్లో ఈ అక్రమ దందా పరాకాష్టకు చేరిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. శేషగిరినగర్ గ్రామపంచాయతీ పరిధిలో సుమారు 29 ఎకరాలకు పైగా ఉన్న పచ్చని వ్యవసాయ భూములను జేసీబీలతో చదును చేసి ప్లాట్లుగా మార్చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నీరు నిలిచేందుకు రైతుల కోసం ఏర్పాటు చేసిన చెరువును సైతం పూడ్చివేశారని అయినప్పటికీ అధికారుల మౌనం వీడటం లేదని తెలుస్తోంది. ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కి దర్జాగా రియల్ ఎస్టేట్ దందాకు తెరలేపిన ఘనత చౌదరికే చెందుతుందని పరిస్థితులు చూస్తుంటే అర్థమవుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. హమాలీ కాలనీలో ఫారెస్ట్ భూమిని సైతం మింగేశారంటూ ఆరోపణలు ఉన్నాయి. ఫామ్‌హౌస్ చుట్టూ కబ్జాకు గురైన భూమిలో గిరిజన పట్టా భూములతో పాటు ఫారెస్ట్ భూములు కూడా ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎటువంటి అధికారక అనుమతులు, ఎలాంటి ప్రభుత్వ లేఅవుట్ నిబంధనలు పాటించలేదని స్థానికులు చెబుతున్నారు. రాత్రికి రాత్రే హద్దు రాళ్లు పాతేసి రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మార్చి అమ్మకాలకు సిద్ధం చేశారని ఆరోపిస్తున్నారు. అమాయక గిరిజనుల వద్ద వ్యవసాయ భూములను తక్కువ ధరకు లాక్కొని వాటిని ప్లాట్లుగా మార్చి అమాయక ప్రజలకు అంటగడుతున్నారని బాధిత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చౌదరి....పేరు చెబితే అధికారుల నోటికి తాళాలు..!**

ఈ దందా అంతా ఓ ప్రముఖ విద్యాసంస్థల అధినేత చౌదరి ఆధ్వర్యంలోనే జరుగుతోందని స్థానికులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఆరోపణలు



వెల్లువెత్తుతున్నా రెవెన్యూ, ఐటీడీఏ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక మర్మమేంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. చౌదరి అనే పేరు వినపడగానే అధికారులు మౌన ముద్ర దాల్చడం వెనుక ఎంతటి మామూళ్ల పర్వం నడిచింది..? చట్టాన్ని కాపాడాల్సిన వారే అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోని భూములను కొనుగోలు చేసేటప్పుడు ప్రజలు తీవ్ర అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేని 1/70 చట్ట పరిధిలోని ఇటువంటి వివాదాస్పద ప్లాట్లను కొనుగోలు చేసి తర్వాత చట్టపరమైన ఇబ్బందుల్లో పడొద్దని బాధితులు హెచ్చరిస్తున్నారు.

**జిల్లా అధికారులు రంగంలోకి దిగి ఏజెన్సీ చట్టాలను కాపాడాలి**

లక్ష్మీదేవిపల్లి మండలంలో జరిగిన భూ లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపి అసలు సూత్రధారులను బయటకు తీయాలని వివాదాస్పద వెంచర్ల వద్ద రెవెన్యూ అధికారులు తక్షణమే ఇది 1/70 చట్ట పరిధిలోని భూమి – కొనుగోళ్లు నిషేధం అంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏజెన్సీ చట్టాలనిబంధనలకు విరుద్ధంగా వేసిన హద్దు రాళ్లను వెంటనే తొలగించి, వ్యవసాయ భూములను కాపాడాలని ఏజెన్సీ చట్టాన్ని అపహాస్యం చేస్తున్న సదరు పెద్దాయన అక్రమాల చిట్టా, బినామీల పేర్లు, అందుకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

# బీజేపీ బాస్ ఇలాకాలో జెన్-జీ దెబ్బ!

బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తన బాస్ అని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగంగా ప్రకటించారు. ఆ బాస్ కంచుకోటగా చెప్పుకొనే బాంకీపూర్‌నియోజకవర్గంలో జరిగిన ఉపఎన్నికలో కమలం పార్టీ ఓడిపోయింది. జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ఘన విజయం సాధించారు. 'బీజేపీ కోటలో విజయం సాధించడం పట్ల మీ స్పందనేంటి?' అని ప్రశాంత్ కిశోర్‌ను ఓ జర్నలిస్ట్ అడిగితే, 'ఇది ప్రజాస్వామ్యం, ఎవరికీ కోటలు ఉండవు, కోట అనడంలోనే భూస్వామ్య మనస్తత్వం ఉన్నది' అని వ్యాఖ్యానించారు. దేశం మొత్తం తమ సామ్రాజ్యంగా, మోదీ తమ చక్రవర్తి అన్నట్టు బీజేపీ నేతలు, కార్యకర్తలు చెప్పుకొంటారు. మూడు దశాబ్దాలుగా బాంకీపూర్‌లో బీజేపీ వరుసగా విజయం సాధిస్తూనే ఉన్నది. కానీ ఇప్పుడు ఎదురైన ఓటమికి దేశవ్యాప్తంగా జరుగుతున్న జెన్–జీ ఉద్యమం ప్రభావం చూపినట్టు కనిపిస్తున్నది.

'ఇది బాంకీపూర్, మా కంచుకోట, ఇక్కడ బీజేపీ కుక్కను నిలబెట్టినా గెలుస్తుంది అని కమలం పార్టీ నేతలు, కార్యకర్తలు ధీమా వ్యక్తంచేస్తూ వచ్చారు. కానీ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాజీనామాతో ఖాళీ అయిన స్థానంలో ఆ పార్టీ తరఫున నీరజ్ కుమార్ పోటీ చేశారు. జన్‌సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్‌కిశోర్ 19 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. జెన్–జీ ఉద్యమం నేపథ్యంలో బిహార్ రాజధాని పాట్నా నగరంలోని నియోజకవర్గాల్లో ఒకటైన బాంకీపూర్‌లో జరిగిన ఉపఎన్నిక యావత్తు దేశం దృష్టిని ఆకర్షించింది. ఇంతకుముందు ఎన్నికల్లో ఏ సామాజిక వర్గానికి ఓట్లు ఎన్ని ఉన్నాయి? ఎవరెవరు ఏ పార్టీకి ఓటు వేస్తారు? అనే లెక్కలు ఉండేవి. ఆ లెక్కలను పటాపంచలు చేస్తూ బాంకీపూర్ ఓటర్లు తీర్పు చెప్పారు. అయోధ్య రామాలయ హుండీ చోరీ ఘటన నుంచి బీజేపీకి వరుస ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పుడు తాజాగా బాంకీపూర్‌లో ఓటమి ఆ జాబితాలో చేరింది.

లోకసభ ఎన్నికల్లో బీజేపీకి ఆధిక్యత లభించక పోయినా అత్యధిక స్థానాలు గెల్చుకుని మిత్రపక్షాల మద్దతుతో అధికారంలో కొనసాగుతున్నది. ఇప్పుడు ఇతర పార్టీల



ఎంపీలను ఈడీ, సీబీఐ వంటి అనుబంధ సంస్థల సాయంతో వరుసబెట్టి చేర్చుకుంటున్నది. బీజేపీ స్పీడ్ చూస్తుంటే గెలిచిన సీట్ల కన్నా కలుపుకొంటున్న సీట్లే ఎక్కువ అయినా ఆశ్చర్యం లేదనిపిస్తున్నది. రాజకీయ పోకడలపై ప్రజల్లో నిరాశావాదం అలుముకున్నది. ఇటువంటి పరిస్థితుల్లో జెన్–జీలు చిరుదీపమై ప్రజాస్వామ్యవాదులకు దారి చూపిస్తున్నారు.

ఈ దేశం ఇంతే అనే నిరాశావాదంలో కొందరు పెద్దలు ఉంటే, ఈ దేశం ఏ ఒక్క పార్టీదో కాదు, ఇక్కడేమీ రాచరికం లేదు. ప్రజాస్వామ్యంలో అందరూ బాధ్యతాయుతంగా ఉండాల్సిందే అని జెన్–జీ యువత ఆశావాదాన్ని చాటిచెప్తున్నారు. కొంతమంది ఉద్యమకారులపై కేసులు పెట్టిస్తూ పాలకులు ఇబ్బందులకు గురిచేయవచ్చునేమో కానీ, ఆ ఉద్యమం కలిగించిన చైతన్యం ఎక్కడికీ పోదు. జెన్–జీ ఉద్యమం రాజకీయ పక్షాల మీదనే కాదు, మీడియా మీద కూడా ఉద్యమం ప్రభావం చూపింది. ఒక్క ఢిల్లీలోనే కాదు జాతీయ మీడియా ఏ రాష్ట్రంలో కవరేజీకి వెళ్లినా దలాల్, గోదీ మీడియా అంటూ యువత నినాదాలు చేస్తున్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేక పవనాలు వీస్తున్న నేపథ్యంలో బాంకీపూర్ ఉపఎన్నిక ఫలితం బీజేపీ ఐటీ సెల్‌కు సైతం పెద్ద దెబ్బ కొట్టాయి. జెన్–జీ ఉద్యమం వరకు బీజేపీ ఐటీ సెల్ వాళ్లు ఎవరి మీదైనా, ఎలాంటి తప్పుడు ప్రచారమైనా చేసేవాళ్లు. వీరి ప్రచారాన్ని జెన్ జీ చాలా బలంగా ఎదుర్కొన్నది. బీజేపీ ఐటీ సెల్ తరహా ప్రచార రీల్ ఒకటి బాంకీపూర్‌లో బీజేపీ కొంప ముంచింది. ఫలితాల నిర్ణయంలో ఇది కూడా కీలక పాత్ర పోషించింది. ఐటీ సెల్ ఒక్క బీజేపీకి మాత్రమే కాదు, అందరికీ ఉన్నాయి అని ప్రశాంత్ కిశోర్ చూపించారు. మతం పేరుతో , కులం పేరుతో మూడు సార్లు అధికారంలోకి వచ్చి- ఈడీ, సీబీఐలతో అధికారాన్ని పటిష్ట పరుచుకున్న బీజేపీని జెన్–జీ ఆలోచనలో పడేసింది.

బాంకీపూర్ ఫలితంపై బీజేపీ సానుభూతిపరులు విచిత్రమైన ప్రచారం చేస్తున్నారు. వ్యూహాత్మకంగా అమిత్ షానే ఓడిపోయేటట్టు చేశారని ఓ వర్గం, మోదీ వ్యూహం అని మరో వర్గం చెప్పుకొంటున్నారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపిన విశ్వగురువు మోదీ అని ప్రచారం చేసిన బీజేపీ సానుభూతిపరులకు ఇలాంటి ప్రచారం పెద్ద కష్టమేమీ కాదు. బహుశా విశ్వగురువు యుద్ధాన్ని ఆపిన విషయం తెలియక రష్యా, ఉక్రెయిన్ ఇంకా యుద్ధం చేసుకుంటూనే ఉన్నాయి. జెన్–జీ ఉద్యమం కూడా బీజేపీ వ్యూహంలో భాగం అని కూడా ఓ వర్గం బలంగా ప్రచారం చేసింది. సానుభూతి పరుల్లో ఓ వర్గం దీనిని అంతే బలంగా నమ్ముతుంది. ఇంకా మతాలను, కులాలను నమ్ముకొని ఎప్పటిలానే గెలుస్తాం అనుకుంటే పొరపాటే. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన సంగతిపై దృష్టి పెట్టాలి.

ధర్మేంద్ర ప్రధాన్ స్థానంలో విద్యాశాఖ మంత్రిగా జోషీని నియమించారు. జోషీ అర్హతలు చూస్తే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం ఉద్యమించిన జెన్–జీపై ప్రతీకారంలా అనిపించింది. జోషీ చదివింది బీఏ. ఐటీ, ఏఐ రంగాల్లో ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులపై అవగాహన, ఆసక్తి ఉన్నవారిని విద్యాశాఖ మంత్రిగా నియమిస్తే ప్రయోజనం ఉండేది. అలాంటి వాళ్లు బీజేపీలో లేనప్పుడు రాజకీయ రంగంలో లేనివారిని తీసుకుంటే తప్పేమిటి? రాజకీయాలతో సంబంధం లేని ఆర్థిక నిపుణుడు మన్మోహన్‌సింగ్‌ను కాంగ్రెస్ ఏకంగా ఆర్థిక మంత్రిని, ప్రధాన మంత్రిని చేసింది.

మన్మోహన్‌సింగ్ వల్ల దేశానికి మేలు జరిగింది. ఇప్పుడు టెక్నాలజీలో పరిణామాలను గమనిస్తే బీఏ మంత్రులతో ఏ మాత్రం ప్రయోజనం ఉండదు. పార్టీ విధేయతకన్నా దేశ ప్రయోజనాలు ముఖ్యం.

# ఐఏఎస్ ల బదిలీలు....

**విజయవాడ, ఆగస్టు 8:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. మొత్తం 20 మంది ఐఏఎస్‌లు, ఇద్దరు ఐఎఫ్‌ఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా జె.శ్యామలరావు, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా కోన శశిధర్, ఏపీఎస్ ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్‌గా ఎం. శివప్రసాద్‌ను నియమించింది. టూరిజం, యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎస్. రావత్, ఆర్కియాలజీ, మ్యూజియం విభాగం కమిషనర్‌గా రేవు ముత్యాలరాజును ప్రభుత్వం నియమించింది. పర్యాటక శాఖ బాధ్యతల్లో ఉన్న ఆమ్రపాలి ని బదిలీ చేసి జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది.ఆమ్రపాలికి నో పోస్టింగ్ సీనియర్ ఐఏఎస్ అమ్రపాలికి పోస్టింగ్ లేని బదిలీ చేసింది ఏపీ ప్రభుత్వం. ఐఏఎస్ అధికారిణి కాట ఆమ్రపాలి ఆంధ్రప్రదేశ్ లో విధులు నిర్వహించేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఏపీలో విధుల్లో చేరినప్పటి నుంచి ఆమె విధులకు సక్రమంగా హాజరుకాకపోవడం, సుదీర్ఘకాలంగా సెలవుల్లోనే ఉండటం సర్వీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత మూడు నెలలుగా ఆమె వరుస సెలవుల్లోనే కొనసాగుతుండటంతో, ఏపీ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ఆమెను పర్యాటక శాఖ నుంచి బదిలీ చేస్తూ సాధారణ పరిపాలనా శాఖ లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది.విభజన చట్టం ప్రకారం ఐఏఎస్‌ల కేటాయింపు ప్రక్రియలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ ఆమెను ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది. అయితే, తన స్వస్థలం హైదరాబాద్ అని, కాబట్టి తెలంగాణలోనే కొనసాగేలా మినహాయింపు ఇవ్వాలని ఆమె కేంద్రంతో పాటు న్యాయస్థానాలను కూడా ఆశ్రయించారు. సుదీర్ఘ న్యాయపోరాటం చేసినప్పటికీ చివరకు ఊరట లభించకపోవడంతో, కేంద్ర ఉత్తర్వులకు లోబడి ఆమె అనివార్య పరిస్థితిల్లో ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్ట్ చేయాల్సి వచ్చింది. కానీ, విధుల్లో చేరిన మొదటి రోజు నుంచే ఆమె పాలనపై పెద్దగా దృష్టి సారించకపోవడమే కాకుండా ఎక్కువ సమయం సెలవులకే మొగ్గు చూపారు.హైదరాబాద్ కేంద్రంగా పనిచేసిన కాలంలో ఆమ్రపాలికి అత్యంత ప్రాధాన్యత కలిగిన జీహెచ్‌ఎంసీ కమిషనర్, హెచ్‌ఎండీఏ వంటి కీలకమైన పోస్టింగ్‌లు దక్కాయి. విశాలమైన అధికారాలు, మెట్రోపాలిటన్ పరిధిలోని పెద్ద పెద్ద ప్రాజెక్టులను నిర్వహించిన అనుభవం ఉన్న ఆమెకు.. ఏపీలో పర్యాటక శాఖ బాధ్యతలు కేటాయించారు. అయితే, ఏపీ ప్రభుత్వంలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా ఆమె పలుమార్లు తెలంగాణ క్యాడర్‌కు తిరిగి వెళ్లేందుకు తీవ్రస్థాయిలోనే ప్రయత్నాలు సాగించారు. కానీ, అందుకు సంబంధించిన మార్గాలు మూసుకుపోవడంతో ఆమె మానసికంగా ఏపీలో సేవలు అందించడానికి సిద్ధంగా లేరనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఒక వైపు రాష్ట్రంలో కీలకమైన శాఖల నిర్వహణకు సమర్థులైన అధికారుల అవసరం ఎంతో ఉంది. ఇటువంటి సమయంలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి వరుసగా సెలవుల్లో ఉండటం, కేటాయించిన స్థానంలో నిబద్ధతతో పనిచేయకపోవడం పట్ల సచివాలయ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఆమెను జీఏడీకి అటాచ్ చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో.. తదుపరి ఆమె ఏ రకమైన నిర్ణయం తీసుకుంటారు, మళ్లీ సుదీర్ఘ సెలవు పై వెళ్తారా లేక ఏపీలోనే మళ్లీ సీరియస్‌గా పని చేసేందుకు సిద్ధమవుతారా అన్నది తేలాల్సి ఉంది

# క్యాంపస్ లైఫ్.. రియల్ లైఫ్ కు చాలా తేడా ఉంటుది



**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి) ఢిల్లీలో జరిగిన 57వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన 3,000 మందికిపైగా పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఐఐటి ఢిల్లీలోని సోనిపట్ క్యాంపస్‌లో ఏఐ ఆధారిత అత్యున్నత పనితీరు గల సూపర్ కంప్యూటింగ్ కేంద్రమైన "పరం ప్రజ్ఞ"ను కూడా ప్రధానమంత్రి ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రధాని మోదీ మాట్లాడుతూ, వారు కేవలం డిగ్రీలతోనే కాకుండా, దేశానికి ఎంతో సేవ చేయాలనే కలలతో బయటకు వెళ్తున్నారని అన్నారు.ప్రస్తుతం విద్యార్థుల మనసుల్లో ఎన్నో ఆలోచనలు మెదులుతూ ఉండాలి అని ప్రధాని మోదీ వారితో అన్నారు. "నేనేమీ బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ మీలో సంఘర్షణ జరుగుతూనే ఉండాలి" అని ఆయన చమత్కరించారు. ప్రతి ఒక్కరి మనసులో తమ భవిష్యత్తుపై ఒక దృక్పథం ఉంటుందని ఆయన అన్నారు. ఐఐటి ఢిల్లీలో మొదటి రోజు నుంచి స్నాతకోత్సవం వరకు విద్యార్థుల ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, ఓరియెంటేషన్ నుంచి స్నాతకోత్సవం వరకు ఈ ప్రయాణాన్ని పూర్తి చేసినందుకు ఈ రోజు వారు అపారమైన సంతృప్తిని పొందుతారని ప్రధాని అన్నారు.విద్యార్థులు కేవలం డిగ్రీలు మాత్రమే సంపాదించడం లేదని, దేశానికి గొప్ప సేవ చేయాలనే కలలతో ఐఐటి ఢిల్లీ నుంచి బయటకు వస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. విద్యార్థులందరినీ వారి కొత్త ప్రయాణానికి ఆయన అభినందించారు. ప్రతి విద్యార్థికి రేపటిపై ఒక విభిన్నమైన దృక్పథం ఉంటుందని ప్రధానమంత్రి అన్నారు. ప్రతి ఒక్కరి మార్గం భిన్నంగా ఉంటుందని, ప్రతి ఒక్కరి కల కూడా భిన్నంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కలలు విభిన్నమైనప్పటికీ, ఈ రోజు ప్రతి ఒక్కరికీ ఒక ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తుందని ఆయన చెప్పారు.ఐఐటి ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ, "క్యాంపస్ జీవితానికి, క్యాంపస్ బయటి జీవితానికి చాలా తేడా ఉంది. ఐఐటి పరీక్షలకు సిలబస్ ఉంటుంది, కానీ జీవితమనే పరీక్షలో ప్రతీదీ సిలబస్‌కు అతీతంగా ఉంటుంది. జీవితం వేరే విధంగా సాగుతుంది. దానికి నిర్దిష్టమైన మార్గం గానీ, ప్రశ్నపత్రం గానీ ఉండదు. చాలాసార్లు, అసలు ప్రశ్న ఏంటో కూడా ఎవరూ చెప్పరు. ఆ ప్రశ్నను మీరే గుర్తించుకోవాలి" అని అన్నారు. ఐఐటి ఢిల్లీ 57వ స్నాతకోత్సవంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ, "ఈరోజు ఐఐటి ఢిల్లీలో ఏఐకి సంబంధించిన కొన్ని కొత్త కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి. దీనికి కూడా మీ అందరికీ నా శుభాకాంక్షలు" అని అన్నారు.చాలా మంది విద్యార్థులు తమ మొదటి జీతం కోసం ఎదురుచూస్తూ ఉంటారు."ఈరోజు మీరందరూ ఇక్కడ ఉన్నారు, కానీ మీ మనసులోని ఏదో ఒక మూల ఇంకేదో ఆలోచన ఉండాలి. ప్రతి విద్యార్థికి రేపటి గురించి తనదైన ఒక ఆలోచన ఉంటుంది. చాలా మంది విద్యార్థులు తమ మొదటి జీతం కోసం ఎదురుచూస్తూ ఉంటారు. కొందరు కొత్త నగరంలో కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి సిద్ధమవుతూ ఉంటారు. చాలా మంది స్నేహితులు తమ మొదటి స్టార్టప్ గురించి కలలు కంటూఉంటారు. ప్రతి ఒక్కరి మార్గం భిన్నంగా ఉంటుంది. ప్రతి ఒక్కరి కల భిన్నంగా ఉంటుంది, కానీ ఇవన్నీ ఉన్నప్పటికీ, మీ అందరిలో ఉమ్మడిగా ఉండే ఒక భావన ఉంటుంది."

# జాబ్ క్యాలెండర్ రెడీ ...

**నెల్లూరు, ఆగస్టు 8:**రాష్ట్రంలో త్వరలోనే మెగా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ ప్రకటించారు. ఇదే సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని, సున్నా స్థానాలకే పరిమితం కావాల్సి ఉంటుందని ఆయన జోస్యం చెప్పారు. శనివారం నెల్లూరులో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.వైసీపీ ఒక గొడ్డలి పార్టీ అని, ఆ పార్టీ నేతలు సైకోల్లా ప్రవర్తిస్తున్నారని నారాయణ మండిపడ్డారు. ఉన్నత న్యాయస్థానాలు హెచ్చరించినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రావడం లేదని విమర్శించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. 16,000 టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నందుకా లోకేశ్ రాజీనామా చేయాలని కోరుతున్నారని ఆయన ప్రశ్నించారు.ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయం ప్రాజెక్టు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ధర్నాలకు దిగుతోందని నారాయణ ఆరోపించారు. ఆ పార్టీ చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు సొంత పార్టీ నేతల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోందని, 'మావిగన్' అంటూ చేస్తున్న రాద్ధాంతాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన ఎద్దేవా చేశారు.

# న్యాయం చేయకపోతే సూసైడ్...

**జీవితాన్ని మార్చేసినా ఒక్క పోస్ట్...**

**తిరుపతి, ఆగస్టు 8:**సోషల్ మీడియాలో నాటి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్ట్ పెట్టినందుకు తనను కిడ్నాప్ చేసి భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు అనుచరులు కిడ్నాప్ చేసి చితకబాదారని రాజంపేటకు చెందిన మణి అనే బాధితుడు ప్రెస్‌మీట్ పెట్టాడు. నేటి ఈ కేసులో తనకు న్యాయం జరగలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేయకపోతే జగన్ ఇంటి ముందే ఆత్మహత్య చేసుకోవాల్సి ఉంటుందని ప్రకటించారు. బాధితుడు పత్తిమణి తెలిపిన వివరాలు ప్రకారం 2023 జూన్11న ఈ ఘటన జరిగింది. అప్పట్లో అధికార పార్టీలో ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి కుమారుడు అభినయ్ రెడ్డి సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. నారా లోకేష్, పవన్ కల్యాణ్‌ను తిరుపతిలో అడుగు పెట్టనివ్వబోమని వార్నింగ్ ఇచ్చారు. దీనికి స్పందించిన రాజంపేటకు చెందిన పత్తిమణి... రియాక్ట్ అయ్యాడు. ఇది రాచరిక పాలన కాదు, ప్రజాస్వామ్యం. ఎవరైనా ఎక్కడికైనా వెళ్లవచ్చు. అని కామెంట్ చేశాడు. ఈ చిన్న వ్యాఖ్యే జీవితాన్ని మార్చేసిందని అంటున్నారు. రాజంపేటలోని ఓ హోటల్‌లో టీ తాగుతున్న తనను భూమన అనుచరులు సుమారు 14 మంది మాటువేసి పట్టుకున్నారని చెప్పాడు. కళ్లల్లో కారం కొట్టి, ఇనుప రాడ్లతో విచక్షణారితంగా చితకబాది, కారులో కిడ్నాప్ చేసి తీసుకెళ్లారని వివరించాడు. 2023 జూన్ 11 ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3 గంటల మధ్య జరిగినట్టు బాధితుడు చెబుతున్నాడు. తనను తీసుకెళ్లి ఓబులవారిపల్లి ప్రాంతానికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. కేవలం రాజకీయ భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకే ఈ దాడి జరిగినట్టు బాధితుడు పేర్కొన్నారు. " మా గురించి కామెంట్ పెట్టడానికి నీకు ఎంత ధైర్యం' అంటూ కులం పేరుతో దూషిస్తూ తన ప్రాణాలు తీయడానికి ప్రయత్నించారని పత్తిమణి ఆవేదన వ్యక్తం చేశారు. కిడ్నాప్ చేసిన తర్వాత నిందితులు భూమన కరుణాకర్ రెడ్డికి వీడియో కాల్ చేశారని, ఆ కాల్‌లో పత్తిమణి రక్తసిక్తమైన స్థితిని చూపించారని బాధితుడు వివరించాడు. ' వీడి నాలుక కదా మాట్లాడింది, ఆ నాలుక కోసేయండి, చంపేసి శేషాచలం అడవుల్లో పడేయండి" అని భూమన కరుణాకర్ రెడ్డి ఆదేశించినట్టు మణి ఆరోపించారు. వారు చేసిన దాడిలో తన ముక్కు పూర్తిగా దెబ్బతిందని, ప్రస్తుతం ముక్కుతో గాలి పీల్చుకోలే స్థితిలో ఉన్నానని, ఐదు నిమిషాలు మాట్లాడితే ఆయాసం వస్తుందని, కన్ను కూడా దెబ్బతిన ఆపరేషన్ చేయంచుకున్నానని ఆయన తెలిపారు. బాధితుడు చావుబతుకుల మధ్య ఆసుపత్రిలో ఉంటే, అప్పటి రాజంపేట డీఎస్పీ చైతన్య నిందితులను సహకరించారని మణి ఆరోపించారు. నిందితులపై బలహీనమైన సెక్షన్లు పెట్టి 41ఏ నోటీసులతో వదిలేశారని, పైగా బాధితుడైన తనపైనే రిటర్న్ కేసులు పెట్టించారని ఆయన వాపోయారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ తనకు ఇంకా బెదిరింపులు వస్తున్నాయని మణి ఆవేదన వ్యక్తం చేశారు.

## బిజినెస్

### తగ్గుతున్న ముడి చమురు ధరలు.. లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గడం పెట్టుబడిదారుల సెంటిమెంట్ కు ఊతమిచ్చింది. ప్రభుత్వరంగ బ్యాంకులు, రసాయన రంగ షేర్లలో కొనుగోళ్లు పెరగడంతో సూచీలు పైకి ఎగిశాయి. సెన్సెక్స్ (ావఅంవఇ) 374 పాయింట్లు లాభపడి 78,954.76 వద్ద ముగిసింది. నిఫ్టీ (చీఅట్ఎ) 11.35 పాయింట్లు పెరిగి 24,636 వద్ద స్థిరపడింది. నిఫ్టీ షేర్లలో రిలయన్స్ ఇండస్ట్రీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, భారత్ ఎలక్ట్రానిక్స్ అత్యధిక లాభాలు నమోదు చేశాయి. మరోవైపు రియల్టీ, మీడియా, ఆటో రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. మిడ్‌క్యాప్ సూచీ 0.44 శాతం తగ్గగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.48 శాతం లాభపడింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, రసాయన రంగ షేర్లు మాత్రం మార్కెట్ కంటే మెరుగైన ప్రదర్శన కనబర్చాయి. ముడి చమురు ధరలు తగ్గడం భారత్‌కు అనుకూల పరిణామమని మార్కెట్ నిపుణులు అంటున్నారు. దిగుమతి వ్యయం తగ్గడంతోపాటు ద్రవ్యోల్బణ ఒత్తిడి కూడా తగ్గే అవకాశం ఉండటంతో మార్కెట్ సెంటిమెంట్‌కు ఇది మద్దతుగా నిలిచిందని విశ్లేషిస్తున్నారు.

### హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ క్లౌడ్




**న్యూఢిల్లీ :** టెక్నాలజీ దిగ్గజం మైక్రోసాఫ్ట్.. దేశంలో తమ నాల్గో క్లౌడ్ రీజియన్‌ను హైదరాబాద్‌లో అందుబాటులోకి తెచ్చినట్టు గురువారం ప్రకటించింది. దీంతో నగరం నుంచి వీలైన మైక్రోసాఫ్ట్ క్లౌడ్ సేవలు, వర్క్‌లోడ్‌లను నడిపించడానికి ఇక కస్టమర్లకు అవకాశం లభించిందని పేర్కొన్నది. ఇప్పటికే కంపెనీకి పుణె, చెన్నై, ముంబైలు క్లౌడ్ రీజియన్‌లుగా ఉన్నాయి. దీంతో ఇప్పుడు వీటికి హైదరాబాద్ తోడైంది. కాగా, భారత్‌లో 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడులను పెట్టేందుకు సిద్ధమైన మైక్రోసాఫ్ట్.. అందులో భాగంగానే ఈ క్లౌడ్ రీజియన్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసింది.

# బంగారంపై 85% వరకు లోన్..
# ముత్తూట్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ ఆఫర్!

అత్యవసర పరిస్థితుల్లో డబ్బు అవసరమైతే.. చాలామంది తమ వద్ద ఉన్న బంగారంపై లోన్ తీసుకోవాలనుకుంటారు. అలాంటి వారికి ముత్తూట్ ఫైనాన్స్ ఒక మంచి గోల్డ్ లోన్ ఆఫర్ అందిస్తోంది. ఇందులో మీరు.. మీ బంగారం విలువలో 85 శాతం వరకు లోన్ తీసుకునే అవకాశం ఉంది.

వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా వ్యాల్యూ, స్పీడ్, సేవింగ్స్ అనే మూడు ప్రధాన ప్రయోజనాలను అందిస్తున్నట్లు ముత్తూట్ ఫైనాన్స్ వెల్లడించింది. తక్కువ సమయంలోనే లోన్ అందించడం, సులభమైన ప్రక్రియతో సేవలు అందించడం తమ ప్రత్యేకత అని సంస్థ చెబుతోంది.

గోల్డ్ లోన్ కోసం దరఖాస్తు చేయాలనుకునే వారు మొబైల్ నెంబర్, పిన్‌కోడ్ ఎంటర్ చేసి దరఖాస్తు ప్రక్రియను ప్రారంభించవచ్చు. సంస్థ నిబంధనలు, షరతులకు అంగీకరించిన తర్వాత దరఖాస్తు పూర్తి చేయవచ్చు.

**ముత్తూట్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ ప్రత్యేకత**

ముత్తూట్ ఫైనాన్స్ గోల్డ్ లోన్ ప్రత్యేకత ఏమిటంటే.. లోన్ అందించే ప్రక్రియ చాలా వేగంగా ఉండటం. బంగారం విలువను అంచనా వేసిన వెంటనే లోన్ అందించే విధానాన్ని సంస్థ అనుసరిస్తోంది. అంతే కాకుండా.. వడ్డీ రేట్లు, కస్టమర్‌కు అనుకూలమైన సేవలతో మంచి గుర్తింపు పొందింది. దేశంలోనే అత్యధిక గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో కలిగిన సంస్థగా ముత్తూట్ ఫైనాన్స్ రికార్డ్ క్రియేట్ చేసింది. ముత్తూట్ ఫైనాన్స్ దేశవ్యాప్తంగా 7,500కు పైగా శాఖలతో సేవలు అందిస్తోంది. రోజూ 2.5 లక్షలకు పైగా వినియోగదారులు తమ సేవలను వినియోగిస్తున్నారని,



కేవలం ఒక్కసారి శాఖను సందర్శిస్తే వెంటనే గోల్డ్ లోన్ పొందే అవకాశం కల్పిస్తున్నామని కంపెనీ తెలిపింది.

వినియోగదారుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సంస్థ +శీశ్రీస ాశ్మీఅఏసశీఎవ అనే ప్రత్యేక సేవను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవ ద్వారా ఇంటి నుంచే గోల్డ్ లోన్ పొందే అవకాశం ఉంది. దీనికోసం ముందుగా లోన్ కోసం రిక్వెస్ట్ పెట్టుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాత సంస్థ ప్రతినిధులు ఇంటికే.. వచ్చి బంగారం విలువను అంచనా వేస్తారు. ఆ తర్వాత డబ్బు నేరుగా వినియోగదారుడి బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. దీంతో శాఖకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. ఇంటి నుంచే సౌకర్యవంతంగా లోన్ పొందవచ్చు.

# ఎల్ఐసీ లాభం 13,492 కోట్లు..
# క్యూ1లో 23 శాతం పెరిగిన ప్రాఫిట్

**న్యూఢిల్లీ :** బీమా సేవల సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్ఐసీ) ప్రోత్సాహకర ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.13,492 కోట్ల నికర లాభా న్ని గడించింది. కిందటేడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.10,987 కోట్లతో పోలిస్తే 23 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షాకాలంలో సంస్థ రూ.2,37,848 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది రూ.2,22,864 కోట్లుగా ఉన్నట్టు బీఎస్ఈకి సమాచారం అందించింది. దీంతో తొలి ఏడాది ప్రీమియం వసూళ్లు రూ.7,525 కోట్ల నుంచి రూ.9,217 కోట్లకు పెరిగాయి. అలాగే రెన్యువల్ ప్రీమియం వసూళ్లు కూడా 59,885 కోట్ల నుంచి రూ.61,833 కోట్లకు పెరుగగా, సింగిల్ ప్రీమియం వసూళ్లు రూ.56,369 కోట్లుగా ఉన్నాయి. దీంతో నికర ప్రీమియం ఆదాయం రూ.1,19,200 కోట్ల నుంచి రూ.1,27,250 కోట్లకు పెరిగాయి. మరోవైపు, నిర్వహణ ఖర్చులు రూ.2,11,928 కోట్ల నుంచి రూ.2,25,573 కోట్లకు చేరుకున్నట్టు తెలిపింది.




**వాటా విక్రయించే యోచన లేదు..**

వచ్చే ఏడాదిన్నరలోగా సంస్థలో వాటా విక్రయించేయోచనలో కేంద్ర ప్రభుత్వం లేదని ఎల్ఐసీ సీఈవో, ఎండీ ఆర్ దొరైస్వామి స్పష్టంచేశారు. ఇటీవల ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో 6.5 శాతం వాటాను కేంద్ర ప్రభుత్వం విక్రయించిన విషయం తెలిసిందే. సెబీ మార్గదర్శకాల ప్రకారం సంస్థలో ప్రజలు 25 శాతం వాటా కలిగివుండాలనే ప్రతిపాదనపై ఆయన స్పందిస్తూ..వచ్చే 18 నుంచి 24 నెలల్లో కేంద్రం మరోదఫా వాటా విక్రయించేయోచనలో లేదని, ఇప్పటికే 10 శాతం వాటాను విక్రయించినట్టు చెప్పారు.

# కొత్త కలయికలో ఇంగ్లండ్‌కు తొలి పరీక్ష..
# పోప్, లారెన్స్‌కు పిలుపు..!

కొత్త కోచ్, కొత్త కెప్టెన్ నేతృత్వంలో ఇంగ్లండ్ జట్టు తొలి పరీక్షకు సిద్ధమవుతోంది. జో రూట్ సారథ్యం, స్టీఫెన్ ఫ్లెమింగ్ కోచింగ్‌లో మొట్టమొదటి టెస్టు సిరీస్ ఆడుతున్న ఇంగ్లండ్ స్క్వాడ్‌ను ప్రకటించింది. స్వదేశంలో పాకిస్థాన్‌తో మూడు టెస్టుల సిరీస్ కోసం గురువారం ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు() పటిష్టమైన బృందాన్ని ఎంపిక చేసింది. తొలి రెండు మ్యాచ్‌లకు యువకెరటం జాకబ్ బెథెల్ దూరమవ్వగా.. సీనియర్ ఓలీ పోప్ స్క్వాడ్‌లోకి వచ్చాడు.

బజ్ బాల్ ఆటకు చెల్లుచీటీ ఇచ్చిన ఇంగ్లండ్ నాయకత్వ మార్పు, కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్ రాక అనంతరం తొలి పరీక్ష ఎదుర్కోనుంది. స్వదేశంలో పాకిస్థాన్‌తో టెస్టు సవాల్‌కు కాచుకొని ఉంది జో రూట్ సేన. దాంతో, మొదటి రెండు టెస్టులకు గురువారం సెలెక్టర్లు 16 మందితో కూడిన స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. అయితే.. జాకబ్ బెథెల్ అనూహ్యంగా స్క్వాడ్‌కు దూరమయ్యాడు. ఇటీవల టీ20లు, వన్డేల్లో ఓపెనర్‌గా రాణిస్తున్న బెథెల్ మోకాలి గాయం కారణంగా అందుబాటులో లేడు. న్యూజిలాండ్‌తో సిరీస్ ఆడని సీనియర్ బ్యాటర్ ఓలీ పోప్, బ్రైడన్ కార్సే, డాన్ లారెన్స్ లకు అవకాశం దక్కింది. జోర్డాన్ కాక్స్ మూడో స్థానంలో ఆడనున్నాడు.

ఈమధ్యే న్యూజిలాండ్ చేతిలో 2-1తో సిరీస్ కోల్పోయిన



ఇంగ్లండ్ ఈసారి పంజా విసరాలనుకుంటోంది. పాకిస్థాన్‌తో ఆగస్టు 19 నుంచి హెడింగ్లేలో తొలి టెస్టు మొదలవ్వనుంది. రెండో మ్యాచ్ ఆగస్టు 27 నుంచి.. మూడోది సెప్టెంబర్ 9వ తేదీన జరుగనుంది. ఇంగ్లండ్ టెస్టు స్క్వాడ్ : బెన్ డకెట్, ఎమిలియే గే, ఓలీ పోప్, జో రూట్(కెప్టెన్), జేమీ స్మిత్(వికెట్ కీపర్), ఆర్చర్, అట్కిన్సన్, షోయబ్ బషీర్, హ్యారీ బ్రూక్, కార్సే, సామ్ కుక్, జోర్డాన్ కాక్స్, మాథ్యూ ఫిషర్, డాన్ లారెన్స్, రాబిన్సన్, టంగ్.

### ఆసియా కప్ షెడ్యూల్ విడుదల..
### సెప్టెంబర్ 5న భారత్, పాకిస్థాన్ మ్యాచ్..!

క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ మళ్లీ చూసే అవకాశం రాబోతోంది. ఇటీవలే మహిళల వన్డే ప్రపంచకప్‌లో తలపడిన దాయాదులు ఈసారి ఆసియా కప్(ూాంఖు జబజూ 2026)లో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఆసియా దేశాలు పోటీపడే ఈ మెగా టోర్నీకి దుబాయ్ ఆతిథ్యమిస్తోందని, ఆగస్టు నెలఖరులో మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయని ఆసియా క్రికెట్ మండలి(ూజజ) తెలిపింది. గురువారం టోర్నీ షెడ్యూల్ విడుదల చేసింది ఏసీసీ. ప్రతిష్ఠాత్మక మహిళల ఆసియా కప్ షెడ్యూల్ వచ్చేసింది. దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈ మెగా ఈవెంట్ నిర్వహిస్తున్నామని గురువారం ఆసియా క్రికెట్ మండలి వెల్లడించింది. ఆగస్టు 28 నుంచి పోటీలు మొదలవుతాయని పేర్కొన్న ఏసీసీ.. అందరూ ఆసక్తి కనబరిచే భారత్, పాకిస్థాన్ మ్యాచ్ సెప్టెంబర్ 5న జరుగనుందని చెప్పింది.

**టాప్ -- 2 జట్లు సెమీస్‌కు**

రౌండ్ రాబిన్ పద్ధతిలో జరుగనున్న ఆసియా కప్‌లో గ్రూప్ ఏ, గ్రూప్ బీలో ఐదేసి జట్లున్నాయి. భారత్, పాకిస్థాన్, చైనా, హాంకాంగ్, థాయ్‌లాండ్ మొదటి గ్రూప్‌లో.. ఆతిథ్య యూఈఏ, శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండోనేషియాలు గ్రూప్ బీలో ఉన్నాయి. లీగ్ దశలో పాక్‌తో పాటు చైనా,



హాంకాంగ్, థాయ్‌లాండ్‌ను టీమిండియా ఢీకొట్టనుంది.ప్రతి గ్రూప్ నుంచి టాప్ -- 2 జట్లు సెమీస్‌కు వెళ్తాయి. సెప్టెంబర్ 13న ఫైనల్ మ్యాచ్‌తో విజేత ఎవరో తేలిపోనుంది.


## స్పోర్ట్స్

### టాప్ సీడ్‌గా అమ్మాయిల జట్టు
**చెస్ ఒలింపియాడ్‌లో అర్జున్ టీమ్‌కు రెండో సీడింగ్**




న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత మహిళల జట్టు టాప్ సీడ్‌గా బరిలోకి దిగనుంది. ఉజ్బెకిస్తాన్‌లోని సమర్‌కండ్ వేదికగా సెప్టెంబర్ 15నుంచి 28 వరకు జరిగే ఈ మెగా టోర్నీ ఓపెన్ సెక్షన్‌లో తెలంగాణ కుర్రాడు ఇరిగేశి అర్జున్‌తో కూడిన అబ్బాయిల జట్టు రెండో సీడ్‌గా పోటీ పడనుంది. అమెరికా టీమ్‌కు టాప్ సీడింగ్ దక్కింది. గత ఎడిషన్‌లో భారత పురుషుల, మహిళల జట్లు స్వర్ణ పతకాలు నెగ్గి డిఫెడింగ్ చాంపియన్ల హోదాతో ఈ టోర్నీకి సిద్ధమవుతున్నాయి. ఓపెన్‌లో అమెరికాతో పాటు మూడో సీడ్, ఆతిథ్య జట్టు ఉజ్బెకిస్థాన్, చైనా, జర్మనీ, నెదర్లాండ్స్ బలమైన పోటీదారులుగా ఉన్నాయి. అమ్మాయిల జట్టుకు రెండో సీడ్ జార్జియాతో పాటు కజకిస్థాన్, చైనా నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. 46వ ఎడిషన్ ఒలింపియాడ్‌లో రికార్డు స్థాయిలో 400 జట్లు పోటీ పడనున్నాయి. ఓపెన్‌లో 208, మహిళల విభాగంలో 192 దేశాలు పోటీలో ఉన్నాయి.

### మెస్సీ మాయ మళ్లీ మొదలు..



మయామి: ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్లో స్పెయిన్ చేతిలో ఓటమి బాధ తర్వాత అర్జెంటీనా సాకర్ లెజెండ్ లియోనల్ మెస్సీ మైదానంలో మళ్లీ మెరుపులు మెరిపిస్తున్నాడు. ఫిఫా కప్ ముగిసిన అనంతరం లీగ్స్ కప్‌లో ఇంటర్ మయామి క్లబ్ తరఫున బరిలోకి దిగిన మెస్సీ తన రెండో మ్యాచ్‌లో డబుల్ గోల్స్‌తో మ్యాజిక్ చేశాడు. దాంతో ఇంటర్ మయామి టీమ్ 4-2తో అట్లెటికో సాన్ లూయిస్‌పై విజయం సాధించింది. బుధవారం రాత్రి వర్షం అంతరాయం కలిగించిన ఈ పోరులో 11వ నిమిషంలోనే తొలి గోల్ కొట్టిన మెస్సీ.. 44వ నిమిషంలో మరోసారి బంతిని నెట్‌లోకి పంపించాడు. దాంతో ఈ టోర్నీలో మెస్సీ కొట్టిన గోల్స్ సంఖ్య 14కు (12 మ్యాచ్‌ల్లో) చేరింది. ఫలితంగా నాలుగేండ్ల ఈ టోర్నీ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా లాస్ ఏంజెల్స్ ఎఫ్‌సీ ప్లేయర్ డెనిస్ బౌంగా (13 గోల్స్) రికార్డును అర్జెంటీనా లెజెండ్ బ్రేక్ చేశాడు.



# ఆ భ్రమ నుంచి బయటపడాలి!

యాక్షన్‌తో పాటు తనదైన శైలిలో చక్కటి కామెడీని పండిస్తూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు హీరో వరుణ్‌తేజ్. ఆయన నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో హారర్, సూపర్‌నేచురల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ సంస్థలు నిర్మించాయి. నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్ ఇదని, రెండున్నర గంటల పాటు ప్రేక్షకుల్ని నవ్వుల్లో ముంచెత్తుతుందని వరుణ్‌తేజ్ చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన విలేకరులతో ముచ్చటించారు. దర్శకుడు గాంధీ ఈ కథ చెప్పినప్పుడు నవ్వుతూనే ఉండిపోయా. కోవిడ్ తర్వాత ఎక్కువగా సీరియస్, యాక్షన్ సినిమాలొచ్చాయి. ఎప్పటి నుంచో హాస్య ప్రధానంగా ఓ సినిమా చేయాలనుకుంటున్నా. ప్రేక్షకుల్ని రెండున్నర గంటల పాటు నవ్వించాలనే ఉద్దేశ్యంతో ఈ సినిమా చేశాను.

పొడవుగా, భారీ కటౌట్‌తో కనిపించే హీరోలకు కామెడీ సినిమాలు అంతగా సెట్‌కావనే అభిప్రాయం ఉంది. ఆ భ్రమ నుంచి బయటకు రావాలి. నిజానికి నటుడు అన్ని రకాల పాత్రలు చేయాలి. పాత్రను సరిగ్గా డిజైన్ చేస్తే అద్భుతంగా కామెడీ పండుతుంది. 'కొరియన్ కనకరాజు'లో యాక్షన్‌తో పాటు కామెడీ కూడా బాగా కుదిరింది.

ఈ సినిమా ప్రమోషన్స్‌ని చాలా కొత్తగా నిర్వహించాం. కంటెంట్‌కు కనెక్ట్ అయ్యే విధంగా ప్రచార కార్యక్రమాలకు రూపకల్పన చేశాం. ట్రైలర్‌లోనే కథ మొత్తం చెప్పి ప్రేక్షకుల్ని సినిమా కోసం ముందస్తుగా ప్రిపేర్ చేశాం. పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలకు కూడా సరిపడా సమయం దొరకడంతో సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. దాంతో విజయంపై ధీమా పెరిగింది.

ఈ సినిమా కోసం కొరియన్ భాష నేర్చుకున్నా. నాకు కొత్త పాత్రలు చేయడం, కొత్త వ్యక్తిలా జీవించడం చాలా ఇష్టం. ప్రతి పాత్రలో నేను కనిపించకుండా..నా క్యారెక్టర్ మాత్రమే కనిపించేలా కష్టపడతాను. ఈ సినిమాలో నా పాత్ర రెండు భిన్న పార్శ్వాల్లో సాగుతుంది. నటుడిగా ఛాలెంజింగ్ రోల్ చేసినందుకు సంతృప్తిగా ఉన్నా. ఇందులో నా హెయిర్‌స్టైల్ మొదలుకొని బాడీ లాంగ్వేజ్, డైలాగ్ డెలివరీ...ఇలా ప్రతీ విషయం కొత్తగా అనిపిస్తుంది.

ఈ సినిమా ప్రీమియర్‌షోస్ బుకింగ్స్ అన్నీ ఫుల్ అయిపోయాయి. ఓవర్‌సీస్‌లో కూడా సూపర్‌రెస్పాన్స్ వస్తున్నది. ప్రచార చిత్రాల ద్వారా సినిమా కంటెంట్ ప్రేక్షకులకు బాగా రీచ్ అయింది. సినిమా కూడా అందరి అంచనాలకు తగినట్లుగా ఉంటుంది. నా తదుపరి సినిమా 'బరి' తాలూకు ప్రీప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నది. పూర్తి స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే కథ ఇది. నేను చిన్నప్పటి నుంచి వాలీబాల్ ఆడేవాడిని. అది ఈ సినిమాకు బాగా హెల్ప్ అవుతున్నది. ఇందులో మా నాన్న కూడా కీలక పాత్రను పోషిస్తున్నారు. ఆయనతో కలిసి నటించాలనే కోరిక 'బరి' సినిమాతో నెరవేరబోతున్నది.




## 100 కోట్ల వ్యూస్‌తో చరిత్ర సృష్టించిన 'రామాయణ' ట్రైలర్

నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రామాయణ: పార్ట్–1' ట్రైలర్ అన్ని భాషలు, డిజిటల్ వేదికలు కలిపి 100 కోట్ల (1 బిలియన్) వ్యూస్ సాధించి భారతీయ సినీ చరిత్రలో అరుదైన రికార్డు నెలకొల్పింది. ఇప్పటివరకు ఏ భారతీయ సినిమా ట్రైలర్ ఈ ఘనత సాధించలేదు. హిందీ ట్రైలర్ ఒక్కటే 'వరల్డ్ ఆఫ్ రామాయణ' ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో 588 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించింది. యూట్యూబ్, ఫేస్‌బుక్, ఎక్స్ తదితర వేదికల్లో కూడా భారీ స్పందన లభించింది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా, యశ్ రావణుడిగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్ర ట్రైలర్ అద్భుతమైన విజువల్స్, విజువల్ ఎఫెక్ట్స్, హాన్స్ జిమ్మర్––ఏ.ఆర్. రెహమాన్ సంగీతంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమా దీపావళి కానుకగా నవంబర్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇటీవల ఈ చిత్రబృందం ఇంగ్లిష్ ట్రైలర్‌ను కూడా విడుదల చేసింది. అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని ఏఐ ఆధారిత సరికొత్త లిప్–సింక్ టెక్నాలజీని ఉపయోగించి ఈ వెర్షన్‌ను రూపొందించారు. అంతేకాకుండా, ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా సోనీ పిక్చర్స్ విడుదల చేయనుండటం విశేషం.

# ఫ్యామిలీ యాక్షన్ డ్రామా

విక్రమ్ సహిదేవ్, సంధ్యావశిష్ట, తారక్ పొన్నప్ప ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం'అనకాపల్లి' త్వరలో ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కాండ్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మించారు. బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లిలో ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నటుడు సోనూసూద్ ముఖ్యఅతిథిగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు అందించారు. తన సొంత ఊరు అనకాపల్లిలో ఈ వేడుక జరగడం ఆనందంగా ఉందని, ఫ్యామిలీ..యాక్షన్ అంశాల కలబోతగా ఈ సినిమా ఆకట్టుకుంటుందని నిర్మాత త్రినాథరావు నక్కిన తెలిపారు. అనకాపల్లిలోని రియల్ లొకేషన్లలో షూటింగ్ చేశామని నిర్మాత కాండ్రేగుల నాయుడు చెప్పారు. ఈ వేడుకలో చిత్రబృందమంతా పాల్గొన్నారు.



## కాకులు తల్వార్లు పడితే..

నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న సికింద్రాబాద్ నేపథ్య పీరియాడిక్ చిత్రం 'ది ప్యారడైజ్'. నిర్మాణ దశ నుంచే ఈ సినిమా భారీ హైప్‌ని క్రియేట్ చేస్తున్నది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 24న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం టీజర్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో జడల్ అనే పవర్‌ఫుల్ పాత్రలో నాని కనిపించబోతున్నారు. 'ఈ జాగా ఎవరిది? ఈ దేశమెవరిది? అంటూ నాని బిగ్గరగా నినాదాలు చేస్తూ తన వారిలో చైతన్యాన్ని రగిల్చే సన్నివేశాలతో టీజర్ ఆసక్తికరంగా మొదలైంది. ప్యారడైజ్ తాలూకు ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ తన జాతి జనుల కోసం ఆధిపత్య శక్తులతో పోరాడే యువకుడిగా నాని పాత్రను శక్తివంతంగా చూపించారు. 'అణచబడ్డ మన జాతి మర్లబడాలే..ఛీ అని ఛీదరించుకున్న నలుపురంగే మన జెండా. కాకి దానిమీద గుర్తు. కాకులు తల్వార్లు పడితే ఏమవుతుందో చూపిద్దాం' అంటూ నాని చెప్పిన సంభాషణలు టీజర్‌లో హైలైట్‌గా నిలిచాయి. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది.

## 20 నిమిషాల ఎపిసోడ్ కోసం 60 రోజుల షూటింగ్..



రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా పాన్ వరల్డ్ స్థాయిలో అత్యంత భారీ బడ్జెట్‌తో 'వారణాసి' అనే చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా రెండు పాత్రల్లో కనిపించనున్నారు మహేశ్‌బాబు. దాదాపు 20 నిమిషాల పాటు సాగే రామాయణం ఎపిసోడ్‌లో రాముడిగా మహేశ్ ప్రెజెన్స్ అద్భుతంగా ఉంటుందని సమాచారం. తెరపై కనిపించే ఈ 20 నిమిషాల ఎపిసోడ్ చిత్రీకరణకు దాదాపు 60 రోజులు పట్టిందట. ఇక ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం వరకు ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరగ్గా, మహేశ్ పాల్గొన్నారట. ఆ తర్వాత చిన్న బ్రేక్ తీసుకుని వెకేషన్ వెళ్లారు. మరి... బర్త్ డే సందర్భంగా 'వారణాసి' చిత్రం నుంచి మహేశ్‌బాబు ప్రత్యేక పోస్టర్‌ని కానీ వేరే ఏదైనా అప్‌డేట్ కానీ ఇస్తారేమో చూడాలి. ఎస్ఎస్ కార్తికేయ, కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027 ఏప్రిల్ 7న విడుదల కానుంది. దాదాపు 120 దేశాల్లో 'వారణాసి'ని రిలీజ్ చేయనున్నారు.

### విదేశాల్లో బర్త్‌డే సెలెబ్రేషన్స్

నటుడిగా ఎంత బిజీగా ఉన్నా ఫ్యామిలీకి తగినంత సమయాన్ని కేటాయిస్తుంటారు మహేశ్‌బాబు. షూటింగ్స్‌కి గ్యాప్ దొరికినప్పుడు ఫ్యామిలీతో వెకేషన్ ప్లాన్ చేసుకుంటారు. ప్రస్తుతం తన కుటుంబంతో సహా మహేశ్ విదేశాల్లో ఉన్నారు. ఈ నెల 9న ఈ హీరో పుట్టినరోజు. సో... బర్త్ డే వేడుకను అక్కడే జరుపుకుంటారు. ఆ తర్వాత హైదరాబాద్ చేరుకుని 'వారణాసి' సినిమా షూట్‌లో పాల్గొంటారు.

# చేనేత రంగానికి ఎల్లప్పుడూ ప్రభుత్వ మద్దతు

చేనేత రంగానికి ప్రభుత్వ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గ్రామీణ సాధికారత, మహిళల అభివృద్ధి అలాగే ఆత్మనిర్భర్ భారత్ కలను సాకారం చేయడంలో ఇదొక మూలస్తంభంగా అభివర్ణించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా శు భాకాంక్షలు తెలుపుతూ మోదీ శుక్రవారం ఎక్స్?లో ఒక ట్వీట్? చేశారు. తరతరాలుగా మన సాంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్న దేశంలోని చేనేత కార్మికులు, కళాకారుల నైపుణ్యాన్ని, సృజనాత్మకతను, వారి అంకితభావాన్ని మోదీ కొనియాడారు.



ప్రజలు తమకు ఇష్టమైన చేనేత దుస్తులు లేదా ఉత్పత్తులను ధరించి, #NationalHandloomDay హాష్‌ట్యాగ్‌తో »GRWMµ (Get Ready With Me) వీడియోలను సోషల్ మీడియాలో పంచుకోవాలని మోదీ ఇప్పటికే పిలుపునిచ్చారు. దీనివల్ల చేనేత రంగంపై ఆధారపడిన ఎంతో మందికి ప్రోత్సాహాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజలను చేనేత వస్త్రాల వైపు ఆకర్షించేందుకు, ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలని, వాటి వీడియోలను పంచుకోవాలని మోదీ విజ్ఞప్తి చేశారు. గురువారం రాత్రి ఇన్‌స్టాగ్రామ్ వీడియో ద్వారా ఇందుకు సంబంధించి ఓ వీడియో పోస్టు చేశారు. చేనేత దినోత్సవ వేడుకలు నేత కార్మికులకు, చిరు వ్యాపారులకు చేయూతనివ్వడమేనని ఆయన పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రతిఏటా ఆగస్టు 7న జరుపుకొంటారు. స్వదేశీ వస్తువులను ప్రోత్సహించి, స్వావలంబనను పెంపొందించడం కోసం గుర్తుగా 1905 నాటి స్వదేశీ ఉద్యమానికి ఇది గుర్తుగా నిలిచింది.

**'చేనేతకు స్వాతంత్ర్య పోరాటంతో బలమైన అనుబంధం ఉంది'**

మరోవైపు, చేనేతకు భారత స్వాతంత్ర్య పోరాటంతో బలమైన అనుబంధం ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. 1905 ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమం అధికారికంగా ప్రారంభమైందని, బంగాల్ విభజనకు నిరసనగా మొదలైన ఈ ఉద్యమం, స్వదేశీ వస్తువులు, స్వదేశీ పరిశ్రమలు, ముఖ్యంగా దేశంలోని చేనేత కార్మికులను ప్రోత్సహించడాన్ని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో జరిగిన 12వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఉద్దేశించి ముర్ము ప్రసంగించారు.

అదేవిధంగా, చేనేత రంగంలో అత్యున్నత పౌరపురస్కారంగా పరిగణించే సంత్? కబీర్? చేనేత అవార్డులను ముగ్గురు కళాకారులను రౌష్ట్రపతి అందజేశారు. శతాబ్దాల కాలంనాటి నేత సంప్రదాయాలను పరిరక్షిస్తున్న కళాకారులను గౌరవిస్తూ ఈ అవార్డులను బహూకరించారు. 22 మంది నేత కార్మికులు, డిజైనర్లు, సహకార సంఘాలు, పారిశ్రామికవేత్తలకు జాతీయ చేనేత అవార్డులు 2025ను ప్రదానం చేశారు. బిచిత్‌పార్ ఖాదీ చీరను నేసినందుకు గానూ ఒడిశాకు చెందిన రామ్ మెహర్ అవార్డును అందజేయగా, ముగా సిల్క్ చీరకు అవార్డును అసోంకు చెందిన రునిమా చేతియా చౌధురి అందుకున్నారు. అలాగే, ఉత్తర్?ప్రదేశ్‌కు చెందిన షా మహమ్మద్ అన్సారీ అరుదైన జర్బఫ్ట్ శౌతమ్బరి అవధ్ జమ్దాని చీరతో చేసిన తన పనికి గుర్తింపు పొందారు. మిగిలిన 19 మందికి వీవింగ్ (నేత), డిజైన్ డెవలప్‌మెంట్, మార్కెటింగ్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి వివిధ విభాగాల్లో జాతీయ చేనేత అవార్డులను బహూకరించారు.

**చేతివృత్తి మన సంస్కృతి సంప్రదాయాలకు ఒక రూపం**

ఇదిలా ఉండగా, చేతివృత్తి కేవలం ఉపాధికి సంబంధించిన అంశం కాదని, అది మన సంస్కృతి సంప్రదాయాలకు రూపమని అని అరుణాచల్ ప్రదేశ్? ముఖ్యమంత్రి పెమా ఖండూ ఉద్ఘాటించారు. చేనేత వారసత్వానికి సజీవ రూపమని, ఈ రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం దశాబ్ద కాలంగా కృషి చేసిందని ఆయన పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి, డిజిటల్? కార్యక్రమాల ద్వారా 77,000 మంది చేనేత కార్మికులు సాంప్రదాయ హస్తకళలను కాపాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతాన్ని ఇస్తున్నారని పేర్కొన్నారు. దేశీయ చేనేత వస్త్రాలు, జీఐ-ట్యాగ్ ఉన్న ఉత్పత్తులను మార్కెట్లలోకి చేరవేస్తున్నారని తెలిపారు.

# ఉగ్రవాద రహిత వాతావరణంలోనే పాక్‌తో సంబంధాలు ముందుకు సాగుతాయి

ఉగ్రవాద రహిత వాతావరణంలోనే పాకిస్థాన్‌తో సంబంధాలు ముందుకు సాగుతాయని భారత్ స్పష్టం చేసింది. పాక్? ఇప్పటికీ ఉగ్రవాదాన్ని ఒక ప్రభుత్వ విధానంగా వాడుకుంటూ సరిహద్దు ఉగ్రవాదానికి పాల్పడుతోందని కేంద్రం పార్లమెంట్?కు శుక్రవారం తెలియజేసింది. ఈ మేరకు లోక్?సభలో ఒక లిఖిత పూర్వక సమాధానంలో విదేశాంగ మంత్రి జైశంకర్ తెలిపారు. 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి అనంతరం, పాకిస్థాన్?కు ఇచ్చిన అత్యంత ప్రాధాన్యాన్ని భారత్ ఉపసంహరించుకుందని, పాకిస్థాన్?లో తయారయ్యే లేదా అక్కడి నుంచి ఎగుమతి అయ్యే వస్తువులపై సుంకాన్ని 200 శాతానికి పెంచిందని తెలిపారు. అలాగే, 2025 ఏప్రిల్ 22న పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన పహల్గాం దాడికి బదులుగా భారత్ కఠినమైన నిర్ణయాలు తీసుకుందని జైశంకర్ చెప్పారు. సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, అట్టారీ చెక్- పోస్ట్ మూసివేయడం, వీసాలపై ఆంక్షలు విధించడం, రెండు దేశాల్లోని రెస్పెక్టివ్ మిషన్లలో అధికారుల సంఖ్యను తగ్గించడం వంటి చర్యలను భారత్ తీసుకుందని తెలిపారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత జమ్ముకశ్మీర్‌లోని ఉగ్రవాద మౌలిక సదుపాయాలను లక్ష్యంగా భారత సైన్యం సైనిక చర్యకు దిగిందని గుర్తుచేశారు.



ప్రస్తుతం భారత్, పాక్? దేశాలు ఒకరి రాజధానిలో మరొకరు తమ దౌత్య కార్యాలయాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. సైనిక పరంగా డీజీఎంఓ స్థాయి చర్చలు, బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగ పరీక్షలకు సంబంధించిన ముందస్తు సమాచారం పంచుకోవడం, ఇరు దేశాల ఆధీనంలో ఉన్న అణు కేంద్రాలు, ఖైదీల జాబితాల వంటి అంశాలపై ఇరుపక్షాల మధ్య చర్చలు, సంప్రదింపులు జరుగుతున్నాయని వెల్లడించారు. సరిహద్దు ఉగ్రవాదం, దాని మౌలిక సదుపాయాలపై తగిన విధంగా భారత్ స్పందిస్తోందని తెలిపారు.

**ఆపదలో ఉన్న వారి కోసం 'వన్ స్టాప్ సెంటర్ల'**

ఇదిలా ఉండగా, దేశవ్యాప్తంగా హింసకు గురైన లేదా ఆపదలో ఉన్న మహిళలకు సహాయం చేయడానికి ప్రభుత్వం 1,000కి పైగా 'వన్ స్టాప్ సెంటర్ల'ను ఏర్పాటు చేసిందని ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభకు తెలియజేసింది. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ డింపుల్ యాదవ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా, మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ మాట్లాడారు. 2015 ఏప్రిల్?లో ఈ కార్యక్రమం ప్రారంభమైనప్పటి నుంచి 2026 జూన్ వరకు, దేశవ్యాప్తంగా ఈ కేంద్రాల ద్వారా 15 లక్షల మందికి పైగా మహిళలకు సాయం పొందారని తెలిపారు. జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయిల్లో మిషన్ శక్తి కింద ఉన్న పథకాల పనితీరును రియల్? టైమ్?లో పర్యవేక్షించడానికి వీలుగా మంత్రిత్వ శాఖ 'మిషన్ శక్తి డాష్‌బోర్డ్'ను రూపొందించిందని ఆమె పేర్కొన్నారు. కాగా, 'మిషన్ శక్తి' మార్గదర్శకాల ప్రకారం, దేశవ్యాప్తంగా ప్రైవేట్, బహిరంగ ప్రదేశాల్లో హింసను ఎదుర్కొంటున్న లేదా ఆపదలో ఉన్న మహిళలకు ఒకే చోట తక్షణ సహాయం అందించడం ఈ వన్? స్టాప్? సెంటర్ల ముఖ్య ఉద్దేశం. మరోవైపు, భూగర్భ జలాలకు సంబంధించి కీలక సమాచారాన్ని కేంద్రం పార్లమెంట్?కు తెలిపింది. 26 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 502 జిల్లాల్లో, భూగర్భ జలాల్లో అనుమతించదగిన పరిమితి కంటే ఎక్కువ నైట్రేట్ స్థాయిలను సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ (జ+ఔదీ) గుర్తించినట్లు పేర్కొంది. జ+ఔదీ 2025 వార్షిక భూగర్భ జల నాణ్యతా నివేదికను ఉటంకిస్తూ, రసాయనాలు, ఎరువుల శాఖ సహాయ మంత్రి అనుప్రియా పటేల్ లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పలు కీలక సమాచారాన్ని అందించారు. విశ్లేషించిన భూగర్భ జల నమూనాలలో 20.71 శాతం అనుమతించదగిన పరిమితిని మించి నైట్రేట్ గాఢతలు ఉన్నట్లు తెలిపారు.

# ఈ 20 పెట్రోల్ చాలా పెద్ద సమస్య

ఈ20 పెట్రోల్‌కు వ్యతిరేకంగా విపక్షాల ఆందోళన ఉద్ధృతమవుతోంది. ఇది చాలా పెద్ద సమస్య అని లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఇథనాల్ కలిసిన పెట్రోల్ ప్రజల జేబులకు చిల్లులు వేయడంతోపాటు వాహనాలను నాశనం చేస్తోందని విమర్శించారు. "దాల్ మే కుచ్ కాలా హై" (ఏదో అనుమానాస్పదంగా ఉంది) అనే హిందీ సామెతను ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో అవినీతి జరుగుతోందని రాహుల్ ఆరోపించారు. ఎక్స్‌లో ఓ వీడియోను షేర్ చేసిన రాహుల్‌గాంధీ, కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలో ఎక్కడ చూసినా అవినీతి రాజ్యమేలుతోందన్నారు. ప్రజల వాహనాలను నాశనం చేయటమే కాకుండా వారినుంచి నేరుగా దోచుకుంటున్న జు-20 ఇంధన వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ పెద్దఎత్తున పోరాటం చేస్తుందని రాహుల్ గాంధీ తెలిపారు. పరిపాలనా సమస్యలు, అవినీతి కేసుల సంఖ్య అధికంగా ఉన్నందున, రాజకీయ ప్రచారాలు సమస్యలకు ఒక నిర్దిష్ట క్రమంలో ప్రాధాన్యం ఇవ్వాలని రాహుల్ అన్నారు. "ఇది క్రమపద్ధతికి సంబంధించిన విషయం. ఏ ప్రచారంలోనైనా, మనం పనుల క్రమాన్ని నిర్ణయించుకోవాలి. ప్రస్తుతం మన సమస్య ఏమిటంటే, అవినీతి ఎంతగా పెరిగిపోయిందంటే, మనం క్రమబద్ధీకరించాల్సిన సమస్యల జాబితా చాలా పెద్దదిగా ఉంది" అని గాంధీ అన్నారు. ఈ 20 ఇంధన విధానాన్ని పరిష్కరించడానికి తమ ప్రాధాన్య జాబితాలో పైకి తీసుకువస్తున్నట్లు ఆయన సంకేతం ఇచ్చారు. "బాధ పడకండి మేము ఈ సమస్యను భారీ స్థాయిలో చేపట్టబోతున్నాం. ఎందుకంటే ఇది ప్రజల కార్లను నాశనం చేస్తోంది. ప్రజల స్కూటర్లను నాశనం చేస్తోంది. ప్రజల జీవితాలను నాశనం చేస్తోంది" అని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్‌ను విడుదల చేయడంపై కొనసాగుతున్న వివాదం మధ్య ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.



**ఎలాంటి ముప్పు లేదని కేంద్రం స్పష్టం**

మరోవైపు 20శాతం ఇథనాల్ కలిపిన ఇంధనమైన జు20 పెట్రోల్ వల్ల ఇంజిన్‌కు విస్తృత నష్టం లేదా అసాధారణ తుప్పు పడుతుందనడానికి ఆధారాలు ఏవీ లేవని కేంద్ర ప్రభుత్వం, ఆటోమోటివ్ సంస్థలు స్పష్టం చేశాయి. మైలేజీ తగ్గడం, విడిభాగాల అరుగుదలపై సోషల్ మీడియాలో ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో, అనుకూలమైన వాహనాలకు ఈ ఇంధనం సురక్షితమేనని అధికారులు స్పష్టం చేశారు. ఎలాంటి వ్యవస్థాగత వైఫల్యాలు లేకుండా 3 కోట్లకు పైగా కార్లు, 20 కోట్ల ద్విచక్ర వాహనాలు ఈ మిశ్రమ ఇంధనంతో నడిచాయని పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ పేర్కొంది. కొన్ని పాత లేదా ఆప్టిమైజ్ చేయని ఇంజిన్లలో ఇంధన సామర్థ్యంలో 3% నుంచి 5% వరకు స్వల్ప తగ్గుదల ఉందని అధికారులు అంగీకరించారు.

**కేవలం నాలుగు కల్తీ కేసులు మాత్రమే వచ్చాయి : పూరి**

ఇదిలా ఉండగా, ఈ 20 పెట్రోల్‌పై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి శు క్రవారం కీలక వ్యాఖ్యలు చేశారు. జూలై 28న ఒక పారిశ్రామిక సంస్థ లేఖ రాసిన తర్వాత లేవనెత్తిన ఆందోళనలకు స్పందిస్తూ, వాస్తవానికి రెండు వారాల ముందే విస్తృతమైన పరీక్షలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రత్యేక పరీక్షా బృందాలను ఉపయోగించి దేశవ్యాప్తంగా ఉన్న పెట్రోల్ స్టేషన్ల నుంచి ప్రతిరోజూ సుమారు 2,000 నమూనాలను సేకరిస్తున్నాయని తెలిపారు. రోజుకు ఆరు నుంచి ఏడు కోట్ల మంది వినియోగదారులకు సేవలు అందిస్తున్న భారత్?లోని 1,07,000 రిటైల్ ఔట్‌లెట్లలో కేవలం నాలుగు కల్తీ కేసులు మాత్రమే వచ్చాయని పేర్కొన్నారు. కానీ, కొన్ని వర్గాలు ఈ ఫలితాలను సందర్భం లేకుండా ప్రదర్శిస్తున్నాయని సూచించారు. భారతదేశ రిటైల్ ఇంధన నెట్‌వర్క్ 2014లో 52,000 ఔట్‌లెట్ల నుంచి నేడు సుమారు 1,07,000కు విస్తరించిందని చెప్పారు. వంటగ్యాస్‌పై సుంకం విధించే అవకాశం ఉందంటూ వస్తున్న వదంతులను ఆయన తోసిపుచ్చారు. ప్రస్తుతానికి ప్రభుత్వం అలాంటి ప్రతిపాదనను పరిశీలించడం లేదని స్పష్టం చేశారు. ఏడో సీఐఐ అంతర్జాతీయ ఇంధన సదస్సులో మాట్లాడిన పూరి ఈ మేరకు వ్యాఖ్యానించారు. "ఎవరో రాస్తారు, వదంతులు వ్యాప్తి చేస్తారు. ఆ తర్వాత నన్ను స్పందించమని అడుగుతారు. ఇది సరికాదు. ఇది న్యాయం కాదు. మీ దగ్గర ఏదైనా పక్కా సమాచారం ఉంటే, నాకు చెప్పండి. కానీ నాకు అలాంటి ప్రతిపాదన గురించి తెలియదు." అని పూరి అన్నారు.

ఇటీవలి ప్రపంచ అంతరాయాల సమయంలో కూడా భారతదేశ ఇంధన రిటైల్ నెట్‌వర్క్ పూర్తిగా నిలకడగా ఉందన్నారు. దీనికి వైవిధ్యభరితమైన ముడి చమురు సేకరణ, పటిష్టమైన మౌలిక సదుపాయాలు, విశ్వసనీయమైన అంతర్జాతీయ భాగస్వామ్యాలు, సాంకేతిక ఉన్నతీకరణలు, వ్యూహాత్మక నిల్వలే కారణమన్నారు. భారతదేశం ప్రస్తుతం సుమారు 74 రోజుల రిజర్వ్ సామర్థ్యాన్ని కలిగి ఉందని తెలిపారు. భారతదేశం ఇప్పుడు ప్రపంచంలో మూడో అతిపెద్ద ఇంధన వినియోగదారు, దిగుమతిదారుగా అలాగే నాల్గో అతిపెద్ద రిఫైనర్‌గా ఉందన్నారు. ఇంధన డిమాండ్ ప్రపంచ సగటు కంటే సుమారు మూడు రెట్లు వేగంగా పెరుగుతోందని పూరి పేర్కొన్నారు.

## బీజేపీ, ఆరెస్సెస్ మధ్య సమన్వయం కొరవడింది

బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్) మధ్య సమన్వయం లోపించిందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే విమర్శించారు. జెన్-జీ యువతపై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను బీజేపీ నేతలు పరిగణనలోకి తీసుకోవాలని ఆయన సూచించారు. శుక్రవారం మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంబైలో జెన్-జీ, జెన్-ఆల్ఫా విద్యార్థులతో జరిగిన కార్యక్రమంలో మోహన్ భగవత్ చేసిన ప్రసంగాన్ని ఈ సందర్భంగా దీప్కే ప్రస్తావించారు. "నిరసనలు తెలుపుతున్న జెన్-జీ యువత దేశ వ్యతిరేకులు కాదు, వారి ఆందోళనల్లో నిజాయతీ ఉంది, వారికి నిరసన తెలిపే హక్కు ఉంది" అని మోహన్ భగవత్ స్పష్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. బీజేపీకి మార్గదర్శిగా ఉన్న భగవత్ మాటలను ఆ పార్టీ నాయకత్వం వినాలని హితవు పలికారు. గతంలో జంతర్ మంతర్ వద్ద నిరసనలు జరిగినప్పుడు బీజేపీ నేత నితిన్ నబిన్ ఆందోళనకారులను 'వైరస్' అని, కేంద్ర మాజీ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'ఉగ్రవాదుల బీ టీమ్' అని వ్యాఖ్యానించిన విషయాన్ని అభిజిత్ దీప్కే గుర్తు చేశారు. వారి మార్గదర్శి మాటలనే బీజేపీ నేతలు ఖాతరు చేయకపోవడం సరికాదని ఆయన అన్నారు. ఈ అంశంపై మోహన్ భగవత్ నేరుగా బీజేపీ నాయకత్వంతో మాట్లాడాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ భిన్నమైన వైఖరులు విస్తృత సంఘ్ పరివార్‌లో ఉన్న అంతర్గత విభేదాలను సూచిస్తున్నాయని అభిజిత్ దీప్కే పేర్కొన్నారు. తమ పార్టీ ఏ రాజకీయ భావజాలానికి కట్టుబడి ఉండదని, కేవలం దేశం, యువతకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే బృందంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## భయపడొద్దు, నేనున్నాను:

ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీయేలోని నూతన మిత్రపక్షాలకు, ముఖ్యంగా తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), శివసేన (ఉద్ధవ్ వర్గం) నుంచి వచ్చిన రెబల్ ఎంపీలకు కీలక భరోసా ఇచ్చారు. "ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు, నేను మీకు అండగా ఉంటాను" అని ఆయన అభయమిచ్చారు. శుక్రవారం ఉదయం తన నివాసంలో సుమారు 45 మంది ఎన్డీయే ఎంపీలతో ఏర్పాటు చేసిన అల్పాహార సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు పదేపదే అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తృణమూల్ రెబల్స్‌తో ఏర్పడిన నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ), ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి ఏక్‌నాథ్ షిండే వర్గంలో చేరిన శివసేన ఎంపీలు, ఎన్సీపీ (అజిత్ పవార్) సభ్యులు పాల్గొన్నారు. సభలో గందరగోళం కారణంగా కొత్త ఎంపీలకు మాట్లాడే అవకాశం రాకపోవడం అన్యాయమని ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, పార్లమెంటును ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పార్లమెంటు చరిత్రను అధ్యయనం చేసి, చర్చలకు సిద్ధం కావాలని ఎంపీలకు సూచించారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితేనే దేశం పురోగమిస్తుందని పేర్కొంటూ, తమ నియోజకవర్గాల అభివృద్ధి పనుల నిమిత్తం నేరుగా ప్రధానమంత్రి కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. "ఎన్డీయే ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీకి, ప్రతి ఎంపీకి తగిన గౌరవం ఉంటుంది. నేను ప్రతి ఎంపీకి అండగా ఉంటాను" అని మోదీ హామీ ఇచ్చారు. అనంతరం ఆయన ప్రతి ఒక్కరితో వ్యక్తిగతంగా మాట్లాడారు. ముఖ్యంగా మహారాష్ట్రకు చెందిన షిండే వర్గం ఎంపీలతో మరాఠీలో సంభాషించడం విశేషం.

## ఎఫ్‌సీఆర్ఏ బిల్లు మా అంతర్గత విషయం



విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లు-2026 (ఖీజ=ూా)పై అమెరికా కాంగ్రెస్ సభ్యుడు చేసిన విమర్శలను భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. ఇది పూర్తిగా తమ అంతర్గత వ్యవహారమని, దీనిపై ఇతరుల వ్యాఖ్యలు అనవసరమని స్పష్టం చేసింది. విదేశీ నిధుల నియంత్రణకు సంబంధించి అమెరికాతో సహా ప్రపంచంలోని అనేక దేశాల్లో కఠినమైన చట్టాలు అమలులో ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేసింది. అమెరికాకు చెందిన రిపబ్లికన్ పార్టీ ప్రతినిధి రైలీ మూర్ ఆగస్టు 4న మాట్లాడుతూ, ఎఫ్‌సీఆర్ఏ బిల్లు క్రైస్తవులపై జరుగుతున్న స్పష్టమైన దాడి అని ఆరోపించారు. ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రద్దయినా లేదా పునరుద్ధరణ జరగకపోయినా.. చర్చిలు, మతపరమైన స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం తన నియంత్రణలోకి తీసుకునే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ విమర్శలపై గురువారం విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. భారత్‌లో చట్టాల రూపకల్పనకు పటిష్ఠమైన ప్రజాస్వామ్య ప్రక్రియ ఉందని, దేశీయ చట్టాలను సరైన కోణంలో అర్థం చేసుకోవాలని ఆయన సూచించారు. విదేశాల నుంచి వచ్చే విరాళాలను నియంత్రించే 2010 నాటి చట్టానికి సవరణలు చేస్తూ ప్రభుత్వం ఈ కొత్త బిల్లును ప్రతిపాదించింది. దీని ప్రకారం, ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్ రద్దయిన లేదా గడువు ముగిసిన సంస్థల ఆస్తులను, విదేశీ విరాళాలను నిర్వహించడానికి ప్రభుత్వం నియమించిన అధికారికి అధికారాలు లభిస్తాయి. అయితే, ప్రార్థనా స్థలాల మతపరమైన స్వభావాన్ని యథాతథంగా కాపాడతామని ఈ బిల్లులో స్పష్టం చేశారు.

## ప్రశాంత్ కిశోర్‌తో డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ భేటీ



మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ అధినేత్రి సునేత్ర పవార్ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో సమావేశం కావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ పరిణామంపై అధికార మహాయుతి కూటమిలోని బీజేపీ స్పందించింది. కూటమిలో అనుమానాలకు, విభేదాలకు తావిచ్చే చర్యలకు పాల్పడవద్దని మిత్రపక్షమైన ఎన్సీపీకి పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసింది. ముంబైలోని సునేత్ర పవార్ అధికారిక నివాసం 'దేవగిరి'లో గురువారం ఈ భేటీ జరిగింది. ఆమె కుమారుడు, ఎన్సీపీ నేత పార్థ్ పవార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. గంటల తరబడి సాగిన ఈ చర్చల్లో పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై మంతనాలు జరిపినట్లు ఎన్సీపీ వర్గాలు వెల్లడించాయి. ఈ ఏడాది జనవరిలో తన భర్త, మాజీ ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత సునేత్ర పవార్, ప్రశాంత్ కిశోర్‌తో భేటీ కావడం ఇది రెండోసారి. ఈ భేటీపై మహారాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ బవాన్‌కులే స్పందించారు. "కూటమిలో చీలికలు తెచ్చే ఎలాంటి చర్యలకు పూనుకోవద్దు" అని ఆయన హితవు పలికారు. ఇది ఎన్సీపీ అంతర్గత వ్యవహారమే అయినప్పటికీ, మహాయుతిలోని భాగస్వామ్య పక్షాలన్నీ కూటమి ధర్మానికి కట్టుబడి ఉండాలని, మిత్రపక్షాలను ఇబ్బంది పెట్టే పనులు చేయకూడదని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల బీహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో ప్రశాంత్ కిశోర్ విజయం సాధించడం గమనార్హం. గత మూడు దశాబ్దాలుగా బీజేపీకి కంచుకోటగా ఉన్న బంకిపూర్ నియోజకవర్గంలో ప్రశాంత్ కిశోర్ గెలుపొందిన నేపథ్యంలో, ఈ భేటీకి మరింత ప్రాధాన్యత ఏర్పడింది. అయితే, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపైనే చర్చించినట్లు ఎన్సీపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137